ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 03.03.2025 | సంపుటి : 11 సంచిక : 231 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370








## పుకార్లు ఉత్తవే..

వారంతా ఒక్కటిగా ఉన్నారు

థరూర్ పార్టీ మార్పు వార్తల వేళ రాహుల్ స్పందన

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఆ పార్టీని వీడే అవకాశం ఉన్నట్లు కొద్దిరోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఇటీవల ఢిల్లీలో

మిగతా 2లో..



## నేనో నమ్మకమైన కాంగ్రెస్ కార్యకర్తను..

బ్లాక్‌మెయిల్ చేయడం నా రక్తంలోనే లేదు

పార్టీ మార్పు ఊహాగానాలను కొట్టిపారేసిన డీకే శివకుమార్

ఉడిపి(జనంసాక్షి): పార్టీ మారుతారని వస్తోన్న ఊహాగానాలపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరోసారి స్పందించారు. తాను కాంగ్రెస్‌కు నమ్మకమైన కార్యకర్తనని, పార్టీపై,

మిగతా 2లో..

# వనపర్తితో నా బంధం బలమైనది



- బీఆర్‌ఎస్ బిజెపి ఒక్కటై ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు
- వారు తెలంగాణ అభివృద్ధి నిరోధకులు
- కిషన్ రెడ్డి పగతో సైంధవుడులా అడ్డుపడుతున్నాడు
- వనపర్తి బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- జిల్లాలో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

## నాకు చదువుతోపాటు సంస్కారమూ నేర్పించింది

- పాలమూరును పసిడిపంటల జిల్లాగా మారుస్తా
- 25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం

వనపర్తిబ్యూరో(జనంసాక్షి): వనపర్తి తనకు చదువుతో పాటు సంస్కారం నేర్పించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వనపర్తి విద్యార్థిగా తెలంగాణకు వన్నెతెచ్చాడనే కీర్తి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన-ప్రగతి బాట' బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. "గతంలో వనపర్తి రాజకీయాల్లో కక్షలు, ధన ప్రభావం ఉండేది కాదు. ఐదేళ్ల క్రితం ఇక్కడి నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే రాజకీయాలను కలుషితం చేశారు. కేసీఆర్ పదేళ్లు తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్నారు. మోదీ 12 ఏళ్లుగా ప్రదానిగా ఉన్నారు. తెలంగాణకు భాజపా, భారాస ఏం చేశాయి? ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ జరిగిందా? లేదా? చెప్పాలని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నా. భారాస, భాజపా నాయకుల తప్పుడు ప్రచారాన్ని రైతులు తిప్పికొట్టాలి. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నా ఎక్కడైనా కోతలు విధించామా? రూ.200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తు న్నామా?లేదా? మహలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నాం. 65 లక్షల మంది మహిళలు స్వయంసహాయక

మిగతా 2లో..

# బురదరాజకీయాలొద్దు

## ఎల్ఎల్‌బీసీ ప్రమాదానికి గత పాలకులే కారణం : సీఎం రేవంత్ రెడ్డి

ఎలాంటి ప్రాణనష్టం జరుగొద్దు.. అవసరమైతే రోబోల సాయం తీసుకోండి

- ప్రమాదాలు జరిగినప్పుడు రాజకీయాలు చేయడం సరికాదు
- సొరంగంలో గల్లంతైన వారి కుటుంబాలకు అన్ని పార్టీలు అండగా ఉండాలి
- జాతీయ స్థాయిలో నిపుణులైన సంస్థలు, ప్రైవేటు ఏజెన్సీలు సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయి
- ఈ ఆపరేషన్ కొలిక్కి రావడానికి మరో రెండుమూడ్రోజుల సమయం పడుతుంది
- టన్నెల్‌లోకి వెళ్లి స్వయంగా సహాయక చర్యలను పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి



స్వయంగా ఎల్ఎల్‌బీసీ టన్నెల్‌లోకి వెళ్లి కొనసాగుతున్న సహాయక చర్యలపై ఆరా తీస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి

నాగర్‌కర్నూల్(జనంసాక్షి):ఎలాంటి ప్రాణ నష్టం ఉండకూడదనే ఉద్దేశంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో మనుషులు, మిషిన్లతో పాటు అవసరమైతే రోబోల సాయం తీసుకునే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత రెడ్డి అధికారులను ఆదేశించారు. సొరంగంలో 8మంది గల్లంతైన నేపథ్యంలో సహాయకచర్యలను సీఎం, మంత్రులు టన్నెల్‌లోకి వెళ్లి స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎస్ఎల్‌బీసీ వద్ద అన్ని విభాగాల అధికారులు, ఏజెన్సీలతో సహాయక చర్యలపై సమీక్షించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు."ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను 2005-06లో ప్రారంభించారు. 2014 తెలంగాణ ఏర్పడే నాటికి 32 కిలోమీటర్ల టన్నెల్ పూర్తయింది. కానీ, గత పదేళ్లుగా

మిగతా 2లో..



## మార్చి 31 లోగా రైతు భరోసా అందిస్తాం

రైతుబంధు పేరుతో బిఆర్‌ఎస్ పాలకులు మొసలి కన్నీరు కారుస్తున్నారు

గత ప్రభుత్వంలో రుణమాఫీ ఎందుకు చేయలేకపోయారు?: డిప్యూటీ సీఎం భట్టి

2లో



చిన్ననాటి స్నేహితులను కలిసి

## పులకరించిన ముఖ్యమంత్రి

సీఎం హోదాలో కలిసి ఆనాటి మధుర జ్ఞాపకాలు పంచుకున్న రేవంత్‌రెడ్డి

2లో



తెలంగాణ శాసనసభ, శాసన మండలి

## ప్రోరోగ్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నోటిఫికేషన్

బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో నిర్ణయం

2లో

# ఆకాశ్ ఔట్..

## మాయావతి సంచలన నిర్ణయం

మేనల్లుడు ఆకాశ్‌ను పార్టీ బాధ్యతల నుంచి తొలగించిన బీఎస్పీ అధ్యక్షురాలు



లక్నో(జనంసాక్షి): బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షురాలు మాయావతి తన రాజకీయ వారసుడిగా మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా తాజాగా నిర్వహించిన పార్టీ సమావేశం అనంతరం ఆకాశ్ విషయంలో ఆమె సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీకి చెందిన అన్ని పదవుల నుంచి అతడిని తొలగిస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న అతడి తండ్రి

మిగతా 2లో..

## ఓ కేంద్రమంత్రి కుమార్తెకే ఇలాంటి పరిస్థితా?



- ఇక సాధారణ మహిళల సంగతి తలచుకుంటే భయమేస్తోంది
- మహారాష్ట్రలో శాంతిభద్రతలపై కేంద్ర మంత్రి ఖడ్సే ఆందోళన

వార్త 2లో

# మరో నీటి యుద్ధానికి సిద్ధమే

## రైతుల కష్టాలు తీర్చడానికి రోడ్డెక్కుతాం : కేటిఆర్

అవసరమైతే మంత్రి ఉత్తమ్ ఇంటి ధర్నా చేస్తామని హెచ్చరిక



ఎల్లారెడ్డిపేట (జనంసాక్షి): నీళ్ల మరో యుద్ధానికైనా సిద్ధమేనని, అవసరమైతే మంత్రి ఉత్తమ్ ఇంటి ధర్నా చేస్తామని కేటిఆర్ హెచ్చరించారు. మల్కపేట రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేయకుంటే రైతుల కోసం రోడ్డు ఎక్కుతామని, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి ఇంటి ముందు కూర్చుంటానని మాజీ మంత్రి, సిరిసిల్ల నియోజకవర్గ శాసనసభ్యులు కేటిఆర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని దేవుని గుట్ట తండాలో ఆదివారం కేటిఆర్ సందర్శించారు. సాగునీరు అందక రైతుల పొలాలు ఎండిపోతున్నాయని, వారికి ధైర్యం ఇవ్వడానికి వచ్చానని కేటీఆర్ అన్నారు. సంబంధిత మంత్రితో మాట్లాడడం జరిగిందని రెండు రోజులలో నీటిని విడుదల చేస్తానని హామి ఇచ్చారన్నారు. రెండు రోజుల్లో నీటిని విడుదల

మిగతా 2లో..

## రెండున్నరేళ్లలో మామునూరు పూర్తిచేస్తాం

రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించకపోవడం వల్లే ఎయిర్ పోర్టు నిర్మాణం ఆలస్యమైంది

మేం కేవలం ఎనిమిది నెలల్లో క్లియరెన్స్ ఇచ్చాం : కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

మోదీ ప్రధాని అయ్యాక విమానయాన రంగంలో ఓ విప్లవం మొదలైందని వెల్లడి



హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించకపోవడం వల్లే మామునూరు విమానాశ్రయం ఏర్పాటు ఆలస్యమైందని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.కేంద్రం ఒత్తిడి వల్ల భూ కేటాయింపులు జరగడంతో ఎనిమిది నెలల్లోనే క్లియరెన్స్ ఇచ్చామని రామ్మోహన్ నాయుడు వివరించారు. హైదరాబాద్ కవాడీగూడలో కేంద్రమంత్రి

మిగతా 2లో..

కాంగ్రెస్ పాలనలో

## రైతుల కష్టాలు తిరోగమనం


ఎన్నికలకోడ్‌తో ముడిపెట్టకుండా సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

బిఆర్‌ఎస్ హయంలో నూనె పంటలకు ప్రోత్సాహం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్(జనంసాక్షి):బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నూనె గింజల ఉత్పత్తిని పెంచదానికి రైతులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడం జరిగింది. సమయానికి రైతుబంధుతో పాటు సబ్సిడీలు అందజేసి నూనె గింజల పంటలను సాగు చేసేలా ప్రోత్సాహం కల్పించాము. సాగునీటికి ఇబ్బందులు రాకుండా

మిగతా 2లో..





# ఉక్రెయిన్‌కు ఊరట

యూకేతో 3.1 బిలియన్ డాలర్ల రుణ ఒప్పందం కుదుర్చుకున్న జెలెన్‌స్కీ

అన్ని విధాల అండగా ఉంటామన్న ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్

పారిస్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో వివాదం తర్వాత యూకే పర్యటనకు వెళ్లిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి కొంత ఊరట లభించింది. ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 3.1 బిలియన్ డాలర్ల విలువైన రుణ ఒప్పందంపై ఇరుదేశాధినేతలు సంతకాలు చేశారు. ఈ నిధులను ఉక్రెయిన్ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి ఉపయోగించనున్నట్లు జెలెన్‌స్కీ తెలిపారు. 'యూకే ప్రధాని స్టార్మర్‌తో ఉక్రెయిన్ సహా యూరప్ మొత్తం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించా. కీవ్ బలోపేతం కావడంతోపాటు.. యుద్ధాన్ని ముగించేందుకు తీసుకోవాల్సిన చర్యలు కూడా మా మధ్య చర్చకు వచ్చాయి. మా రక్షణ సామర్థ్యాలను ఈ రుణ ఒప్పందం బలపరుస్తుంది. ఉక్రెయిన్‌లో ఆయుధ తయారీకి వీటిని ఉపయోగిస్తాం. యుద్ధం ప్రారంభం నుంచి అండగా ఉన్న యూకే ప్రభుత్వానికి, ప్రజలకు కృతజ్ఞతలు. ఇలాంటి వ్యూహాత్మక భాగస్వామి లభించడం మా అదృష్టం' అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధంపై ఐరోపా దేశాధినేతలతో స్టార్మర్ ఏర్పాటు చేసిన సమావేశానికి జెలెన్‌స్కీ హాజరుకానున్నారు. ఈ పర్యటన వేళ బ్రిటన్

మిగతా 2లో..

చరిత్ర సృష్టించిన

## బ్లూ ఘోస్ట్..

జాబిల్లిపై సురక్షితంగా అడుగుపెట్టిన తొలి ప్రైవేటు ల్యాండర్

న్యూయార్క్(జనంసాక్షి): అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ చరిత్ర సృష్టించింది. ఈ సంస్థ ప్రయోగించిన 'బ్లూ ఘోస్ట్' అనే వ్యోమనౌక జాబిల్లి ఉపరితలంపై విజయవంతంగా ల్యాండ్ అయ్యింది. ఫైర్‌ఫ్లైకు చెందిన మిషన్ కంట్రోల్ ఈ విషయాన్ని నిర్ధరించింది. 'చంద్రుడిపై ఉన్నాం. ల్యాండర్ స్థిరమైన స్థితిలో ఉంది' అని ప్రకటించింది. తద్వారా చందమామపై కూలిపోకుండా, పడిపోకుండా.. సరైన స్థితిలో

మిగతా 2లో..



## ఒప్పందాన్ని కొనసాగించకపోతే గాజాకు మానవతా సాయాన్ని

# అడ్డుకుంటాం

తొలిదశ కాల్పుల విరమణను పొడిగించేందుకు అంగీకరించకపోతే తీవ్రపరిణామాలుంటాయి

హమాస్‌కు ఇజ్రాయెల్ హెచ్చరిక



టెల్అవీవ్(జనంసాక్షి):తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఇజ్రాయెల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, దీనికి హమాస్ నిరాకరించింది. దీంతో గాజాకు అందే మానవతాసాయాన్ని తాము అడ్డుకుంటామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రధాని కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 'తొలి దశ ఒప్పందం ముగియడంతో దాన్ని కొనసాగించే ప్రతిపాదనను మేము అంగీకరించాం. కానీ, హమాస్ నిరాకరించింది. ఈ నేపథ్యంలోనే నేటి ఉదయం నుంచి గాజాలోకి వెళ్లే అన్ని వస్తువుల సరఫరాలను నిలిపివేయాలని ప్రధాని నెతన్యాహు నిర్ణయించు కున్నారు. మా బందీలను విడుదల చేయకుండా పూర్తిస్థాయి కాల్పుల విరమణకు అంగీకరించేది లేదు. ఈ ప్రతిపాదనకు అంగీకరించకపోతే ఆ సంస్థ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని ఆ ప్రకటనలో హెచ్చరించింది.ఇటీవల ఈజిప్టు, ఖతార్ దేశాల మధ్యవర్తిత్వంలో ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే.

మిగతా 2లో..



## బొలీవియాలో ఘోర రోడ్డు ప్రమాదం


2 బస్సులు ఢీకొని 37 మంది దుర్మరణం

బొలీవియా(జనంసాక్షి):బొలీవియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు బస్సులు ఢీకొన్న ఘటనలో 37 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 39 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను దగ్గర్లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతివేగమే

మిగతా 2లో..

## నా కఠిన చర్యలతో అమెరికాలో అక్రమ వలసలు

# గణనీయంగా తగ్గాయి



ఇంతటితో మా దేశంపై అక్రమ వలసదారుల దండయాత్ర ముగిసింది

చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించాలని ప్రయత్నిస్తే తీవ్రపరిణామాలు ఉంటాయి: ట్రంప్

న్యూయార్క్(జనంసాక్షి):తాను తీసుకున్న చర్యల వల్లే అమెరికా-మెక్సికో సరిహద్దుల్లో అక్రమ వలసలు భారీగా తగ్గినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు.అక్రమ వలసదారులను ఆయన ఆదేశాల మేరకు ప్రత్యేక విమానాల్లో వారి స్వదేశాలకు తిరిగి పంపిన విషయం తెలిసిందే. తాను విధించిన కఠినమైన ఇమిగ్రేషన్ విధానాలతో ఫిబ్రవరిలో అక్రమ వలసల సంఖ్య చరిత్రలోనే అతి తక్కువ స్థాయికి చేరాయని ట్రంప్ వెల్లడించారు. ఇంతటితో అమెరికాపై అక్రమ వలసదారుల దండయాత్ర ముగిసిందని అభివర్ణించారు. ఫిబ్రవరిలో కేవలం 8,326 మంది అక్రమ వలసదారులు మాత్రమే దేశ సరిహద్దుల్లో పట్టుబడ్డారని ట్రంప్ పేర్కొన్నారు. జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో ప్రతినెలా దేశంలోకి మూడు లక్షలమంది అక్రమంగా ప్రవేశించేవారని గుర్తు చేశారు. ఈ గణాంకాలకు సంబంధించి సీబీపీ విడుదల చేసిన నివేదికలను ఉటంకించారు. దాదాపు 95 శాతం వలసలు తగ్గినట్లు వెల్లడించారు. తన పాలనలో ఎవరైనా చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించాలని

మిగతా 2లో..

## ఉక్రెయిన్‌కు ఊరట

రాజు ఛార్లెస్‌తోనూ సమావేశమయ్యే అవకాశం ఉంది. అంతకుముందు.. జెలెన్‌స్కీ లండన్‌లోని 10-డౌనింగ్ స్ట్రీట్‌కు చేరుకోగా స్టార్మర్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌కు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రష్యా చేస్తున్న యుద్ధానికి తెర దించేలా శాంతి ఒప్పందం కుదర్చడం, దానికి బదులుగా ఉక్రెయిన్‌లోని అరుదైన ఖనిజాల తవ్వకానికి అనుమతించాలని అమెరికా ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. దీనిపై చర్చించేందుకు శ్వేతసౌధానికి వెళ్లిన జెలెన్‌స్కీ.. భవిష్యత్తులో తమపై రష్యా ఏదైనా దురాక్రమణకు పాల్పడితే రక్షణ కల్పించాలని అమెరికాపై ఒత్తిడి చేశారు. ఇది ట్రంప్‌నకు ఆగ్రహం తెప్పించింది. దీంతో వివాదాదం చోటుచేసుకొని చర్చలు అర్ధంతరంగా ముగిశాయి. దీంతో ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోకుండానే జెలెన్‌స్కీ వైట్‌హౌస్ నుంచి వెళ్లిపోయారు.

## పుకార్లు ఉత్తవే..

జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశం సందర్భంగా కేరళలోని పార్టీ నాయకులంతా కలిసి నిల్చొన్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ..'వారంతా అంటే ఐక్యంగా ఉన్నారు, తమ ముందున్న లక్ష్యాల వెలుగులో వారంతా ఒక్కటిగా కనిపిస్తున్నారు' అంటూ టీమ్ కేరళ అనే హ్యాష్‌ట్యాగ్‌తో రాసుకొచ్చారు.అయితే ఆ నాయకులలో పార్టీ సీనియర్ నేత శశిథరూర్ సైతం ఉండడంతో ఆయన పార్టీ మార్పు ఊహాగానాలకు రాహుల్ ఫుల్‌స్టాప్ పెట్టినట్లు అయ్యింది. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలో ఆయన వ్యవహరించిన తీరును థరూర్ ప్రశంసించడం, కేరళలో వామపక్ష కూటమి సర్కారు విధానాలను మెచ్చుకుంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు, కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, బ్రిటన్ సెక్రటరీ ఆఫ్ ట్రేడ్ జోనాథన్ రేనాల్డ్స్‌తో కలిసి ఉన్న ఫొటోను ఆయన షేర్ చేయడం, కాంగ్రెస్ పార్టీకి తన అవసరం లేదనుకుంటే..తన ముందు చాలా ప్రత్యామ్నాయాలు ఉన్నాయని పార్టీకి సందేశం పంపడం వంటి చర్యల నేపథ్యంలో థరూర్ కాంగ్రెస్‌ను వీడి భాజపాలో చేరనున్నారనే ఊహాగానాలు వెలువడ్డాయి. కాగా ఈ వార్తలను థరూర్ కొట్టిపడేశారు.అనంతరం కాంగ్రెస్ అగ్రనేత వారం రోజుల క్రితం పలుమార్లు శశిథరూర్‌ను కలిసి చర్చలు జరిపారు. ఈ క్రమంలో రాహుల్ పోస్ట్ ప్రాధాన్యం సంతరించుకుంది. 2026లో జరగనున్న కేరళ అసెంబ్లీ ఎన్నికల వ్యూహంపై పార్టీ అధిష్టానం కేరళ నేతలతో ఈ సమావేశంలో చర్చించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సమావేశంలో శశిథరూర్, రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ, కేరళ యూనిట్ చీఫ్ కే సుధాకరన్, కేరళ అసెంబ్లీ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్పీ) నాయకుడు వీడీ సతీశన్, పార్టీ కేరళ ఇంఛార్జి దీపా దాస్‌మున్షీ పాల్గొన్నారు.

## నేనో నమ్మకమైన కాంగ్రెస్ కార్యకర్తను

గాంధీ కుటుంబం పట్ల తనకున్న నిబద్ధతను ఎవరైనా ప్రశ్నిస్తే అది వారి భ్రమే అవుతుందన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో మళ్లీ తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు."ఎవ్వరికీ ఎలాంటి షరతులు పెట్టలేదు. అటువంటి షరతులు పెట్టాల్సిన అవసరం లేదు. నేనో నమ్మకమైన కార్యకర్తను. పార్టీ ఏం చెబితే దాని ప్రకారం నడుచుకుంటా. కండీషన్లు పెట్టడం, బ్లాక్‌మెయిల్ చేయడం నా రక్తంలోనే లేదు" అని డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఇటీవల దిల్లీ పర్యటనలో భాగంగా అధిష్ఠానానికి కొన్ని షరతులు విధించారని వస్తోన్న వార్తలకు డీకే ఈ విధంగా స్పందించారు. ఎవరైనా, ఏ పార్టీకి చెందినవారైనా.. పార్టీపై, గాంధీ కుటుంబం పట్ల నా నిబద్ధతను ప్రశ్నిస్తే అది వారి భ్రమే అవుతుందన్నారు. 2.5ఏళ్లు సీఎం ఫార్ములా అవాస్తవమా? అన్న ప్రశ్నకు బదులిస్తూ.. 2028లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని మాత్రమే చెప్పగలనని అన్నారు. కర్ణాటకలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీకి.. ముఖ్యమంత్రి ఎంపిక విషయం సవాలుగా మారింది. సిద్ధరామయ్య, డీకేఎస్ మధ్య తీవ్ర పోటీ నెలకొనడమే అందుకు కారణమైంది. తీవ్ర కసరత్తు అనంతరం సిద్ధరామయ్యకు సీఎం, శివకుమార్‌కు ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించింది. అయితే, చెరో రెండున్నరేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగేందుకు ఇరువురు నేతలు అంగీకరించారనే వార్తలు అప్పట్లో వచ్చాయి. దానిపై పార్టీ నుంచి ఎటువంటి సమాచారం లేనప్పటికీ.. ఇప్పటికీ ఈ వాదన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా కొనసాగుతూనే ఉంది.

## మరో నీటి యుద్ధానికి సిద్ధమే

చేయకుంటే రైతుల పక్షాన ఉద్యమాలు చేస్తామన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసిఆర్ 1500 ఎకరాలను కాపాడడానికి ఈ కాలువను నిర్మించడం జరిగిందన్నారు. కాళేశ్వరం నీళ్లు వచ్చాయని చాల ఆశతో పంటలు వేసుకోవడమే కాకుండా కొత్తగా 150 కొత్త మొటర్లు కొనుగోలు చేసి కాలువల మీద మోటర్లు పెట్టుకొని ఆ నీళ్లు వస్తే సాగు అవుతాది, మా జీవితాలు మేము ఆశించిన విధంగా మంచిగా అవుతాయని రైతులందరు డిసెంబర్, జనవరి మాసంలో వరి పంట నాటు వేశారన్నారు. వేసిన తరువాత కేసిఆర్ మీద కోపంతో కుట్రపూరితంగా అక్కడి నుండి నీళ్లు తీసుకోకుండా కాళేశ్వరం పాడైపోయింది అని చెప్పి అసత్యపు ప్రచారం చేశారని, దాని వల్ల రాష్ట్రంలో పంటలు ఎండిపోవడం జరుగుతుందన్నారు. మల్కపేట వద్ద గేట్లు ఎత్తి నీటిని అందించడానికి ప్రభుత్వానికి ఇబ్బంది అవుతుందని ఆరోపించారు. కేటిఆర్ వెంట బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, మాజీ జడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్, మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, ఫ్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు చాంద్‌పాష, అందె సుభాష్, నరసింహారెడ్డి, జబ్బార్‌లు ఉన్నారు.


### కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలు తిరోగమనం

చర్యలు తీసుకున్నాము. నాటి ప్రణాళికా బద్దంగా నేడు తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున నూనె పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పొద్దుతిరుగుడు(సన్ ఫ్లవర్) పంట కోతకు వచ్చింది. సన్ ఫ్లవర్ గింజలను విక్రయించడానికి ఇప్పటిదాకా రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉంది. దీనివల్ల రైతులు రూ. 5,500 నుండి రూ. 6000 వరకు దళారులకు క్వింటాల్ చొప్పున విక్రయిస్తున్న పరిస్థితి దాపురించింది. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాఫెడ్ ద్వారా సన్ ఫ్లవర్ నూనె గింజలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేశాము. ఈసారి కూడా రూ. 7280 మద్దతు ధరను నాఫెడ్ ప్రకటించింది. కానీ ఇప్పటిదాకా కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులకు విక్రయించడం వల్ల క్వింటాల్ కు రూ. 1000 నుండి రూ. 2000 వరకు నష్టాన్ని చవిచూడాల్సిన దుస్థితి రైతులకు కలిగింది. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా సన్ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతుల పక్షాన నేను డిమాండ్ చేస్తున్నాను. మీ అలసత్వం కారణంగా తెలంగాణ వ్యవసాయం తిరో గమన దిశలో పయనిస్తున్నది. నూనె పంటలు వేయాలంటేనే రైతులు ఆందోళన చెందే పరిస్థితులను మీరు కల్పిస్తున్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరవండి.. క్షేత్రస్థాయిలో సన్ఫ్లవర్ గింజలు పండించిన రైతుల కష్టాలను తొంగి చూడండి. రేపటి నుండే రాష్ట్రమంతటా సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా ఆదేశించండి. ఎన్నికల కోడ్ తో రైతుల కష్టాలకు ముడి పెట్టకుండా ఒక ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

## బొలీవియాలో ఘోర రోడ్డు ప్రమాదం

ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం 7 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) ఈ ప్రమాదం జరిగింది. ఉయుని, కొల్చాని రహదారిపై వెళ్తున్న రెండు బస్సులు ఢీకొన్నాయి. వీటిలో ఓ బస్సు లోయలోకి దూసుకెళ్లింది. అతివేగంతోనే ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణ వెల్లడైందని అక్కడికి అధికారులు తెలిపారు.

# వనపర్తితో నా బంధం బలమైనది





సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. సభ్యుల సంఖ్య కోటికి చేర్చాలని ప్రయత్నిస్తున్నాం. కోటి మంది ఆడ బిడ్డలను కోటీశ్వరులను చేయాలని కృషి చేస్తున్నాం.ఆడబిడ్డలు ఆశీర్వదిస్తే రేవంత్‌రెడ్డి మరో 15.. 20ఏళ్లు సీఎంగా కాంగ్రెస్ అధికారంలో ఉంటే .. తమ బతుకు బస్టాండ్ అవుతుందని భాజపా, భారాస నేతలు భయపడుతున్నారు. పదేళ్లుగా పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పండ బెట్టారని భారాస నేతలను అడుగుతున్నా. కృష్ణా జలాలను ఏపీ సర్కారు రాయలసీమకు కొల్లగొట్టుకు పోతుందంటే అందుకు కారణం కేసీఆర్. 811 టీఎంసీల్లో 511 టీఎంసీలు ఆంధ్రాకు తీసుకెళ్లండని కేసీఆర్ సంతకం పెట్టారు. ఆ సంతకమే ఇవాళ తెలంగాణ రైతాంగానికి శాపంగా మారింది. ఎస్ఎల్‌బీసీ పాపాల భైరవుడు కేసీఆర్ కాదా? పదేళ్ల భారాస పాలనలో ఎస్ఎల్‌బీసీ పనులు ఆగిపోవడం వల్లే కుప్పకూలింది.వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వివిధ అభివృద్ధి పనులకు ఏర్పాటు చేసిన శిలాఫలకాలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలో రూ. 40 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు, నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ. 510 కోట్లు, నూతన ఐటీ టవర్ భవన నిర్మాణానికి 22 కోట్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణాలకు రూ. 47.50 కోట్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు, 30 పడకల ఆస్పత్రి భవనము (పెబ్బేర్) నిర్మాణపు పనులకు రూ. 11.20 కోట్లు, శ్రీరంగాపూర్ ఆలయానికి పర్యాటకంగా అభివృద్ధి పరిచేందుకు 1.5 కోట్లు, రూ. 35 కోట్ల వ్యయంతో సి.ఆర్.ఆర్. రోడ్ల పనులు, వనపర్తి నియోజకవర్గంలో గిరిజన ఆవాసాల అభివృద్ధి పనులకు రూ. 12.60 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పనులకు ముఖ్య మంత్రి శంకుస్థాపనలు చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఈ జిల్లా బిడ్డ ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని,కృష్ణానది జలాలను ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ప్రతి సెంటు భూమికి సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక ఇచ్చిన ప్రతి గ్యారెంటీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నాం. ఉమ్మడి పాలమూరులో ఇప్పుడు ఉన్న ప్రతి ప్రాజెక్టు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మొదలుపెట్టినవే. మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆడబిడ్డల ఆర్థిక స్థితిగతులను ఏ విధంగా మెరుగుపరచాలి అని రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం మహిళల సాధికారిక పట్ల ఆలోచిస్తున్నారని తెలియజేశారు. ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడ్డాక వనపర్తి జిల్లాలో ఇప్పటివరకు 375 కోట్ల అభివృద్ధి పనులు చేసుకోవడం జరిగిందన్నారు.పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబె దుల్లా కొత్వాల్,వనపర్తి ఎం.ఎల్. ఏ తూడి మేఘా రెడ్డి,దేవరకద్ర ఎం.ఎల్. ఏ జి.మధు సూదన్ రెడ్డి, షాద్ నగర్ ఎం.ఎల్. ఏ వీర్లపల్లి శంకర్,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి,రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ యాస్మిన్ భాషా,రాష్ట్ర మైనార్టీ ఆర్థిక సంస్థ వి.సి.అండ్ ఎం.డి.కాంతి వెస్లీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి,డి.సి.సి.బి చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,ప్రజా ప్రతినిధులు, నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కృపతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థించినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి విచ్చేసి తన వంతు కృషి చేస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. రూ.1 కోటితో అభివృద్ధి పనులు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని ఇంకా అవసరం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులకు తెలిపారు.

**ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి రేవంతన్న భరోసా పథకాలను ప్రారంభం**

ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి పథకం,రేవంతన్న భరోసా పథకాన్ని వనపర్తి జిల్లాలో ఆదివారం ప్రారంభించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో వివిధ శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనే నిమిత్తం వచ్చిన రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్ లను సందర్శించారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 50 మంది క్రిస్టియన్, ముస్లిం, మైనార్టీ వర్గాల మహిళలకు కుట్టు మిషన్ లు పంపిణీ చేసారు.

## చిన్ననాటి స్నేహితులను కలిసి పులకరించిన సీఎం

వనపర్తి బ్యూరో(జనంసాక్షి): వనపర్తిలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివిన తనకు.. సొంత అక్కలా ప్రేమ, ఆప్యాయత చూపిన పార్వతమ్మ కుటుంబాన్ని ముఖ్యమంత్రి హోదాలో కలవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి పట్టణంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించడానికి వచ్చిన రేవంత్‌రెడ్డి.. పార్వతమ్మ ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు సీఎంకు సాదర స్వాగతం పలికారు. గతంలో వనపర్తి పట్టణంలోని పార్వతమ్మ ఇంట్లో అద్దెకు ఉండి ఇంటర్ వరకు చదివారు. ఆ నాటి జ్ఞాపకాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. పార్వతమ్మ కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి హోదాలో తన ఇంటికి తమ్ముడు రావడం పట్ల పార్వతమ్మ ఆనందభాష్పాలతో ఆహ్వానం పలికారు. కుటుంబ సభ్యులంతా సీఎంతో కలిసి ఫొటోలు దిగి ఆనందాన్ని పంచుకున్నారు.

## బురదరాజకీయాలొద్దు

భారాస ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీని పట్టించుకోలేదు. ఈ పనులు చేస్తున్న సంస్థ విద్యుత్ బిల్లులు చెల్లించలేదని విద్యుత్ సరఫరా కూడా నిలిపివేశారు. దీంతో గత పదేళ్లుగా టన్నెల్ పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ ప్రాంతానికి కృష్ణా జలాలు అందించాలని నిర్ణయించాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రాజెక్టును పూర్తి చేయాలని.. ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించాం. టన్నెల్ బోరింగ్ మిషన్‌కు కావాల్సిన విడి భాగాలను అమెరికా నుంచి తెప్పించి పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకున్నాం. కానీ, అనుకోకుండా ఈ దుర్ఘటన జరిగింది.ప్రమాదాలు జరిగినప్పుడు రాజకీయాలు చేయడం కాదు.. బాధిత కుటుంబాలను ఆదుకోవాలి. విపత్తు సమయంలో జాతీయ స్థాయిలో నిపుణులైన 11 కేంద్ర సంస్థలు, ప్రైవేటు ఏజెన్సీలు 9 రోజులుగా సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయి. గల్లంతైన 8మంది ఆచూకీ ఇప్పటి వరకూ తెలియలేదు. ఈ ఆపరేషన్ కొలిక్కి రావడానికి మరో రెండు.. మూడ్రోజుల సమయం పడుతుందని అధికారుల సమీక్షలో తేలింది. కన్వేయర్ బెల్ట్ పాడవటం వల్ల సిల్టు తొలగించేందుకు ఆటంకమేర్పడింది. రేపు సాయంత్రానికి కన్వేయర్ బెల్ట్ అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. మట్టి తీసిన తర్వాత మిషన్ తొలగించి, గల్లంతైన వారిని గుర్తించాల్సి ఉంటుంది. ఇలాంటి ప్రమాదంపై రాజకీయం చేయడం తగదు. సొరంగంలో గల్లంతైన కుటుంబాలకు అన్ని పార్టీలు అండగా ఉండాలి. మనో ధైర్యం కోల్పోలేదు.. మరింత పట్టుదలతో ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. టన్నెల్ పనుల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగకూడదనే ఉద్దేశంతో మనుషులు మిషిన్లతో పాటు అవసరమైతే రోబోలను వినియోగించాలని అధికారులను ఆదేశించా" అని తెలిపారు.

## మార్చి 31 లోగా రైతు భరోసా అందిస్తాం

మార్చి 31 లోగా రైతు భరోసా అందిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన కెసిఆర్ ప్రజా సమస్యలను పరిష్కరించలేని సన్యాసి అని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. వనపర్తి లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన అనంతరం జరిగిన సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గడిని దాటి బయటికి రాలేని కెసిఆర్ తో పాటు కేటీఆర్, హరీష్ లు తమ ప్రభుత్వంతో పాటు ముఖ్యమంత్రిని, మంత్రులను పాలన చేతకాని సన్నాసులు అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకున్న వాళ్లు ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించటం మానుకోవాలని హెచ్చరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న బి ఆర్ఎస్ నేతలను గ్రామాలకు వస్తే ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలు ఆనాడు మీ పాలనలో ఎందుకు చేయలేదని బి ఆర్ఎస్ నాయకులను ప్రశ్నించాలని ప్రజలను కోరారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనను సాగిస్తుందని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనులు చేపట్టిందని తెలిపారు.

## తెలంగాణ శాసనసభ, శాసన మండలి ప్రోరోగ్

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ శాసనసభ, శాసనమండలిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రోరోగ్ చేశారు. అందుకు అనుగుణంగా నోటిఫికేషన్ జారీ అయింది. డిసెంబరులో ప్రారంభమైన సమావేశాలను ప్రోరోగ్ చేయకుండానే మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం, ఎస్సీ వర్గీకరణ, కులగణన నివేదికలపై ప్రకటన కోసం కొనసాగించారు.తాజాగా ఉభయసభలను ప్రోరోగ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెలలో బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. దీంతో శాసనసభ, మండలిని ప్రోరోగ్ చేశారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించాల్సి ఉంటుంది. అసెంబ్లీ, మండలిని సమావేశపరిచేందుకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

## చరిత్ర సృష్టించిన బ్లూ ఘోస్ట్..

వ్యోమనౌకను ల్యాండ్ చేసిన తొలి ప్రైవేటు సంస్థగా నిలిచింది.ఫ్లోరిడాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి జనవరి 15న స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన ఫాల్కన్-9 రాకెట్.. బ్లూ ఘోస్ట్‌తోపాటు జపాన్‌కు చెందిన మరో ల్యాండర్ 'హకుటో-ఆర్2'ను నింగిలోకి తీసుకెళ్లింది. బ్లూ ఘోస్ట్ ల్యాండర్ పొడవు రెండు మీటర్లు. ఇది జాబిల్లి కక్ష్య నుంచి ఆటోపైలట్ మోడ్‌లో కిందికి ప్రయాణిస్తూ.. ఈశాన్య అంచున ఉన్న మోన్స్ లాట్రెయిల్ సమీపంలో దిగింది. తొలి ఫొటోను పంపించింది. అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా)కు సంబంధించిన 10 ప్రయోగాలను నిర్వహించనుంది. చందమామ ధూళిని సేకరించేందుకు వాక్యూమ్ వినియోగం, చంద్రుడి ఉపరితలం కింద ఉష్ణోగ్రతలను కొలవడానికి డ్రిల్లింగ్ చేయడం, వ్యోమగాముల స్పేస్‌సూట్‌లు, పరికరాలకు అంటుకునే హానికరమైన ధూళిని తొలగించే మరో పరికరాన్ని పరీక్షించడం తదితరాలు ఇందులో ఉన్నాయి.

## నా చర్యలతో అక్రమ వలసలు గణనీయంగా తగ్గాయి

ప్రయత్నిస్తే పెద్ద మొత్తంలో జరిమానాలు, తక్షణ బహిష్కరణను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.ట్రంప్ ప్రకటనను పలు వార్తా సంస్థలు తప్పుబట్టాయి. ఆయన చూపిన గణాంకాలు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయని దుయ్యబట్టాయి. అమెరికా కస్టమ్స్, బోర్డర్ ప్రొటెక్షన్ విడుదల చేసిన డేటాను ఫాక్స్ న్యూస్ పంచుకుంది. బైడెన్ అధికారంలో ఉన్న చివరి వారంలో దాదాపు 20,086 మంది అక్రమ వలసదారులను గుర్తించినట్లు పేర్కొంది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన మొదటి వారంలో 7,287 మంది పట్టుబడ్డారని వెల్లడించింది. అయితే అధ్యక్షుడు పేర్కొన్నట్లు ఈ సంఖ్యలో గణనీయమైన తగ్గుదల అనటం నిజం కాదని.. కేవలం 65శాతం మాత్రమే తగ్గాయని తెలియజేసింది.రెండోసారి అమెరికా పగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపారు. కఠిన నిర్ణయాలతో వారిని దేశం నుంచి సాగనంపే ప్రక్రియను వేగవంతం చేశారు. దీంతో అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా అక్రమంగా వలస వెళ్లిన కొందరు భారతీయుల్ని సైనిక విమానాల్లో వెనక్కి పంపించారు. భారత్ కూడా ఆ చర్యలకు మద్దతు పలికింది.

# రెండున్నరేళ్లలో మామునూరు పూర్తిచేస్తాం

కిషన్‌రెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. "మామునూరు ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్ ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ. ఈ విమానాశ్రయం గతంలో ఆసియాలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్టుగా ఉండేది. 1981 వరకు ఇక్కడి నుంచి రాకపోకలు కొనసాగేవి. క్రమేపీ హైదరాబాద్ అభివృద్ధి చెందడంతో ఎయిర్ పోర్ట్ హైదారాబాద్‌కు షిఫ్ట్ అయ్యింది. అయినప్పటికీ అక్కడి ప్రజలు అనేక పోరాటాలు చేశారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక విమానయాన రంగంలో ఓ విప్లవం మొదలైంది. పదేళ్లలో దేశంలోని ఎయిర్‌పోర్టుల సంఖ్య 79 నుంచి 150కి పెరిగింది. చిన్న చిన్న నగరాల్లోనూ ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేశాం. వరంగల్ వంటి నగరంలో ఎయిర్‌పోర్టు విషయంలో అడుగులు ముందుకుపడలేదు. తెలుగు ప్రజల మంత్రిగా పని చేయాలని చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. ఏపీ కోసం ఎలా పని చేస్తావో.. అదే చిత్తశుద్ధితో తెలంగాణ కోసం కూడా పనిచేయాలని సూచించారు. తెలంగాణలోనూ ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయాలని కిషన్‌రెడ్డి సూచించారు. మామునూరు ఎయిర్‌పోర్టు క్లియరెన్స్ విషయంలో కొన్ని సమస్యలు వచ్చాయి. ఎయిర్‌పోర్టుకు 2800 మీటర్ల రన్‌వే అవసరం. 280 ఎకరాలు అదనంగా భూసేకరణ అవసరమని కేంద్రం నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. గత ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేనందువల్లే ఆలస్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా భూసేకరణ చేస్తే ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం అవుతాయి. భూసేకరణ పూర్తయిన రెండున్నరేళ్లలో నిర్మాణం పూర్తి చేస్తాం. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఎన్‌వోసీ తీసుకొని క్లియరెన్స్ ఇచ్చాం. భద్రాద్రి ఎయిర్‌పోర్టు విషయంలో గతంలో ఒక స్థలాన్ని ప్రతిపాదించారు. గతంలో సూచించిన స్థలం ఫీజిబులిటీగా లేదు...మరో స్థలం ప్రతిపాదించారు. భద్రాద్రి విషయంలో కొత్త స్థలంపై ఫీజిబులిటీని పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం" అని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## ఓ కేంద్రమంత్రి కుమార్తెకే ఇలాంటి పరిస్థితా?

ముంబై(జనంసాక్షి):మహారాష్ట్రలో శాంతిభద్రతలపై కేంద్ర యువజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే ఆందోళన వ్యక్తం చేశారు. జల్‌గావ్ జిల్లా ముక్తాయ్‌నగర్‌లో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న తన కుమార్తెను కొందరు యువకులు వేధించారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు."మహాశివరాత్రి సందర్భంగా మా ప్రాంతంలో ఏటా సంత్ ముక్తాయ్ యాత్ర నిర్వహిస్తారు. ఇటీవల నిర్వహించిన స్నేహితులతో కలిసి ఆ యాత్రకు వెళ్తానని నా కుమార్తె కోరడంతో సెక్యూరిటీ సాయంతో అక్కడకు పంపించాను. ఆ సమయంలో కొందరు యువకులు వారిని వెంబడించి వేధించారు. అడ్డుకున్న భద్రతా సిబ్బందిపైనా దురుసుగా ప్రవర్తించారు. గుజరాత్ పర్యటన నుంచి నేను ఇంటికి రాగానే మా అమ్మాయి ఈ విషయం చెప్పింది. ఓ ఎంపీ లేదా కేంద్ర మంత్రి కుమార్తెకే ఇటువంటి దుస్థితి ఎదురైతే.. సాధారణ మహిళలు పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశా" అని కేంద్ర మంత్రి ఖడ్సే మీడియాకు వెల్లడించారు.ఇదే అంశంపై రక్షా ఖడ్సే మామ, మాజీ మంత్రి ఏక్‌నాథ్ ఖడ్సే మాట్లాడుతూ.. "ఈ యువకులపై గతంలోనూ పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి. ఈ అబ్బాయిలు కరుడుగట్టిన నేరస్థులు. మహారాష్ట్రలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. నేరస్థులు పోలీసులకు భయపడటం లేదు. బాధిత అమ్మాయిలు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. వారి తల్లిదండ్రులు కూడా తమ కుమార్తెల పేర్లు బయటకు రావద్దని భావిస్తున్నారు. మాకు ప్రత్యామ్నాయం లేకనే ఫిర్యాదు చేశాం" అన్నారు."పోలీస్ స్టేషన్‌కు వెళితే రెండు గంటలు మమ్మల్ని కూర్చోబెట్టారు. అమ్మాయిల విషయం కావడంతో పునరాలోచించుకోవాలని పోలీసులు మాకు చెప్పారు. యువకులు పోలీసులపైనా దాడి చేసిన సందర్భాలున్నాయి. వాళ్లు ఎంతగా తెగిస్తారో వీటిని బట్టి ఊహించుకోవచ్చు. వీళ్లకు రాజకీయ నాయకుల అండ ఉంది. ఇదే విషయంలో డీఎస్పీ, ఐజీతోనూ మాట్లాడాను" అని ఖడ్సే ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. నిందుతులు ఓ రాజకీయ పార్టీకి చెందినవాళ్లని, అందులో కొందర్ని పోలీసులు అరెస్టు చేశారని చెప్పారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తాజా పరిణామంపై కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కాల్ మాట్లాడుతూ.. మహాయుతి ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మండిపడ్డారు.

## గాజాకు మానవతా సాయాన్ని అడ్డుకుంటాం

ఇది శనివారంతో ముగిసింది. ఈ క్రమంలోనే రంజాన్ సందర్భంగా తొలి దశ ఒప్పందాన్ని ఏప్రిల్ 20 వరకు పొడిగించాలని అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కోఫ్ ప్రతిపాదించారు. ఇందులో భాగంగా హమాస్ తమ ఆధీనంలోని పలువురు బందీలను విడుదల చేయాల్సి ఉంటుందని ఇజ్రాయెల్ తెలిపింది. దీనికి హమాస్ నిరాకరించింది. ఈ క్రమంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. దీనిపై హమాస్ స్పందించాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. రెండో దశ కాల్పుల విరమణకు సంబంధించిన చర్చలు కైరోలో కొనసాగుతున్నాయి.కాగా ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందం శనివారంతో ముగిసింది. ఈక్రమంలో ముస్లింల పవిత్ర మాసం రంజాన్ సందర్భంగా గాజాలో కొనసాగుతున్న తొలిదశ కాల్పుల విరమణ పొడిగింపునకు ఇజ్రాయెల్ అంగీకరించింది. అమెరికా చేసిన ఈ ప్రతిపాదనకు తాము మద్దతిస్తున్నట్లు ప్రధాని కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈజిప్టు, ఖతార్ దేశాల మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్- హమాస్ మధ్య తొలి దశ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇది శనివారంతో ముగిసింది. రంజాన్ మాసం కావడంతో తొలి దశ ఒప్పందం కొనసాగించాలంటూ అగ్రరాజ్యం నియమించిన ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కోఫ్ ప్రతిపాదించారు. దీనికి తాజాగా టెల్అవీవ్ అంగీకరించింది. ఈ ఒప్పందంలో భాగంగా తమ చెరలోని బందీల మృతదేహాలను హమాస్ రెడ్‌క్రాస్‌కు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. ప్రతిగా తమ జైళ్లలోని పలువురు పాలస్తీనా ఖైదీలకు ఇజ్రాయెల్ స్వేచ్ఛ కల్పించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలోనే రెండో దశ ఒప్పందంపై ఇరువర్గాలో ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. రెండో దశ ఒప్పందాలను తొందరగా పూర్తి చేయాలని ఇజ్రాయెల్ వాసులు బిగిన్ స్ట్రీట్‌లో నిరసనలకు దిగారు. వీరిలో సంస్థ చెరలో బందీలుగా ఉన్నవారి కుటుంబసభ్యులు ఉన్నారు. ఇటీవల ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తమ చెరలో ఉన్న 94 మందిలో పలువురు బందీలకు హమాస్ స్వేచ్ఛ కల్పించగా.. ప్రతిగా ఇజ్రాయెల్ తమ జైళ్ల నుంచి పాలస్తీనీయులకు విముక్తి కల్పించింది. ఈ దశ ఒప్పందం శనివారంతో ముగిసింది. రెండో దశ ఒప్పందానికి సంబంధిచిన చర్చలు ఈజిప్టు రాజధాని కైరోలో కొనసాగుతున్నాయి.

## ఆకాశ్ ఔట్..

ఆనంద్ కుమార్‌తో పాటు రాజ్యసభ ఎంపీ రామ్‌జీ గౌతమ్‌ను కొత్త జాతీయ స్థాయి సమన్వయకర్తలుగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని బహుజన సమాజం అభివృద్ధి చెందడం రాష్ట్ర ప్రగతికి మాత్రమే కాకుండా యావత్ దేశాభివృద్ధికి అవసరమని మాయావతి ఉద్ఘాటించారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జన్మదిన వేడుకలకు సంబంధించిన ప్రణాళికలను వివరిస్తూ.. ఆయన సిద్ధాంతాలను పార్టీ ఎప్పటికీ నిబద్ధతతో పాటిస్తుందని అన్నారు. వాటి ప్రకారమే పార్టీలో పని చేసే తన కుటుంబసభ్యులను తాను ఎన్నడూ వ్యతిరేకించలేదని తెలిపారు. అయితే పార్టీ విధానాలకు హాని కలిగించే విధంగా వారిలో ఎవరైనా తన పేరును దుర్వినియోగం చేస్తే, వెంటనే వారిని పార్టీ నుంచి తొలగిస్తానని పేర్కొన్నారు. ఈ నియమానికి అనుగుణంగానే బీఎస్పీ సంస్థాగత బలాన్ని బలహీనపరచడానికి ప్రయత్నించిన ఆకాశ్ మామ అశోక్ సిద్ధార్థ్‌ను గతంలో పార్టీ నుంచి బహిష్కరించారని..ఇప్పుడు తన అల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను కూడా పార్టీ బాధ్యతల నుంచి తప్పిస్తున్నానని స్పష్టం చేశారు. సిద్ధార్థ్ చర్యలు ఇప్పటికే ఆకాశ్ రాజకీయ జీవితాన్ని ప్రభావితం చేస్తుండడం వల్ల తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.తన సోదరుడు ఆనంద్ కుమార్‌కు పార్టీ వ్యవహారాలను నిర్వహించగల సామర్థ్యం ఉందని..అతడిపై తాను పెట్టుకున్న నమ్మకాన్ని ఎన్నడూ వమ్ముకానీయలేదని అన్నారు.బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి గతంలో తన రాజకీయ వారసుడిగా మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను ప్రకటించి..తర్వాత ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. ఆకాశ్ ఇంకా పరిణతి సాధించలేదని అప్పట్లో పేర్కొన్నారు. మరలా గతేడాది జూన్‌లో ఆయనను తన రాజకీయవారసుడిగా..పార్టీ జాతీయ సమన్వయకర్తగా ప్రకటించారు.

# మద్యం జోరు.. పల్లెలు బేజారు!



## మామూళ్ల మత్తు.. నిబంధనలు చిత్తు

- పల్లెల్లో జోరుగా కిరాణా షాపుల్లో మద్యం విక్రయాలు
- సిండికేట్.. చెప్పిందే రేటు
- క్వార్టర్ పై రూ.20 నుంచి 50 అదనం
- ఫ్యామిలీ రెస్టారెంట్లో మద్యం అమ్మకాలు

**సంగారెడ్డి ప్రతినిధి, మార్చ్ 02 (జనం సాక్షి) :** ప్రశాంతంగా ఉన్నా పల్లెల్లో మద్యం బెల్ట్ దుకాణాలు పేద, మధ్య తరగతి కుటుంబాల మధ్య చిచ్చు పెడుతున్నాయి. ఒక్కో గ్రామంలో ఒకటి కాదు పదుల సంఖ్యలో మద్యం బెల్టు దుకాణాలు కిరాణా షాపు, పాన్ షాపు, అలాగే ప్రత్యేకంగా చిన్న డబ్బా లు ఏర్పాటు చెసుకొని మద్యం అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టనట్టుగా వివరిస్తున్నట్లు ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో వైన్స్ యాజమాన్యాల దోపీడీ అధికమైంది. ఎమ్మార్పీ ధరలకు అమ్మాలని ప్రభుత్వం చెప్తున్నా... వాటినేమీ పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది. ఊరికి దూరంగా షాపులు ఏర్పాటు చేసుకుని.. అందుబాటులో బెల్ట్ షాపులు ఏర్పాటు చేయించి .. ధరలు పెంచి అమ్ముతుండటంతో మందుబాబులు జేబులు గుల్ల చేసుకుంటున్నారు. సరే కొద్ది దూరమైనా వెళ్లి తాగుదామనుకుంటే.. సదరు బ్రాండ్ లేదని.... ఫలానా మాత్రమే ఉన్నాయని చెబుతున్న పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. వైన్ షాప్ లో క్వార్టర్లు మాత్రమే ఉన్నాయని, ఫుల్ బాటిల్స్ లేవని చెప్పటం పరిపాటిగా మారింది.



### మాటలకే పరిమితమైన ఎక్సైజ్ అధికారులు

మద్యం అక్రమ అమ్మకాలు జరిపినా... బెల్టాపులు నిర్వహించినా.. ఎమ్మార్పీ ఉల్లంఘించినా.. కఠిన చర్యలు తప్పవన్న ఎక్సైజ్ శాఖ అధికారుల హెచ్చరికలు మాటలకే పరిమితమయ్యాయి. గ్రామాల్లో, పట్టణ శివార్లలో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. బెల్ట్ ఉండకుండా చేస్తామని మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ఎక్సైజ్, పోలీసులు మామూళ్ల వసూళ్లతో అపహాస్యం పాలవుతోంది.

### సిండికేట్‌లదే హవా

జిల్లాలోని పలువురు మద్యం వ్యాపారులు సిండికేట్ గా మారారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటు కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ మందు బాబులను నిలువునా ముంచు తున్నారు. జిల్లాలోని సదాశివాపేట, సంగారెడ్డి, మునిపల్లి, జహీరాబాద్, ఝురాసంగం, రాయి కోడ్, న్యాల్కల్, కొండాపూర్, నారాయణ్ ఖేడ్, హత్నూర, వట్పల్లి, జోగిపేట, కంది తదితర పట్టణ, మండలం, అలాగే గ్రామ పంచాయతీ పరిది లో బెల్ట్ షాపులలో మద్యం ఎక్కువ ధరలకు అమ్ముతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని మండలాలలో జనం సాక్షి మద్యం బెల్ది షాపులపై క్షేత్రస్థాయిలో వెళ్లి సమాచారం సేకరించింది.

నారాయణఖేడ్ మున్సిపాలిటీ, మండంలో వ్యాప్తంగా కోడి కూయక ముందే.. మద్యం జోరు కొనసాగుతుంది. ఒకప్పుడు పండుగకో.. పబ్బానికో మద్యం తాగే వారికి.. ఇప్పుడు సమయం.. సందర్భం లేకుండా పోయింది. ఎప్పుడూ పడితే... అప్పుడే.. ఎక్కడబడితే అక్కడే.. మద్యం సేవిస్తున్నారు. మద్యం దుకాణాలకు తోడు గల్లీకో బెల్టు షాపు దర్శనమిస్తోంది. నారాయణఖేడ్ తోపాటు మనూర్, నాగల్ గిద్ద, సిర్గాపూర్, నిజాంపేట, కంగ్టి, కల్హే ర్, సిర్గాపూర్, మనూర్ మండలాల్లోని బెల్ట్ షాపులలో కోడి కూయక ముందే మద్యం దొరకడంతో టీకి బదులు మద్యంతోనే తాగడం మొదలు పెడుతున్నారు. బెల్ట్ షాపులు రాత్రి ఒంటిగంట వరకు డోర్లు తెరుచుకుని ఉంటున్నాయి. బెల్ట్ షాపులను ఎవరైనా ప్రశ్నిస్తే మీకేమి భయం లేదు.. మేమున్నాం.. మేము చూసుకుంటామనే భరోసా బెల్ట్ వ్యాపారులకు వైన్స్ అధికారులు భరోసా కల్పిస్తున్నారు. బెల్ట్ షాపులపై అధికారులు ఫిర్యాదు చేస్తే వారి పైన చర్యలు తీసుకోక పోగ ఫిర్యాదు చేసిన వారి పేరు వివరాలు బెల్టు షాపుల యజమానులకు ఎక్సైజ్ అధికారులు నెరవేరుస్తున్నారనే ఆరోపణ లున్నాయి. రాత్రి మద్యం దుకాణాలు బంద్ అయినా తర్వాత హోటల్, కిరాణా దుకాణాలలో మద్యం విక్రయిస్తున్నారు. మద్యం ధరపై క్వార్టర్ 30, ఆఫ్ 50, ఫుల్ బాటిల్ కు 100 చొప్పున అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఒక్కొక్క గ్రామంలో సుమారు 5 నుంచి 10 వరకు బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయి.

సదాశివాపేట పట్టణ లో ఐదు వైన్స్ షాప్ లు ఉండగా మండల చుట్టుపక్క గ్రామాల్లో సుమారు 50 నుంచి 60 బెల్ట్ షాపులు ఉంటాయి. సదాశివపేట పట్టణంలోనే 15 నుంచి 20 వరకు బెల్టు షాపులు ఉండడం గమనార్ధం.

న్యాల్ కల్ మండలంలో 39 గ్రామ పంచాయతీలు ఉండగా ఏకంగా మండలంలో 280 కి పైగా బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయి. హద్నూర్ పోలీస్ స్టేషన్ ఉన్న గ్రామంలోని ఏకంగా 15కి పైగా బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయి. మండలంలోని చాల్కి, ముంగి, గంగ్వార్, హద్నూర్ ప్రధాన కూడలిల వద్ద 1 నుంచి 8 బెల్ట్ షాపులు, అధిక జనాభా ఉన్న రేజింతల్, మిర్జాపూర్ (బి), డప్పూర్, మల్గి, మెటల్ కుంట, మామిడిగి, తదితర గ్రామాల్లో అధిక సంఖ్యలో మద్యం గొలుసు దుకాణాలు రాత్రింబవళ్లు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. రాత్రి 10 దాటిందంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ మందుబాబుల జేబులు ఖాళీ చేస్తున్నారు.

మునిపల్లి మండలంలో మూడు వైన్స్ దుకాణాలు ఉండగా సుమారు 300లకు పైగా బెల్టు షాపులు వున్నాయి.గ్రామాలలో ఎక్కడ చూసిన మద్యం బెల్టు దుకాణాలే క్వాటర్ పై రూ. 20 హాఫ్ పై రూ.50 ఫుల్ బాటిల్ పై రూ. 100 అధికంగా వసులు చేస్తున్నారు. బుదేరా, తాటిపల్లి మద్యం దుకాణాలలో కల్తీ మద్యం విక్రస్తున్న ఆరోపణలు వున్నాయి. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీసులు పట్టించుకోకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు.

# జర్మన్ లాంగ్వేజ్‌పై టి-సాట్ డిజిటల్ పాఠాలు

- కేంద్ర బడ్జెట్ పైనా పాఠ్యాంశాలు
- టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి







**హైదరాబాద్, మార్చి 2 (జనంసాక్షి) :** జర్మన్ లాంగ్వేజ్ పై టి-సాట్ ప్రత్యేక పాఠ్యాంశాలను 4వ తేదీ నుండి ప్రసారం చేయనుందని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పలు భాషలపై ప్రత్యేక లెసన్స్ ప్రసారం చేసిన టి-సాట్ నిరుద్యోగ యువత, విద్యార్థినీ విద్యార్థులు జర్మన్ లాంగ్వేజ్ ను సులువుగా, ఉచితంగా నేర్చుకునేందుకు డిజిటల్ పాఠ్యాంశాలను ఈ నెల నాల్గవ తేదీ మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి ఒంటి గంటన్నర వరకు అరగంట పాటు ప్రత్యేకంగా ప్రసారం చేస్తామని, అవే ప్రసారాలు విద్య ఛానల్ లో సాయంత్రం ఐదున్నర నుండి ఆరు గంటల వరకు ప్రసారమౌతాయని సీఈవో స్పష్టం చేశారు. ప్రతిష్టాత్మకమైన రామకృష్ణ మఠ్ బోధన సిబ్బంది బోధించిన పాఠ్యాంశాలను మొదటి విడతలో సుమారు 20 ఎపిసోడ్స్ ప్రసారమతాయన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం యువత అమెరికా తరువాత జర్మనీ వెళ్లేందుకు నిర్ణయించుకుంటున్నారని, అక్కడికి వెళ్లేందుకు భాష పరమైన ఇబ్బందులు తొలిగించాలనే లక్ష్యంతో జర్మన్ లాంగ్వేజ్ పై డిజిటల్ పాఠ్యాంశాలు ప్రసారాలు చేయాలని నిర్ణయించామని వేణుగోపాల్ రెడ్డి వివరించారు. జర్మనీలో పనిచేయాలనుకునే వారి కోసం ఇటీవలి కాలంలో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ పలు విడతలుగా జర్మన్ లాంగ్వేజ్ పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసిందని, అటువంటి శిక్షణ కార్యక్రమాలు ఒక శాఖకే పరిమితం కాకుండా తెలంగాణాలోని అన్ని వర్గాలకు తోడ్పడే విధంగా జర్మన్ లాంగ్వేజ్ పై పాఠ్యాంశాలను ప్రసారం చేయాలని నిర్ణయించినట్లు సీఈవో వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

### కేంద్ర బడ్జెట్ పైనా పాఠ్యాంశాలు

2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్ పై టి-సాట్ నెట్వర్క్ పోటీపరీక్షల కోణంలో ప్రత్యేక పాఠ్యాంశాలు రూపొందించి ప్రసారం చేసిందని, పార్లమెంట్ లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ లోని అంశాలు, రెవెన్యూ రాబడి, వ్యయం, పన్నులు, ఆర్థికాభివృద్ధి వంటి అంశాలపై సమగ్రంగా ఈ పాఠ్యాంశాలుంటాయని, పోటీపరీక్షలు రాసే అభ్యర్థులకు కరేంట్ అఫైర్స్ రూపంలో అందించే లెసన్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. టి-సాట్ నిపుణ ఛానల్లో ప్రతీ రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి టి-సాట్ విద్యా ఛానల్ లో అదేరోజు సాయంత్రం ఆరున్నర గంటలకు ప్రసారం అవుతాయని, ప్రసారాలతో పాటు టి-సాట్ యాప్ అండ్ యూట్యూబ్ లో అందుబాటులో ఉంటాయని సీఈవో వేణుగోపాల్ రెడ్డి వివరించారు

# ముత్తారం మండలంలో పులి సంచారం





- పాదముద్రలు నిర్ధారించిన అటవీ అధికారులు..

**ముత్తారం మార్చి 02(జనంసాక్షి) :** పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామంలోని కోయ చెరువు పరిసరాల్లో పులి కదలికలు కనిపించాయి గ్రామస్తుల సమాచారం మేరకు ఆదివారం రోజున చెరువు పరిసర ప్రాంత సమీపంలోని పొలాల వద్ద పాదముద్రలు గుర్తించిన ప్రజలు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్న ఎఫ్ఎస్ ఓ నర్సయ్య వాటిని పులి పాదముద్రలుగా నిర్ధారించిన్నట్లు తెలిపారు. అడవిశ్రీరాంపూర్ గ్రామం తోపాటు ఇతర గ్రామాల ప్రజలు అటవీ ప్రాంతంలో పులి సంచరించిన పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎస్ వో తెలిపారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలు అప్రమతంగా ఉండాలని గ్రామ పరిసరాల ప్రాంతాలలో పులి కలయికలు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

# ప్రియురాలి తల్లి గొంతు పిసికి చంపేందుకు యత్నం



**కరీంనగర్, మార్చి 2 (జనంసాక్షి) :** తమ ప్రేమకు అడొస్తుందనే కారణంగా ప్రియురాలి తల్లిపై ప్రియుడు అత్యంత దారుణంగా దాడి చేశాడు. ఆమెను గొంతు పిసికి చంపేందుకు యత్నించాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వన్నారం అనుబంధ గ్రామమైన సుద్దాలపల్లిలో వెలుగు చూసింది. సుద్దాలపల్లి గ్రామానికి చెందిన దూట రాజ్‌కుమార్, జాడి సుష్మిత అనే యువతితో కొంతకాలంగా ప్రేమలో ఉన్నారు. ఇది గమనించి కూతురు సుష్మితను తల్లి మందలించింది. పక్షవాతంతో మంచం పట్టిన తండ్రి పరిస్థితి వివరించి కూతురు మనసు మార్చింది తల్లి. ఈ క్రమంలో తమ ప్రేమకు అడ్డు వస్తుందనే కారణంతో ఎలాగైనా తనను చంపాలనే కసితో రాజ్‌కుమార్ బహిరంగంగానే ప్రియురాలి తల్లిని తీవ్రంగా కొట్టి గొంతు నులిమి చంపే ప్రయత్నం చేశాడు.అప్రమత్తమైన స్థానికులు.. సుష్మిత ఇంటికి చేరుకుని రాజ్‌కుమార్‌ను అడ్డుకున్నారు. అప్పటికే సుష్మిత తల్లికి ఊపిరాడటం లేదు.. ఆమెకు తీవ్ర రక్తస్రావం జరిగింది. మొత్తానికి బాధితురాలు ప్రాణాలతో బయటపడింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. రాజ్ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# మహిళల హక్కుల కోసం 8న సభ

- చైతన్య మహిళా సంఘం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళ పోరాట దినం సందర్భంగా చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వికారాబాద్ లో జరిగే సభకు ఆహ్వానిస్తున్నట్టు తెలిపింది. 8న ఉదయం 10 గంటలకు ఎమ్మార్వో కార్యాలయం నుంచి బీజేఆర్ సర్కిల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం 11:30 గంటలకు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఉన్న క్లబ్‌లో సభ ఉంటుందని పేర్కొంది. విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని అణిచివేస్తున్న విద్యావిధానంపై ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక తెలంగాణ శాఖ అధ్యక్షురాలు దేవకీదేవి ప్రసంగిస్తారని, ప్రకృతి విధ్వంస వ్యతిరేక పోరాటాల్లో మహిళల పాత్ర అనే అంశంపై వాయిస్ ఆఫ్ ఎర్త్ అరణ్యజ్యోతి ప్రసంగిస్తారని, మధ్యాహ్నం 2 గంటలకు ప్రజాపోరాటాల్లో మీడియా పాత్ర అన్న అంశంపై జనంసాక్షి ఎడిటర్ రెహమాన్ ప్రసంగిస్తారని, ప్రజాపోరాటాల్లో మహిళల పాత్ర అన్న అంశంపై చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ జ్యోతి ప్రసంగిస్తారని పేర్కొంది.

# సరూర్‌నగర్‌లో ట్రాన్స్‌జెండర్ల అరెస్ట్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇటీవల హైదరబాద్ లో అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని చెప్పుకొవచ్చు. ఒకవైపు డ్రగ్స్ దందా, మరోవైపు గాంజా అమ్మకాలు భాగ్యనగరంను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇది చాలదన్నట్లు చాలా చోట్ల మసాజ్ లు, స్పాల పేరిట యువతులతో క్రాస్ మసాజ్ లు చేయిస్తున్నారు. మొత్తంగా కొన్ని గ్యాంగ్ లు హైదరబాద్ బ్రాండ్ ఇమేజ్ ను గంగలో కల్పుతున్నారు. పోలీసులు ఎంత పకట్బందిగా చర్యలు తీసుకున్నకూడా.. కొత్త మార్గాలలో అక్రమ దందాలు చేస్తున్నారు. పోలీసులకు కంటి మీద కునుకులేకుండా చేస్తు సవాల్ విసురుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల హైదరాబాద్ లో అనేక షాకింగ్ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పబ్లిక్ గా మర్డర్ లు జరుగుతున్నాయి. హత్యలు, మాన భంగాలు, దోపీడీలు, చైన్ స్నాచింగ్ లు కూడా ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో తాజాగా.. ట్రాన్స్ జెండర్ లు కొన్ని ఏరియాలలో యువకులతో అసాంఘీక కార్యకలపాలు చేస్తున్నారు. తాజాగా.. సరూర్ నగర్ లోని కొన్ని ఏరియాలో ఇటీవల రాత్రి పూట ట్రాన్స్ జెండర్ లు యువకులతో డీల్ లు కుదుర్చుకుని అక్కడున్న ఇళ్లలోకి వెళ్లి.. అసాంఘీక కార్యక్రమాలు చేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. అదేదో సినిమాల్లో ముంబైలాంటి మహానగరాల్లో చూపించిన విధంగా ట్రాన్స్ జెండర్ లో రోడ్ల మీద నిల్చుని .. వస్తు పోతున్న వారితో మాట్లాడి రేట్ లు ఫిక్స్ చేసుకుని మరీ వారితో వెళ్లిపోతున్నారు. ఈ వీడియోలను స్థానికులు రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అంతే కాకుండా.. పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ క్రమంలో పోలీసులు దీనిపై సీరియస్ అయ్యారు. పది మంది ట్రాన్స్ జెండర్ లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన మాత్రం ప్రస్తుతం హైదరబాద్ లో తీవ్ర కలకలంగా మారింది.

# శ్వాస అందక ఆగిన పసిప్రాణం

- సకాలంలో అందని వ్యాక్షిన్లు
- వైద్య శాలలో కొరవడిన మందులు



**వాజేడు (జనంసాక్షి) :** గొంతులో (నంజు) నిమ్ము ఉండి శ్వాస అందక 55 రోజుల పసి కందు ప్రాణం ఆగిన ఘటన వాజేడు మండలంలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారంగా వాజేడు మండలం కేంద్రం లోని గుడిసెల కేంద్రం లో నివాసం ఉంటున్న గోగు బాలకృష్ణ,భారతి దంపతులకు మూడవ సంతానంగా పాప జన్మించింది.

నెలన్నర 45 రోజులకు వేయాల్సిన వ్యాక్షిన్ల కోసం వాజేడు ప్రభుత్వ హాస్పిటల్ కి వెళ్లగా హాస్పిటల్ లో వ్యాక్షిన్లు అందుబాటులో లేవని, మళ్ళీ వారం రమ్మని వైద్య సిబ్బంది తెలిపారని, మరల వైద్యులు చెప్పిన గడువు అనంతరం వెళ్లిన అదే సమాధానం రావడం తో ఇంటికి వెనుదిరిగి వెళ్ళిపోయినట్లు పాప తల్లిదండ్రులు తెలిపారు. పాప ఆరోగ్యం లో తేడాలు గమనించి, ఏటూరునాగారం ప్రభుత్వ హాస్పిటల్ కి వెళ్లగా, పరీక్షించిన వైద్యులు జలుబు, ఛాతి, గొంతు లో నిమ్ము వుంది,వెంటనే హన్మకొండ ఎంజిఎమ్ కి వెళ్లాలని వైద్యులు సూచించినట్లు తెలిపారు.ఆర్థిక స్తొమత లేకపోవడం తో స్థానికంగా వుండే ఆర్ఎంపి వద్ద వైద్యం చేయించుకోగా, సోమవారం తెల్లవారు జామున శ్వాస అందక ఇబ్బంది పడుతున్న పాప ను గమనించిన తల్లిదండ్రులు వాజేడు ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించే క్రమంలో నే మృతి చెందినట్లు గా వైద్యులు ధ్రువీకరించారాని తెలిపారు. పాపకు 45రోజులకు వేసే టీకా అందుబాటులో లేకపోవడం వల్లనే అనారోగ్యం పాలై మరణించిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి.

# రేవంత్ రెడ్డి పాలనలో హైడ్రా జులుం

- మండిపడ్డ దాసోజు శ్రవణ్




**హైదరాబాద్, మార్చి 2 (జనంసాక్షి) :** సీఎం రేవంత్ రెడ్డి రాక్షస పాలనలో హైడ్రా జులుం ప్రదర్శిస్తుందని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. తెలంగాణ అవుట్‌డోర్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలాపూర్ చౌరస్తా వద్ద అనుమతులు ఉన్న హోర్డింగులను హైడ్రా అధికారులు అక్రమంగా తొలగిస్తూ, వేలాది కుటుంబాల జీవనాధారాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నాశనం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ఉత్తర్వులను హైడ్రా తుంగలో తొక్కిందని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. హైకోర్టు శనివారాలు, ఆదివారాల్లో హోర్డింగ్ తొలగింపులు చేయరాదని స్పష్టంగా ఆదేశించినా, హైడ్రా అధికారులు కోర్టు ధిక్కరిస్తూ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. పెద్ద పెద్ద బిల్డర్స్ చెరువుల్లో ఆకాశహర్మ్యాలు కడుతుంటే తలూపని ప్రభుత్వం, పేద మధ్య తరగతి ప్రజలపై తన అధికార ప్రతాపాన్ని చూపించడం ఎంతవరకు న్యాయం? అని ప్రశ్నించారు.

### హైడ్రా అధికారుల అక్రమార్జన

హోర్డింగ్ యజమానులు, వ్యాపారులు హైడ్రా అధికారులపై తీవ్ర ఆరోపణలు చేస్తూ, తొలగించిన హోర్డింగ్ మెటీరియల్‌ను అవి అమ్ముకుంటున్నారని సంచలన విషయాన్ని బయటపెట్టారు. ఇదంతా వ్యాపారుల రక్తాన్ని పీల్చే కుట్ర కాదా? వేల కుటుంబాలు రోడ్డునపడే ప్రమాదం ఉందన్నారు. హోర్డింగ్ కార్మికులపై హైడ్రా దాడులకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు. ఈ వ్యాపారం మీద లక్షలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, హోర్డింగ్ కార్మికులపై హైడ్రా అధికారులు దాడులు చేశారని వ్యాపారులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ నిర్దయ పాలన వల్ల వారి జీవనాధారం నాశనమై రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేపటి నుంచి రోడ్డెక్కే పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం తాను చేస్తున్న తప్పును సరిదిద్దుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాలను తక్షణమే ఆపకుంటే, రేపటి నుంచే రాష్ట్రవ్యాప్త నిరసనలు, ధర్నాలు నిర్వహించేందుకు వ్యాపారులు సిద్ధమవుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే చర్యలు తీసుకుని ఈ రాక్షస పాలనకు అడ్డుకట్ట వేయాలని వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు. హైడ్రా గ్యాంగ్ రాజ్యాంగేతర శక్తిలా వ్యవహరించకూడదని దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలపై చేస్తున్న జులుం ప్రయత్నాన్ని ఆపాలి! ప్రజా జీవనాధారాన్ని ధ్వంసం చేసే ఏ నిర్ణయానికైనా కంచే చేను మేసినట్లు!! రేవంత్ రెడ్డి, ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి హైడ్రా గ్యాంగ్‌తో కలిసి రాక్షస పాలన సాగించొద్దు! అని దాసోజు శ్రవణ్ అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
2 మార్చి 2025
తెలంగాణ

# భ్రష్టు పట్టిన రాజకీయాలు



తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలు పూర్తిగా భ్రష్టుపట్టాయి. ఖటార గ్యారేజ్‌కు చేరాల్సిన కారు మాదిరి మారాయి! నైతిక విలువలు లేవు! నీతి న్యాయం లేదు! అధికారంలో ఉంటే ఒక మాట, అధికారం పోతే ఒక మాట, మాట్లాడుతున్నారు. ఆచరణ అదేవిధంగా ఉంటున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే బిఆర్ఎస్ మొన్నటి దాకా అధికారంలో ఉండి ఏండ్లు పరిపాలించినప్పటికీ ఆ పార్టీకి ఆ పార్టీ నేతలకు ఏమాత్రం సంతృప్తి లేదు. విపక్షపాత్రను నిజాయితీగా పోషించడానికి సిద్ధంగా లేదు. విపక్ష నేత మాజీ సిఎం కేసీఆర్ అసలు అసెంబ్లీకి, పబ్లిక్ లోనికి రానే రాడు! అటు బిజెపి నేతలు ఎప్పుడు అధికారంలోకి రావాలి, అనే పద్ధతిలో రాజకీయాలు చేస్తున్నారు. బిజెపి నుంచి తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు.

### అధికార వ్యామోహం తోనే పార్టీలు!

కమ్యూనిస్టులు తప్ప మిగతా పార్టీలన్నీ కూడా అధికార వ్యామోహంతోనే ముందుకు కదులుతున్నాయి. అధికారం కోసమే బిజెపి, బిఆర్ఎస్ లు పనిచేస్తుండగా, అధికారం నిలుపుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్నది. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ,హామీలపైనే కేంద్రీకరిస్తుంది. అయితే గత ప్రభుత్వం ఏడు లక్షల పైచిలుకు కోట్ల అప్పులు చేసింది. 69 వేల కోట్ల మిగులు బడ్జెట్ తో తెలంగాణలో టిఆర్ఎస్ కు అధికారం ఇవ్వగా రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయడం జరిగింది. సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు తమ నోటికొచ్చినట్లు చెప్పేయడం, తర్వాత వాటి అమలు కోసం లక్షల కోట్లు అప్పులు చేయడం, మినహా రెవెన్యూ పెంచుకునే పని గత తొమ్మిదేళ్ల మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో జరగలేదు.

### క్యాష్ దివాలా రాష్ట్రం అయ్యింది!

పదేపదే బీఆర్ఎస్ నాయకులు తాము రాష్ట్రంలో ఆస్తులను పెంచామని చెప్పుకుంటారు. కానీ రాష్ట్రాన్ని ' క్యాష్ రిచ్' రాష్ట్రంగా తీర్చిదిద్దలేకపోయారు. పైగా క్యాష్ దివాలా రాష్ట్రంగా మార్చారు! నిజానికి దేశంలో ఎక్కడైనా ఏ రాష్ట్రంలో అయినా అధికారంలోనికి రావడానికి పెద్ద ఎత్తున ప్రజల ముందు ఉచితాలను పెడుతున్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు ముందుగా సిద్ధం చేయడం లేదు. దళిత బంధులాంటి పథకాలను మాజీ సీఎం కేసీఆర్ ఒక అసెంబ్లీ ఉప ఎన్నిక సందర్భంగా ప్రకటించి అక్కడ గెలుపు కోసం ప్రయత్నం చేసి ఓటమిపాలు అవ్వడం జరిగింది. ఇలాంటి ఎన్నో పథకాలను కెసిఆర్ హయాంలో అమలు చేశారు. నిజానికి ఉచిత వైద్యం ,ఉచిత చదువు , రైతులకు పంటకు గిట్టు బాటు ధర లాంటివి దేశం మొత్తంలో అమలు చేస్తే సరిపోతుంది. ఉపాధి కల్పనకు కొత్త కొత్త పరిశ్రమలను తీసుకొని రావాలి. ప్రణాళికలను రూపొందించాలి. కనీస వేతనాన్ని కష్టజీవులకు శ్రమకు తగ్గ ఫలితం గా అమలు చేయాలి. అప్పుడు దేశంలో అయినా రాష్ట్రాలలో అయినా ఎవరికి ఏమి ఉచితంగా ఇవ్వాల్సిన అవసరం ఉండదు! ఎవరికి వారే కష్టపడి సంపాదించుకొని బ్రతకగలుగుతారు. ఉచిత ప్రయాణాలు లాంటివి అవసరమే ఉండవు. రేషన్ బియ్యం పై ఆధార పడవలసిన అవసరం ఉండదు. ప్రభుత్వం ఆ దిశన కృషి చేస్తే మరొకటి సామాన్యులు అడిగే పరిస్థితి ఉండదు. అయితే అందుకు భిన్నంగా అధికారంలో రావడానికి నానా యాగి చేస్తున్నారు. అమలుకు నోచుకోని సాధ్యం కానీ (అప్పుతో కూడుకున్న) పథకాలను అమలు చేస్తామని చెప్తున్నారు. కొన్ని పథకాలను అమలు చేసి ఆర్థికంగా రాష్ట్రాన్ని దివాలా తీసే పరిస్థితి వచ్చింది.

### అబద్ధమే రాజ్యం ఏలుతున్నది

ఎక్కడ కూడా నిజం చెప్పేది లేదు. మొత్తం అబద్ధమే !రాజకీయం అంటేనే అబద్ధాలు, అనే విధంగా పరిస్థితిని తీసుకుని వచ్చారు. అటు ఢిల్లీ, తమిళనాడు ,ఆంధ్ర ప్రదేశ్, ఎక్కడ చూసినా ఉచితాల భారం ప్రభుత్వాల మీద లక్షల కోట్లే పడుతున్నది. దానికంటే బదులు నిజంగా రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా ప్రజలకు జీవించే హక్కు కల్పించాలి. అది ఎలా సాధ్యం అనేది సంపూర్ణంగా పరిశీలించి ఆకలి లేని, వైద్యం విద్య ,లాంటివి ఉచితంగా ప్రజలకు కల్పించే విధంగా చిత్తశుద్ధితో కృషి జరగాలి.

### చిత్త శుద్ధి లేని రాజకీయాలు

అప్పుడే రాజకీయాలు కాస్తో కూస్తో భ్రష్టు పట్టే దిశ నుంచి బయటికి వస్తాయి. రాజకీయాలు అంటే అధికారం, అధికారంలో ఉన్నారంటే పదవులు, పదవుల కోసం పరుగులు నీతి నియమాలను వదిలేసి డబ్బులు పంచడం, ఓట్ల కోసం సీట్ల కోసం ఎక్కడ చూసినా డబ్బే మాట్లాడుతున్నది. డబ్బున్నోడిదే రాజకీయం రాజ్యం అవుతున్నది. అలాంటి వారికే అద్భుతమైన తివాచీనిపరిచి మరి పార్టీల నాయకులు ఆహ్వానాలు పలుకుతున్నారు. ప్రజల గురించి తెలియదు ,నేల మీద జీవితాలు కాదు! ప్రజల కష్టాలు తెలియవు! స్లమ్స్ తెలియవు! వారి దుర్బర జీవితాల గురించి ఏమాత్రం సోయలేని వారు, వీరంతా ఇప్పుడు నాయకులు ప్రజాప్రతినిధులు అయిపోతున్నారు. వీరికి మనోళ్లు కారు డోర్లు తీసే పరిస్థితి వచ్చిందంటే అతిశయోక్తి కాదు! తెలంగాణ రాష్ట్రంలో చూడండి ఒకరు అధికారం కోసం మరొకరు, అధికారం నిలుపుకోవడం కోసం, చేస్తున్న రాజకీయాలు అధ్వానంగా తయారయ్యాయి. అవతల, ఇవతల ఎవరికి కనీస మర్యాదలు లేకుండా మాట్లాడేస్తున్నారు. ఎవరికి వీలైన విధంగా తోచిన విధంగా నోరు జారుతూ మాట్లాడకూడని మాటలను కూడా మాట్లాడేస్తున్నారు. ఎవరికి ఓపిక లేదు.

### సోయిలేని నేతలు!

కనీసం రాష్ట్ర ప్రజలు ఏం కోరుకుంటున్నారు, విపక్ష పార్టీల నుంచి అధికార పార్టీ నుంచి ప్రజలు కోరుకునేది ఏమిటి! ఆశించేది ఏమిటి! అనే సోయి లేదు! ఎమ్మెల్సీ సీట్లు ఖాళీ అయ్యాయా అంటే వాటికి బారులు తీరుతారు. ఏమైనా చేస్తారు, ఫలానా పదవి కాళీ ఉందంటే దానికోసం వెంపర్లాడతా ఉంటారు. ప్రజాసేవ ప్రోటోకాల్ ఉంటేనే సాధ్యమా! ప్రోటోకాల్ లేకుంటే ప్రజా సేవ సాధ్యం కాదా? రాష్ట్రంలో భ్రష్టు పడుతున్న రాజకీయాల బూజు దుల్పాల్సిన సమయం ఆసన్నమైంది. బుద్ధి జీవులు వాస్తవ పరిస్థితులను భ్రష్టు పట్టిన రాజకీయాలను సంపూర్ణంగా గ్యారేజ్ తరలించి, మూలన పడ వేయాల్సిన సమయం ఇదే! ఈరోజు కాకుంటే మరెన్నటికీ సాధ్యం కాదు!



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

### కవితలలో.........

ఆవంతయినా ఆకర్షణ ఉండాలి
రవంతయినా రమ్యత ఉండాలి
పిసరంతయినా పటిమ ఉండాలి
పిడికడంతయిన ప్రతిభ ఉండాలి

ఇసుమంతయినా ఇంపు ఉండాలి
కొంతగానయినా కొత్తదనం ఉండాలి
కాసింతయినా కమ్మదనం ఉండాలి
చిటికడంతయినా చమత్కారం ఉండాలి

బుల్లంతయిన విషయంలో బలముండాలి
లవమంతయినా భావంలో బరువుండాలి

కీసంతయినా అక్షరాలకూర్పులోబాగు ఉండాలి
మినుకంతయినా పదాలపేర్పులోనేర్పు ఉండాలి

అల్పంగానయినా ఆలోచింపచేసేలా ఉండాలి
స్వల్పంగానయినా సరదాకొలిపేలా ఉండాలి
తక్కువుగానయినా తృప్తిపరిచేలా ఉండాలి
తిబిరింతయినా తట్టిలేపేలా ఉండాలి

కొలదిగానయినా కల్పితాలు ఉండాలి
కొద్దిగానయినా కైపిచ్చేలా ఉండాలి
ఇంచుకయినా ఇంగితం ఉండాలి
నలుసంతయిన నాణ్యత ఉండాలి
ఒక్కింతయినా తీయదనం ఉండాలి

గోరంతయినా గొప్పదనం ఉండాలి
పల్లెత్తయినా పకపకలాడించాలి
కించెత్తయినా కితకితపరచాలి

అన్నీకలిపి అద్భుతంగా తీర్చిదిద్దాడనుకోవాలి కవిని
అంతాసంతసిల్లి అంతరంగాన నిలుపుకోవాలి కవితని
అందరూచదివి ఆనందపరవశు
లు కావాలి కవితకి
అంతాస్పందించి అభినందనలు
అందించాలి కవికి



గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం



20వ శతాబ్దపు 3వ పారిశ్రామిక విప్లవం ఇంటర్నెట్ మరియు ఆటోమేషన్ టెక్నాలజీలను తీసుకువచ్చింది. డిజిటల్ టెక్నాలజీల విస్తృత వినియోగం కారణంగా, దీనిని డిజిటల్ విప్లవం అని కూడా పిలుస్తారు. కొత్త డిజిటల్ టెక్నాలజీల సహాయంతో ప్రస్తుత వ్యాపార ప్రక్రియలను మెరుగుపరిచే ప్రక్రియను డిజిటలైజేషన్ అంటారు. 20వ శతాబ్దంలో కంప్యూటర్లు విస్తృతంగా వాడుకలోకి వచ్చిన తర్వాత ఇది ప్రారంభమైంది. ఇంతకుముందు భారత్‌లో ఎంతోమంది విద్యార్థులు పలు రకాల కారణాలతో అర్ధాంతరంగా చదువుకు దూరం అయ్యేవారు. వారికోసం వారు చదువు కొనసాగించడానికి విశ్వవిద్యాలయంలో ఈ డిజిటల్ ఆన్లైన్ తరగతులు ఎంతగానో తోడ్పడుతుంది.


# డిజిటల్ వసతులతో బోధన సులభం



కాలం మారుతుంది,కాలానికి అనుకూలంగా విద్యలో కూడా అనేక మార్పులు వస్తున్నాయి. రోజురోజుకు విద్యార్థుల్లో కూడా కాంపెటీషన్ పెరుగుతుంది. దాన్ని అధిగమించడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు అధ్యాపకులు. ఇలా పట్టణ ప్రాంతాల్లో ఉన్నటువంటి పాఠశాలలు మొదలుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి పాఠశాలలకు కూడా డిజిటల్ తరగతులతో బోధన చేపట్టి, విద్యార్థుల్లో నైపుణ్యాలను అలవరుస్తున్నారు. కరోనా సమయంలో కూడా ఈ డిజిటల్ తరగతుల కీలకంగా పని చేశాయి. గూగుల్, జూమ్ యాప్ ద్వారా ఇంటిదగ్గర ఉన్నటువంటి పిల్లలకు సైతం పాఠాలు బోధించారు. ఈ విధంగా ఆన్లైన్ క్లాసులకు ఆజ్యం పోయడం జరిగింది. ఇలా పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఇంట్లోనే పాటలు వినేటువంటి పరిస్థితి కలిగింది. ప్రైవేటు పాఠశాలలే కాకుండా ప్రభుత్వ, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో కూడా విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధనలు అందించడానికి పలు రకాలుగా పాఠాలను బోధిస్తున్నారు. అందులో సులభతరంగా విద్యా బోధన చేయడానికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ పాఠశాల తరగతి గదుల్లో డిజిటల్ విప్లవము వచ్చింది అనడంలో అతిశయోక్తి లేదు. విద్యార్థులకు సులభతరంగా పాఠ్యాంశాలు బోధించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. విద్యలో సాంకేతిక పురోగతి కోసం పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఐక్యంగా నిలబడి, అధ్యాపకులు సైతం అండగా ఉన్నప్పుడు మాత్రమే ఇది సాధ్యమవుతుంది. అందుకోసం అధ్యాపకులకు నూతన టెక్నాలజీని కూడా బోధిస్తున్నారు. సాంకేతిక విప్లవం ఇంకా వెనుకబడి ఉన్న అనేక పాఠశా లలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ప్రధాన సవాళ్లు ఉన్నాయి. ఉపాధ్యాయులు తరగతి గదిలో ఆధునిక విద్యా సాధనాలను ఉపయోగించ డానికి వెనుకాడతారు. అలా వెనకాడకుండా ఉండడానికి, సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించడానికి, వారికి సరైన శిక్షణ ఇస్తున్నారు. గతంలో వనరులు, మౌలిక సదుపాయాలు మరియు కనెక్టివిటీ లేకపోవడం వల్ల తరగతి గదులకు ఇంత సుసంపన్నమైన సాంకేతికత అందుబాటులో లేకుండా పోయింది. కానీ ప్రస్తుతం అలాంటి ఇబ్బంది ఏమీ లేదు. భారతదేశం డిజిటల్ మయమైంది. వేగవంతమైన సాంకేతిక పురోగతి యుగంలో మన పట్టణ కేంద్రాలు అభివృద్ధి చెందుతున్నందున,మన నగరాలు మరియు గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న విస్తారమైన విద్యా అంతరాన్ని తగ్గించడంపై మనం దృష్టి పెట్టవలసిన సమయం ఆసన్నమైంది. ప్రపంచీకరణ ద్వారా గుర్తించబడిన యుగంలో, ఏ బిడ్డ అయినా, వారి భౌగోళిక అక్షాంశాలతో సంబంధం లేకుండా, నాణ్యమైన విద్యకు దూరంగా ఉండకూడదనే ఉద్దేశం తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య పై ఎక్కువ నిధులు కేటాయిస్తూ, అందులో చదువుతున్నటువంటి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడినటువంటి విద్యను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ తరగతి గదుల పరిచయం ఆశాకిరణంగా ఉద్భవించింది. ఈ వినూత్న సెటప్‌లు మన దేశంలోని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు సాధికారతను కల్పిస్తాయి. దృశ్య అభ్యాస అనుభవాలు మరియు ఇంటరాక్టివ్ వాతావరణాల ద్వారా మెరుగైన అవగాహనను అందిస్తాయి. గ్రామీణ విద్యలో సాంకేతికతను సమగ్రపరిచే మార్గంలో సవాళ్లు లేకుండా లేవు. పరిమిత మౌలిక సదుపాయాలు మరియు అనియత విద్యుత్ సరఫరా నుండి డిజిటల్ అక్షరాస్యత యొక్క అడ్డంకులు వరకు,అడ్డంకులు అనేకం ఉన్నాయి. అన్నింటిని అధిగమిస్తూ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులు ఇలా అన్ని సమకూర్చుతూ మరోపక్క బోధన పద్ధతుల్లో కూడా వినూత్న పద్ధతులు పాటించేలా అనేక విద్యా ప్రమాణాలను పాటిస్తూ, గురుకులాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుతుంది. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దడం జరిగింది. కంప్యూటర్ ల్యాబ్ తో పాటు,ట్యాబు ద్వారా,బై జ్యూస్ కంటెంట్ విద్యార్థులకు బోధించేందుకు ప్రతి తరగతి గదిలో ఐఎఫ్ ప్యానల్,స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసి విద్యను అందిస్తున్నారు. ప్రొజెక్టర్ ద్వారా లైవ్ క్లాస్ లను కూడా అందుబాటులోకి తేవడం జరిగింది. విద్యార్థికి ఏదైనా అర్థం కానప్పుడు అడిగే విధంగా కూడా ఉండి, వారికి వచ్చిన డౌటును క్లారిఫై చేసుకోవడం జరుగుతుంది. విద్యార్థుల యొక్క ఆదరణ సైతం డిజిటల్ పద్ధతుల ద్వారానే తీసుకోవడం జరుగుతుంది. ఈ విధంగా పాఠశాల విద్యార్థుల్లో మెరుగైన ర్యాంకులురావడం, కళాశాల విద్యార్థులు నీట్,ఐఐటి వంటి పోటీ పరీక్షలలో మంచి ర్యాంకులు సాధించడం, విశ్వవిద్యాలయాలలో చదువుకునేటువంటి డిగ్రీ, పిజి,పిహెచ్‌డి విద్యార్థులు సైతం వారికి తెలియని విషయాలను సైతం తెలుసుకుంటూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటున్నారు. ఈ విధంగా కరోనా సమయంలో ఇంట్లోనే ఉండి విద్యను నేర్చుకోవడం జరిగింది. ఇప్పుడు విశ్వవిద్యాలయాల్లో సైతం ఆన్లైన్ ఎడ్యుకేషన్ ద్వారా విద్యార్థులకు ఆన్లైన్ పాఠాలు బోధిస్తున్నారు. ఇవే కాకుండా సీట్లు పొందినటువంటి విద్యార్థులు డిజిటల్ ద్వారా తమకు నచ్చిన విశ్వవిద్యాలయంలో గాని, విద్యాలయాలలో గాని, సంక్షేమ గురుకులాల్లో సీట్లు పొందుతున్నారు. ఈ విధంగా విద్యార్థులకు ఆన్లైన్ కోర్సులు విస్తృతంగా అందుబాటులోకి రావడం, ఆన్లైన్ కోర్సులను అందించడానికి కేంద్రం ఆధ్వర్యంలో 2016లో మాసీవ్ ఓపెన్ ఆన్లైన్ కోర్సెస్ వేదిక ఏర్పాటు చేశారు. రాబోయే రోజులలో అంతర్జాతీయ విద్యా సంస్థలతో డిజిటల్ పాఠాలను అందించినట్లయితే ఎంతగానో ఉపయోగపడుతుంది. అటువంటి పరిస్థితిని కరోనా సమయంలో చూసాం. ఇప్పుడు మళ్లీ వాడడం జరుగుతుంది. ఏది ఏమైనాప్పటికీ డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం ప్రతి ఒక్కరికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇలా ఇంటర్నెట్ సౌకర్యం కలిగి ఉండి,విద్యార్థులకు మెరుగైన సేవలు అందిస్తున్నటువంటి గురుకులాలు, పాఠశాలలు ఉన్నత ప్రమాణాలు పాటించడమే కాకుండా వారిని సమాజంలో ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతున్నారు అధ్యాపకులు. వివిధ రంగాలలో ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే కాకుండా,అణగారిన వర్గాలను ఉన్నతీకరించడానికి మరియు వివిధ సామాజిక వర్గాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంపై దృష్టి సారించాయి. ఈ విధంగా విద్యార్థులు, అధ్యాపకులు, డిజిటల్ వ్యవస్థలను ఉపయోగించి ,వాటితో బోధించి, ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శప్రాయులుగా నిలుస్తున్నారు.



డాక్టర్ మోటె చిరంజీవి
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327



### గురువు స్థానం

ఎలక్షన్ల వింతలు
గతి తప్పే పంతులు
ఎన్నెన్నో తంతులు
ఓ భారతమ్మ

గురువు స్థానం గొప్ప
చాచు డెందుకు చిప్ప
బతికి చచ్చుట తప్ప
ఓ భారతమ్మ

తన జీతమొక లక్ష
ఓటు చాటున భిక్ష
చూపు వేలుకు శిక్ష
ఓ భారతమ్మ

గురువు పేరే చెడి
కళ తప్పినది బడి
గుట్టు విప్పెను నాడి
ఓ భారతమ్మ

పేరు పెద్దల సభ
తీరు గద్దల శోభ
మేడ మిద్దెల ప్రభ
ఓ భారతమ్మ

దైవ రూపుడు గురువు
మంట కలుపకు పరువు
మూడో కన్ను తెరువు
ఓ భారతమ్మ

తేరు కుందము రండు
నిద్దుర వీడి లెండు
పేరు కీర్తి ఉండు
ఓ భారతమ్మ


-ముత్యాల రఘుపతి
9014767045

# యువతకు దారి దీపాలు

## సి.రా సంపాదకీయాలు

*పత్రికొక్కటున్న పదివేల సైన్యమ్ము పత్రికొక్కటున్న మిత్రకోటి ప్రజలకు రక్ష లేదు పత్రిక లేకున్న నవయుగాల బాట నార్ల మాట అంటూ పత్రికల ప్రాధాన్యాన్ని వివరిస్తూ తెలుగునాట ప్రసిద్ధికెక్కిన పాత్రికేయులు నార్ల వెంకటేశ్వరరావు గారు తమ శతకంలో చెప్పిన పద్యం ఇది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల ఆశలను ఆశయాలను ప్రతిబింబిస్తూ అవసరమైనప్పుడు అధికార పక్షాన్ని అక్షర అంకుశంతో కదిలిస్తూ మేలుకొల్పేవి పత్రికలు. స్వాతంత్రోద్యమంలో ఆ తర్వాత వచ్చిన ప్రజా ఉద్యమాలలో అవి అందించిన చైతన్యం చిరస్మరణీయమైనది.*

ఈ నేపథ్యంలో తెలుగునాట తమ ప్రతిభా పాటవాలతో పత్రికలను తీర్చిదిద్దిన సంపాదకులు ఎందరో ఉన్నారు. సురవరం ప్రతాపరెడ్డి, ముట్నూరు కృష్ణారావు, నార్ల వెంకటేశ్వరరావు, నండూరి రామ్మోహన్ రావు, మోటూరు హనుమంతరావు, పొత్తూరు వెంకటేశ్వరరావు, సి.రాఘవాచారి వంటి ప్రభృతులు ఎందరో ఉన్నారు. కత్తి మీద సాము లాంటి ఈ బాధ్యతలను సైదాంతికంగా నిబద్ధతతో సమర్థవంతంగా నిర్వహించి ఆదర్శప్రాయులైన పాత్రికేయులలో ప్రామాణికులు రాఘవాచారి గారు. ఏ పత్రికకైనా సంపాదకీయ వ్యాసం అనేది గుండెకాయ వంటిది. సమకాలీన సమస్యలను, సంఘటనలను తీసుకుని దాని పూర్వాపరాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తూ సాగే రచనను సంపాదకీయం అంటారు. కనుక సంపాదకునికి అన్ని రంగాలపైన సమగ్ర అవగాహన, అధ్యయనము ఉండాలి. సమాజానికి అది అందించే చైతన్యాన్ని గుర్తించాలి. సంపాదకీయ వ్యాసాన్ని సమాజం పట్ల బాధ్యతగా గుర్తించిన ప్రామాణిక సంపాదకులలో రాఘవాచారి గారు ముఖ్యులు. సుమారు మూడు దశాబ్దాల కాలంగా వామపక్ష నేపథ్యం కలిగిన విశాలాంధ్ర దినపత్రికకు సంపాదకులుగా ఉంటూ సామాజిక విశ్లేషకులుగా రాణించిన రాఘవాచారి గారు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బీజాలు పడిన జనగామ జిల్లాలోని శాతాపురం గ్రామ వాస్తవ్యులు. అనంతర కాలంలో విజయవాడకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. పాల్కురికి సోమనాథుని పాలకుర్తి, బమ్మెర పోతన, నల్ల నరసింహులు, దొడ్డి కొమరయ్య, షేక్ బందగి, చాకలి ఐలమ్మ మొదలైన ప్రముఖుల గ్రామాలన్నీ శాతాపురం చుట్టుప్రక్కలలోనివే. ఈ నేపథ్యంలో చిన్ననాటి సాయుధ పోరాట ప్రభావం రాఘవాచారి గారి సాహిత్యాన్ని, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి అంటే అతిశయోక్తి కాదు. రెండవది పండిత వంశంలో జన్మించారు. వామపక్ష మేధావులుగా వారు రాటు తేలటానికి ప్రాథమికంగా అక్కడి పరిసరాలే స్ఫూర్తినిచ్చాయి. ఆ తర్వాత ఉన్న చదువుకై వరంగల్, హైదరాబాద్ నగరాలకు వెళ్లటం, ప్రముఖులతో పరిచయాలు కలగటం,




ప్రజా రంగంలో ఉండటం, పత్రికా రంగంతో మమేకం కావడం తదితర పరిణామాలన్నీ చోటు చేసుకున్నాయి. 1965లో విశాలాంధ్ర దినపత్రికలో విలేకరిగా చేరిన రాఘవాచారి గారు 1972 నుండి 2000 వరకు ఆ పత్రికకు సంపాదకులుగా వ్యవహరించారు ఈ కాలంలో సామాజికంగా, రాజకీయంగా, శాస్త్ర సాంకేతికంగా, ఆర్థికంగా ఎన్నో పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ సందర్భంగా వారు రాసిన సంపాదకీయ వ్యాసాలు ఎంతో విజ్ఞానదాయకమైనవి. వాటిలో కొన్నింటిని ఏర్చి కూర్చి వారి మరణానంతరం ఏర్పడిన ట్రస్ట్ తరఫున వారి శ్రీమతి కే.జ్యోత్స్న గారు ఇప్పటికే మూడు సంపుటాలను వెలువరించారు. మొదటి సంపుటిలో సాహిత్యం, సంస్కృతి, కళా రంగాలకు సంబంధించిన వ్యాసాలు ఉండగా రెండవ సంపుటిలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన మేధావులు చనిపోయినప్పుడు వారికి నివాళులర్పిస్తూ రాసిన వ్యాసాలు ఉన్నాయి. రాఘవాచారి గారు న్యాయ కోవిదులు కనుక మూడో సంపుటిలో తత్ సంబంధమైన వ్యాసాలు రాశారు. వారికి తెలుగు, సంస్కృతం, ఇంగ్లీష్, హిందీ భాషల్లో అపారమైన పాండిత్యం ఉంది. కమ్యూనిస్టు సైదాంతిక దృక్పథం గల మేధావిగా, రచయితగా ఆయనకు సాహిత్యం, సంగీతం రాజకీయాలు, న్యాయశాస్త్రం తదితర అంశాలపై మంచి పట్టు ఉండేది. అందుకే వారి సంపాదకీయాలు విజ్ఞానదాయకంగా కొనసాగాయి. అక్షర శస్త్రధారి చక్రవర్తుల రాఘవాచారి సంపాదకీయాలు మొదటి సంపుటిలో 91 వ్యాసాలు ఉండగా రెండవ సంపుటిలో 112 వ్యాసాలు ఉన్నాయి. భాషా ప్రయుక్త రాష్ట్రంగా 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన భావ సమైక్యత సాధనకు తగిన కృషి జరగకపోవడం ఎందువలన అంటూ ఆత్మ పరిశీలనా దృష్టితో ఆలోచించవలసి ఉంది అన్న మాటలు, అలాగే తెలుగు భాషా సంస్కృతులు మూడు పువ్వులు ఆరు కాయలుగా వికసించాలంటే తెలుగుదేశంలోని వివిధ ప్రాంతాల ఆర్థిక అభివృద్ధిలో ఉన్న అసమానతలను నివారించాలన్న వాస్తవిక సత్యాన్ని మర్చిపోకూడదు అన్నారు. ఈ రెండు సందర్భాల్లో పరోక్షంగా తెలంగాణ పట్ల జరిగిన వివక్షను అవి ప్రస్తావించాయి అని చెప్పవచ్చు. ఆ కారణంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా తర్వాతి కాలంలో అవతరించడం అందరికీ తెలిసిందే. దీనిని బట్టి రాఘవాచారి గారి దూరదృష్టిని అర్థం చేసుకోవచ్చు. 1982లో వరంగల్ లో జరిగిన పోతన పంచ శత జయంతి ఉత్సవాల సందర్భంగా వ్యాసం రాస్తూ నిరంకుశత్వం అన్నది ఏ రూపంలో ఉన్న లొంగుబాటు మాని తిరుగుబాటు జరపాలన్నదే ఈనాటి కవులకు ఆయన ఉపదేశం అంటూ పోతన దృక్పథాన్ని వివరించారు. సామాజిక బాధ్యత కలిగిన కవులకు రచయితలకు ఈ మాటలు శిరోధార్యం. ఈవేళ తమిళనాడు వంటి రాష్ట్రంలో మళ్లీ భాషా వాదం అనేది పుంజుకుంది. 1978 జూన్ 18న రాఘవాచారి గారు భాషా సమస్య అవాంఛనీయ ధోరణలు శీర్షికన వ్యాసం రాస్తూ హిందీ ఇతర రాష్ట్రాల్లో అక్కడి ప్రధాన ప్రాంతీయ భాష, ఇంగ్లీషుతో పాటు హిందీ ని బోధిస్తున్నట్లే హిందీ రాష్ట్రాల్లో హిందీ ఇంగ్లీష్‌తో పాటు మరో భారతీయ భాషను బోధించాలని అంగీకరించడం జరిగింది. అధ్యయనమే అభివృద్ధికి పునాది కదా! త్రివిక్రముడు అనే వ్యాసంలో దాశరథి ఆకారంలో వామనుడు, ప్రతిభలో త్రివిక్రముడు, నిత్య నూతన ప్రగతిశీలి అంటూ నివాళులర్పించారు. అలాగే సంగీత విద్వాంసు రాలైన ఎమ్మెస్ సుబ్బులక్ష్మిని సంగీత సరస్వతిగా పేర్కొన్నారు. కామ్రేడ్ చంద్రం గురించి రాస్తూ తెలుగులో కమ్యూనిస్టు జర్నలిజానికి పితామహుడు చంద్రం అని జోహార్లు అర్పించారు. నవ్యత, ప్రయోగ శీలత, ప్రయోగాత్మకత ముప్పేటగా జన జీవితాలతో ముడి వేసుకున్న సాహిత్యం ఆరుద్ర సొంతమని తెలుగు సాహిత్యంపై ఆయనది చేరగాని ముద్ర అని అభివర్ణించారు.

ఇలా తెలుగు నాట జరిగిన పరిణామాలు ఎన్నింటినో సామాజికంగా విశ్లేషించారు. రాఘవాచారి బహుముఖ ప్రతిభకు ఆయన సంపాదకీయ వ్యాసాలు ఉదాహరణ. సైదాంతిక నిబద్ధత, నిమగ్నతతో సామాజిక ప్రయోజనమే లక్ష్యంగా సాగిన శ్రీ రాఘవాచారి గారి సంపాదకీయాలు యువతకు దారి దీపాలు. "ఒకే ఒక్క సి.రా చుక్క లక్ష మెదళ్లకు కదలిక" అన్న మాటలు వీటికి వర్తిస్తాయి. వారి వ్యాసాలను సంపుటాలుగా తెస్తున్న ట్రస్ట్‌కు అభినందనలు.



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305



# ఆరోగ్యం మహిళ కార్మికుల ప్రాథమిక హక్కు

భారతీయ రైల్వేలో దాదాపు 2,000 మంది మహిళా లోకో పైలట్లు పని చేస్తున్నారు. భారతీయ రైల్వేలలో లోకో పైలట్లు రైలు ఇంజిన్ల లోపల టాయిలెట్ సౌకర్యాలు లేకుండా 12-14 గంటలు పని చేయాల్సి వస్తుంది. మహిళా కార్మికులు ఈ పరిస్థితుల వల్ల ఎక్కువగా బాధ పడుతున్నారు .వారు సాధారణంగా మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లు, గర్భాశయ ఫైబ్రాయిడ్లు, అధిక రక్తపోటు వంటి సమస్యలతో బాధపడుతున్నారు. చాలా సంవత్సరాలుగా, లోకో పైలట్లు ఇంజిన్ల లోపల టాయిలెట్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతి నెలా మహిళలకు ప్రత్యేక అవసరాలు ఉన్నందున ఈ అవసరం చాలా తీవ్రంగా ఉంటుంది. భారతీయ రైల్వేలు 2016 లో బయో-టాయిలెట్లతో అమర్చిన లోకోమోటివ్‌లను ప్రవేశపెట్టాయి. అప్పటి నుండి 8 సంవత్సరాలకు పైగా గడిచినప్పటికీ, లోకోమోటివ్‌లలో కొద్ది భాగం మాత్రమే టాయిలెట్‌లను కలిగి ఉన్నాయి. ఇంకా, లోకోమోటివ్‌లకు నిచ్చెనలు ఎత్తుగా ఉన్నాయని మహిళల ఎత్తుకు అనుగుణంగా రూపొందించబడలేదని మహిళా లోకో పైలట్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు.. అందువల్ల, చీకటిలో మారుమూల ప్రాంతాలలో కూడా సాంకేతిక లోపాలను పరిష్కరించడానికి వారు తరచుగా లోకోమోటివ్‌లపైకి ఎక్కి దూకవలసి ఉంటుంది. కొంతమంది గర్భిణీ స్త్రీలు గా తాము ఉన్నప్పుడు ఆఫీసు డ్యూటీని కోరినప్పటికీ, ఇది అందరికీ మంజూరు చేయబడుట లేదు కొన్ని సందర్భాల్లో, ఈ పని కారణంగా మహిళలకు గాయాలు గర్భస్రావాలకు కూడా గురవుతున్నారు. ఆరోగ్యం మహిళ ఉద్యోగుల ప్రాథమిక హక్కు. రైల్వే శాఖ అధికారులు మహిళల శారీరక అవస్థలను పరిశీలించి వారికి తగిన సౌకర్యాలు కల్పించాలి.

ఇట్లు

ఆళవందార్ వేణు మాధవ్
ఉప ప్రధాన కార్యదర్శి,
సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం
8686051752, హైదరాబాద్

# చాంద్ నజర్ ఆగయా..!

- ఉపవాస సైరన్ మోగింది
- దాన ధర్మాలు.. ఉపవాసాలు మాసం
- ముస్తాబైన.. మసీదులు
- ప్రారంభమైన తరావీహ్ ప్రార్థనలు
- జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో రంజాన్ ఉపవాసాలు





**'దైనందిన జీవితాల్లో తెలిసో తెలి యకో చేసిన పాపాలను కడిగేసుకోవడమే కాకుండా బోలెడన్ని పుణ్యాలు మూటగట్టుకునే అవకాశాన్ని 'అల్లాహ్' రంజాన్ రూపంలో తమకిచ్చారని ముస్లింలు భావిస్తారు. ఈనెలలో వచ్చే 'ఒక రాత్రి వెయ్యి రాత్రులకంటే గొప్పది. ఆరోజే ఇస్లాం మతానికి దిశానిర్దేశం చేసే ఖురాన్ అవతరించింది..' అని రంజాన్ మాసం గురించి ఇస్లాం మత దేవదూత జిబ్రయీల్ చెప్పిన మాటలివి.**

**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 2 (జనంసాక్షి) :** ఈ మాటలతోనే ఈనెల ప్రత్యేకత ఎంతనేది అర్థమవుతోంది. అందుకే రంజాన్‌లో ముస్లింలు ఉపవా సాలు, ఖురాన్ పఠనం, ఐదుపూటల నమాజు, దానధర్మాలు చేయడంలోనే తమ పర మార్థం ఉన్నట్లు భావిస్తారు.

### నెలవంక తొంగి చూసింది..

అదిగో ఆకాశంలో ఆ వంక.. మెరుస్తూ కనిపి స్తోంది నెలవంక.. సకల శుభాల మాసం వస్తోందంటూ.. ఉపవాస దీక్షలకు సిద్ధంగా ఉండాలంటూ తియ్యటి కబురు మోసు కొచ్చింది. శనివారం సాయంత్రం ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో రంజాన్ మాసం ప్రారంభమైంది. ముస్లింలు శనివారం రాత్రి నుంచి మసీదుల్లో ప్రత్యేక తరావీహ్ ప్రార్థనలు ప్రారంభించారు.

### మసీదులు ముస్తాబు..

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రంజాన్ పర్వదినం పురస్కరించుకొని మసీదులు ముస్తాబవుతున్నాయి.

ఆకాశంలో చంద్రుడు కన్పించిన రోజునే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమవుతాయి. ఈ పవిత్ర నెలకోసం ముస్లిం సోదరులు ఏడాది నుంచి ఎదురుచూస్తూనే ఉంటారు. ప్రతి ముస్లిం ఐదుపూటలా ప్రార్థనలు చేస్తారు. జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాలలో మసీదులను రంజాన్ ప్రార్థనల కోసం చక్కగా ముస్తాబు చేస్తున్నారు. 30 రోజులు రాత్రి పూట తరావీ ప్రార్థనలు, ఉపవాసాలతో కఠోరాదీక్షలో ముస్లింసోదరులు పాల్గొంటారు.

### నియమాలు, ప్రాముఖ్యం..

ఇస్లాం సౌధానికి ఉండే మూల స్థంబాల్లో రంజాన్ రోజా (ఉపవా సాలు) ఒకటి. ఈ ఉపవాసాలు విస్మ రించడం అంటే మొత్తం ఇస్లాంనే విస్మ రించడం అవుతుంది. రోజాలో ఉన్న ప్పుడు వాటి బాహ్య నియమాలతో పాటు, అంతర్ నియమాలు కూడా తప్పకుండా పాటించాలి. అబద్దం చెప్పడం, చాడీలు చెప్పడం, దూషించడం, పరోక్షంగా నిందించడం, దురుసుగా మాట్లాడం, అశ్లీల మాటలు పలకడం, పొట్లాటకు దిగడం మొదలైన వాటికి దూరంగా ఉండాలి. ఇది ఇతర సమయాల్లో కూడా పాపకార్యాలే.

### సహర్.. ఇఫ్తార్..

చంద్రుడి వీక్షణను బట్టి నెలలను లెక్కించి ఇస్లాం క్యాలెండర్ ఉపవాస దీక్ష తీసుకోవడంతో పాటు విరమణకు సూర్యో దయ అస్తమ సమయాలను ప్రాతిపదికగా తీసుకుంటారు. సూర్యోదయం కంటే ముందే అన్నపానీయాలు ముగించుకోవ దాన్నే సహర్ అంటారు. సహర్ అయ్యాక ఉపవాసం దీక్షను తీసుకుంటున్నట్లు మన స్ఫూర్తిగా ఒప్పుకోవాలి. ఇక అప్పటి నుంచి దీక్ష ప్రారంభం కాగా ఆ ఉపవాసాన్ని సూర్యాస్తమయం అయ్యాకే ఇఫ్తార్ అనే అల్పహార విందుతో ముగించాలి. ఉపవాస దీక్షలో ఉన్నవాళ్లు తన నోటి లోని లాలాజలాన్ని కూడా మింగడానికి ఇస్లాం మతం అంగీకరించదు.

### 'ఖురాన్' అవతరించిన నెల..

రంజాన్ నెలలో ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరించింది. సర్వ మానవాళికి ఖురాన్ మార్గదర్శకం చేసింది. సత్యాసత్యాలను వేరుచేసే స్పష్టమైన ఆదేశాలు ఈ గ్రంథంలో ఉన్నాయి. రంజాన్ నెలలో ముస్లింలు రోజూ ఖురాన్ గ్రంథం పఠనం చేస్తారు. ఈ మాసంలో అధికంగా దైవ ధ్యానం చేయాలని, దివ్య ఖురాన్ ను పఠించాలని మహ్మద్ ప్రవక్త బోధించారు. ఈ లక్ష్య సాధనకు నెలంతా తరావీహ్ నమాజ్ లో దివ్యఖురాన్ గ్రంథాన్ని పారా యణం చేస్తారు.

### దాన ధర్మాల ఆచరణ..

రంజాన్ మాసంలో ముస్లింలు అధికంగా దాన ధర్మాలు చేస్తారు. దీనినే 'జకాత్' అంటారు. ఏడాది పాటు తన వద్ద నిల్వ ఉండే ధనంపై జకాత్ ఇవ్వాల్సిందే. ప్రతి ముస్లిం తన వద్ద ఉన్న ధనం నుంచి రెండున్నర శాతం నిర్ణీత మొత్తంలో పేదవారికి దానం చేయాలి. మానవునిలోని ధన వ్యామోహాన్ని దూరం చేసేందుకు అల్లాహ్ అతనిపై జకాత్ ను ఫర్జ్ (విధి)గా నిర్ణయించారు. ఎవ రైతే పేద వారికి దానాలు చేయకుండా ధనాన్ని కూడబెట్టుకుంటారో ఆ ధనం ఖయామత్ (ప్రళయం) రోజు విష సర్పంగా మారి అతని కంఠాన్ని భారమైన హారంలా చుట్టుకుంటుందని ఇస్లాం ధర్మం బోధిస్తుంది. జకాత్ ఏడాది కాలంలో ఎప్పుడైనా ఇవ్వవచ్చు కానీ, రంజాన్ నెలలో ఇస్తే మరింత పణ్యం ఉంటుంది.

### నమాజుల ప్రాముఖ్యం..

రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం ఉపవాసాలతోపాటు ప్రతిరోజూ ఐదు పూటల నమాజ్ అదనంగా రాత్రి ఇషా నమాజ్ తర్వాత 20 రకాతుల తరావీహ్ నమాజులు చేస్తారు. రంజాన్ మాసంలో అధికంగా దైవ ధ్యానం చేయాలని, దివ్య ఖురాన్ గ్రంథాన్ని కనీసం ఒకసారి పారా యణం చేయాలని విశ్వ ప్రభువు ఆజ్ఞగా ప్రవక్త ఉద్బోధించారు. ఈ లక్ష్య సాధనకై నెలంతా తరావీహ్ నమాజ్ లో దివ్య ఖురాన్ పారా యణం చేస్తారు.

### ఫిత్రాలు (దానధర్మాలు) తప్పనిసరి..

రంజాన్ పండుగను ఈదుల్ ఫితర్ అని పిలుస్తారు. కారణం ఈనెలలో ఆర్థిక స్తోమత గల ముస్లింలు ఫిత్రాలు అంటే దానధర్మాలు కచ్చితంగా చేయా ల్సిన నిబంధన ఉంది. ఫిత్రా రంజాన్ పండుగ రోజు ప్రత్యేక నమాజు కంటే ముందే ఇవ్వాల్సి ఉంటుంది. స్తోమత ఉండి ఫిత్రా ఇవ్వని వ్యక్తి నెల రోజులు పాటించిన ఉపవాసాలు అల్లాహ్ వరకు చేరవని ముస్లింల విశ్వాసం. ఎవరి ఇళ్లలో అయితే 7.5 తులాల బంగారమో లేదా 52.5 తులాల వెండి లేదా వీటి విలువకు సరిపడ నగదు లేదా ధరావతు (డిపాజిట్) ఉంటాయో వారందరూ ఫిత్రా ఇవ్వాల్సిన నిబంధన ఉంది. ఈ దానం ఎంత ఇవ్వాలంటే.. ఇంట్లో ఉన్న ఒక్కొక్క సభ్యుడికి పావు తక్కువ రెండు సేర్లు గోధుమలు గానీ, వాటికి సమానమైన నగదుగానీ, వస్త్ర రూపంలో గానీ చెల్లించాలని నిబంధన ఉంది.

## హైకోర్టు న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్



**గద్వాల నడిగడ్డ, మార్చి 2 (జనం సాక్షి) :** గద్వాల కోర్టు నందు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జోగులాంబ గద్వాల జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి నందికొండ నర్సింగ్ రావు ఆదివారం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ మర్యాదపూర్వకంగా కలసి, పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కె. కుష, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి టీ.లక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత,అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి. ఉదయ్ నాయక్, జూనియర్ సివిల్ జడ్జి మిధున్ తేజ,జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు,అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ శ్రీనివాస రావు, బార్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యులు,కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు గిర్ధవర్‌లు బదిలీ

**మల్దకల్, మార్చి 2 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు గిర్ధవర్లు బదిలీ అయ్యారు. ఏఆర్ఐ నాగిరెడ్డి గట్టు మండలానికి,ఎమ్మార్ఐ మద్దిలేటి రాజోలి మండలానికి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో ఐజ నుండి మదిలేటి ఎమ్మార్ఐగా వస్తున్నారు. కరీం అలంపూర్ నుండి ఏఆర్ఐగా మల్దకల్ కు బదిలీ అయ్యారు. జిల్లావ్యాప్తంగా దీర్ఘకాలికంగా పనిచేస్తున్న అధికారులను జిల్లా కలెక్టర్ బదిలీలు చేపట్టారు.

## ఆరోగ్య రన్-2025.. ఆరోగ్య తెలంగాణకు తోడ్పాటు



**బోడుప్పల్, మార్చి 2 (జనం సాక్షి) :** ఆరోగ్య వంతమైన తెలంగాణ నిర్మాణానికి రాచకొండ రన్నర్స్" ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆరోగ్యరన్ –2025" ఈవెంట్ తోడ్పడుతుందని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఏవీ కన్స్ట్రక్షన్, ది ఆనంద ఇన్ఫినిటి జాయ్, విజయరత్న స్కూల్, సహస్రం డవలపర్స్ వారి సౌజన్యంతో నారపల్లి లోని భాగ్యనగర నందనవనం రిజర్వు ఫారెస్ట్‌లో రాచకొండ రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్యరన్–2025 ఈవెంట్స్‌ను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని 2కే, 5కే, 10కే రన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన రన్నర్స్‌కు మెడల్స్‌ను బహూకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాచకొండ రన్నర్స్ సంస్థ ప్రతినిధులు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాలలో మహిళలు, వృద్ధులు, చిన్నారు, యువత పాల్గొనడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, నిర్వాహకులు ప్రభాకర్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల,జావీద్ ఖాన్, నర్సింహా, శ్యామల నర్సింహా, కిరణ్ నాయక్, రమేష్, శంకర్ రావు, మామిడి శ్రీధర్, ఆరోగ్య రన్ స్పాన్సర్స్‌తో పాటు సుమారు 800 మంది పాల్గొన్నారు.

## నాణ్యత గల బియ్యం సరఫరా చేయాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిడమనూర్, మార్చి 2 (జనం సాక్షి) :** హాలియ అనుముల మండలం లోని వజ్ర తేజ రైస్ క్లస్టర్ ప్రైవేట్ లిమిటెడ్‌ను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్ర తేజ రైస్ కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉత్పత్తి అవుతున్న బియ్యం నాణ్యతను ఆమె పరిశీలించారు. అనంతరం తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఫిలిప్పీన్స్ దేశ ప్రభుత్వ అధికారులు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ జె. హరీష్, వజ్రతేజ రైస్ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టిపోలు యాదగిరి , హాలియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పేలపూడి బాలకృష్ణ, వజ్రతేజ రైస్ డైరెక్టర్స్ చిట్టిపోలు వేంకటేశ్వర్లు , కుక్కడపు రమేష్, చిట్టిపోలు రంజిత్, కొత్త సుదర్శన్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మేనేజర్ చిత్తనూరి పవన్ కుమార్, అనుముల మండల ఇంఛార్జి తహాశీల్దార్ వై.రఘు , పెద్దవూర డిప్యూటీ తహాశీల్దార్ (సీఎస్) ఎండీ ముక్తార్, తదితరులు ఉన్నారు.

## ఒత్తిడిని అధిగమించి పరీక్షలకు సిద్ధం కావాలి

- కలెక్టర్ సిక్త పట్నాయక్




**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 2 (జనం సాక్షి) :** భయాందోళనలను దూరం చేసుకుని ఒత్తిడిని అధిగమనిస్తూ పరీక్షలకు సిద్ధం కావాలని కలెక్టర్ సిక్త పట్నాయక్ అన్నారు.జిల్లా కేంద్రం సమీపంలో గల స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో ఆదివారం నిర్వహించిన పూసల్ పహాడ్ టాలెంట్ టెస్ట్ విజేతల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్లడానికి ఇలాంటి టాలెంట్ టెస్టులు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ శ్రద్ధ, ఏకాగ్రతను కలిగి పరీక్షల్లో విజయం సాధించాలని సూచించారు. 22 సంవత్సరాలుగా నిర్విరామంగా విద్యార్థుల కోసం టెస్టును నిర్వహించడం అభినందనీయమన్నారు.పాఠశాలల్లో ఇప్పటికే సిలబస్ పూర్తి కావడంతో రివిజన్ పై దృష్టి సారించాలని, గ్రాండ్ టెస్ట్ లపై ఫోకస్ పెట్టాలని కోరారు. ఇలాంటి పోటీ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థులు తమ స్థాయిని గుర్తించి, వార్షిక పరీక్షలకు మరింత సిద్ధం కావడానికి దోహదం చేస్తాయన్నారు.అదేవిధంగా విద్యార్థులు పరీక్షల సమయంలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని, మిత ఆహారాన్ని తీసుకోవాలని, యోగ,వ్యాయామం, ధ్యానం చేయాలని సూచించారు.అనంతరం జిల్లా టాపర్లుగా నిలిచిన ముగ్గురు ప్రభుత్వ, మరో ముగ్గురు ప్రైవేటు విభాగాల్లోని విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, పారిజాత కృష్ణారెడ్డి విద్యాసాగర్ సెక్టోరియల్ అధికారి నాగార్జున రెడ్డి ఏపీవో సురేష్ ఎంఈఓ బాల కిష్టప్ప డిఎస్ఓ భాను ప్రకాష్ నరసింహ రాజేశ్వర్ రాజేష్ కుమార్ కేశవ్ కనకప్ప రవి కృష్ణ గోపాల్ భగవంతు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఐదు డిఏలను వెంటనే చెల్లించాలి

**మక్తల్, మార్చి 2 (జనంసాక్షి) :** పెండింగ్ లో ఉన్న ఐదు డిఏ లను వెంటనే చెల్లించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు అన్నారు. మక్తల్ లో జరిగిన డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మూడవ జిల్లా కౌన్సిల్లో నూతన నారాయణపేట జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల నిర్వహకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. శ్రీశైలం, రాష్ట్ర కార్యదర్శి జే.రామస్వామి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. జిల్లా నూతన కమిటీ సభ్యులుగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా సూర్యచంద్ర, అధ్యక్షురాలుగా హైమావతి, ఉపాధ్యక్షులుగా చెన్నయ్య, స్పందన, కార్యదర్శులుగా శ్రీవిద్య, మౌనిక, వై చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్స్‌గా పరంధాములు, వెంకట్రాములు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా అమ్మన్న ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ నాయకులు శ్రీశైలం, జే.రామస్వామి మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న డీఎలను వెంటనే విడుదల చేయాలని, నూతన పిఆర్సిని ప్రకటించాలని, విద్యా రంగానికి బడ్జెట్లో సరిపోయే విధంగా నిధులను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యలో మతోన్మాద పోకడలు పెరుగుతున్నాయని, నూతన జాతీయ విద్యా విధానం పేరుతో మహిళలకు, దళిత బి.సి లకు, పేదలకు, సమాజంలోని అట్టడుగు వర్గాలకు విద్యను దూరం చేసే కుట్ర జరుగుతుందని, ఇలాంటి విధానాలను ఉపాధ్యాయులు ఐక్యంగా ఎదుర్కొనాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ అందుకు వేదికగా పనిచేస్తుందని పేర్కొన్నారు. డి.టి.ఎఫ్‌కు స్పష్టమైన సామాజిక, రాజకీయ లక్ష్యాలు ఉన్నాయని, కామన్ స్కూల్ విద్యా విధానం, శాస్త్రీయ విద్యావిధానం, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ లక్ష్యం కాగా, ప్రజల యొక్క ప్రజాస్వామిక ఆకాంక్షలు నెరవేరడం కోసం, ముఖ్యంగా అందరికీ ఉచిత నాణ్యమైన ప్రభుత్వ విద్యను అందించడం కోసం డిటిఎఫ్ ఉద్యమిస్తుందని, వారు తెలిపారు. కొత్తగాఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఇతర సంఘాలతో పోల్చుకుంటే డిటిఎఫ్‌లో మహిళల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉంటుందని, అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ సమస్యలపై, సంక్షోభాలపై డి.టి.ఎఫ్ తన ప్రాపంచిక దృక్పథంలో భాగంగా, స్పాంటేనియస్‌గా స్పందిస్తుందని, ప్రజాస్వామిక విలువల కోసం నిలబడుతుందని, సంఘం యొక్క మూల సూత్రాలైనా వృత్తి నిబద్ధత. సామాజిక బాధ్యతలను పునాదిగా చేసుకుని ఉపాధ్యాయుల, విద్యార్థుల, సమస్యలపై పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్య ప్రకాష్, డిటిఎఫ్ మండల బాధ్యురాలు పరంజ్యోతి, ఉపాధ్యాయులు కవిత, శిరీష, వై. చంద్రశేఖర్. తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త





**హైదరాబాద్, మార్చి 2 (జనంసాక్షి) :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు నిర్వహించారు. ఉదయం 9:30 నుండి రాత్రి వరకు నాగోల్ లోని పిబిఆర్ కన్వెన్షన్ హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నభూతో నా భవిష్యత్ అన్నట్లుగా సుమారు 10,000 మంది మహిళలు పాల్గొని ఎంతో ఆనందించారు. ఈ కార్యక్రమానికి గౌరవ జస్టిస్ హైకోర్టు ఫర్ ది తెలంగాణ స్టేట్ ఆఫ్ హైదరాబాద్ సురపల్లి నందా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఇంతమంది జనం రావడం నేను ఎప్పుడూ చూడలేదన్నారు. రాజకీయాల్లో లింగ అసమానతలను రూపుమాపడానికి భారత ప్రభుత్వం స్థానిక ప్రభుత్వ స్థానాలలో మహిళల కోసం రాజకీయ రిజర్వేషన్లు ఏర్పాటు చేసిందని ఆమె అన్నారు. మహిళలు రాజకీయ రంగంలో రాణిస్తూ, మంచి మంచి పదవులు స్వీకరించాలని ఆమె మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ న్యూఢిల్లీ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ శాఖ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ వైస్ చైర్మన్, పూర్వపు టూరిజం శాఖ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ నేడు స్త్రీలు బయటకు వచ్చి పురుషులతో పోటీగా చదువుతూ ఉద్యోగాలు చేస్తూ పురుషుల పరిమితమైన విజయాన్ని సైతం తగ్గించు కుంటున్నారని, పూర్తి ఆర్థిక స్వేచ్ఛను అనుభ విస్తున్నారని, ఆధునిక కాలంలో ఆడది అబల కాదు సభల అనగా పురుషులతో సమాన స్థాయికి చేరుకోగలరని, నేడు నిరూపించు కుంటున్నారని, అయితే స్త్రీ సాధికారత వల్ల గృహిణి పాత్ర మాత్రం కాస్త తక్కువైందని, పిల్లలకు, తల్లి శిక్షణ కొరబడిందని, స్త్రీ ఆర్థిక స్వేచ్ఛ దుర్వినియోగం వల్ల కుటుంబ వ్యవస్థ కాస్త బలహీన పడిందని, ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈరోజు మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ న్యూఢిల్లీ ప్రెసిడెంట్ అశోక్ అగర్వాల్ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ... మహిళలు రాజకీయ రంగాలలో రాణిస్తున్నారని, ఉదాహరణకు న్యూఢిల్లీ శాఖ కన్వీనర్‌గా ఉన్న గీత గుప్తా ఈరోజు ఢిల్లీ ముఖ్యమంత్రిగా కావడం చాలా అభినందనీయమని, అదే కోవలో తెలంగాణలో రాష్ట్రంలో కూడా మహిళలు ముఖ్యమంత్రి స్థాయికి ఎదగాలని, ఆయన ఆశీస్సులు అందజేశారు. మరో ముఖ్య అతిథి ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ న్యూఢిల్లీ సలహా కమిటీ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘాల నాయకులు, నాయకామణులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

- జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 2 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు 30 యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పి యోగేష్ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగ కార్యక్రమాలు, సభలు నిషేధం అన్నారు.శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు 30 పోలీస్ ఆక్ట్"అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ ఈ నెల 31 వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమా వేశాలు,ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాల్లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు.అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూ హం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు.సోషల్ మీడియా నందు అనవస రమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసుల ను నమోదు చేయబడ తాయని తెలిపారు.చట్ట పరంగా జారీ చేసిన ఆదేశా లను ఎవరైనా ఉల్లంఘిం చినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధంలో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునే అనుమ తులు తీసుకోవాలని ఎస్పి సూచించారు.

# తాగునీటి సరఫరాలో ఇబ్బందులు కలగకుండా చూడాలి

- డిమాండ్‌ను ఎదుర్కోవడానికి సిద్ధం కావాలి
- అధికారులకు ఎండీ. అశోక్ రెడ్డి సూచన



**హైదరాబాద్, మార్చి 2 (జనంసాక్షి) :** తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సేవలు అందించాలని ఎండీ. అశోక్ రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. మాదాపూర్ ఫిల్లింగ్ స్టేషన్ ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ... వేసవిలో వచ్చే నీటి డిమాండ్‌ను ఎదుర్కోవడానికి అధికారులంతా సిద్ధంగా ఉండాలని సూచించారు. ట్యాంకర్ బుక్ చేసిన వెంటనే డెలివరీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం సూక్ష్మ స్థాయి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అవసరమైతే అదనపు ట్యాంకర్లు, సిబ్బందిని సమకూర్చుకోవాలని చెప్పారు. మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఏమైనా అవసరాలుంటే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వాటిని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ట్యాంకర్ డ్రైవర్లతో ఎండీ మాట్లాడారు. మాదాపూర్ లో ఉన్న ట్యాంకర్లలో బుకింగ్స్‌కు లేక కొన్ని ఖాళీగా ఉంటున్నట్లు వారు ఎండీకి తెలిపారు. ట్యాంకర్ బుకింగ్, డెలివరీ లాగ్ బుక్‌ను పరిశీలించారు. ట్యాంకర్ బుకింగ్ స్టేటస్, రోజుకి ఎన్ని ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి, ఎన్ని డెలివరీ చేస్తున్నారు? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాదాపూర్ ఫిల్లింగ్ స్టేషన్ లో 06 ఫిల్లింగ్ పాయింట్స్, 80 ట్యాంకర్లు ఉండగా.. రోజుకి 600 ట్రిప్పులు డెలివరీ చేస్తున్నారు. 80 శాతం బుకింగ్స్ ను 6-12 గంటల్లో డెలివరీ చేస్తుండగా.. మిగిలిన 20 శాతం 24 గంటల్లో డెలివరీ చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 600 ట్రిప్పులు డెలివరీ చేస్తుండగా.. రాబోయే రోజుల్లో 1200 బుకింగ్స్ వచ్చినా డెలివరి చేసే సామర్థ్యం ఉందని జీఎం.. ఎండీకి తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం, డీజీఎం, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

### ఈడీ ఇన్‌స్పెక్షన్

జలమండలి ఈడీ మాయంక్ మిట్టల్ ఆదివారం పలు ఫిల్లింగ్ స్టేషన్లను తనిఖీ చేశారు. షాపూర్‌నగర్, మౌలాలి, ఎల్లారెడ్డి గూడ ఫిల్లింగ్ స్టేషన్లకు వెళ్లారు. ట్యాంకర్ బుకింగ్ స్టేటస్, రోజుకి ఎన్ని ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి? ఎన్ని డెలివరీ చేస్తున్నారు? తదితర వివరాలు తనిఖీ చేశారు. ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ ఇన్ ఛార్జిలతో మాట్లాడి వివరాలు కనుక్కున్నారు.

### నీటి సరఫరాలో అంతరాయం

మసీద్ బండ సెక్షన్లో టిజిఎస్పిడిసిఎల్ శాఖ నిర్వహణ పనులు చేపడుతోంది. దీంతో ఆ సెక్షన్ పరిధిలో ఉన్న ఫిల్లింగ్ స్టేషన్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చెయ్యడం ఆగింది. ఒకే ఫిల్లింగ్ స్టేషన్ తో (గ్రావిటీ ద్వారా నడిచే) నీటి సరఫరా చేస్తున్నారు.

## ఎన్‌ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా కుర్తి మహేష్ రెడ్డి



**టేక్మాల్, మార్చి 2 (జనంసాక్షి) :** టేక్మాల్ మండల్ శేరిపల్లి గ్రామానికి చెందిన కుర్తి మహేష్ రెడ్డి ఎన్ ఎస్ యు ఐ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన నన్ను జిల్లా ఎన్ ఎస్ యు ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పార్టీకి చేసిన సేవలను గుర్తించి నాపై నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నన్ను నియమించిన రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకట స్వామి,జాతీయ అధ్యక్షులు వరుణ్ చౌదరి, రాష్ట్ర ఇంచార్జ్ ఫహాద్, ప్రతీక్ సింగ్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పాముకాటుతో రైతు మృతి



**ఉర్కొండ, మార్చి 2 (జనం సాక్షి) :** మండలంలోని జకినాలపల్లి గ్రామానికి చెందిన తలసాని సాయి రెడ్డి అనే రైతు పాముకాటుతో మృతి చెందారు. ఉదయం పొలం వద్ద పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు పాము కాటేయడం జరిగింది. హుటాహుటిన కల్వకుర్తి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు డాక్టర్లు తెలియజేశారు. తలసాని సాయి రెడ్డికి ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు చనిపోవడంతో కుటుంబం శోకసముద్రంలో మునిగింది. అందరితో కలుపుగోలుగా ఉండే వ్యక్తి అకస్మాత్తుగా మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అల్లుకున్నాయి. తలసాని సాయి రెడ్డి గతంలో ప్రాథమిక సహకార సంఘానికి అధ్యక్షుడుగా పనిచేశారు. పాము కాటు ముగ్గురై చనిపోవడంతో గ్రామ ప్రజలు, కళాకారులు కన్నీరు పర్వతమయ్యారు.

# డీఈ వెంకట్ రామ్ రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం

- సీఎం దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పిస్తాం
- జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కార్



**న్యాల్‌కల్, మార్చి 2 (జనం సాక్షి) :** ప్రయాగ్ రాజ్, మహా కుంభమేళ దర్శనానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఢీఈ వెంకట్ రామ్ రెడ్డి - విలాసిని దంపతుల కుటుంబాన్ని అన్ని విధాల ఆదు కుంటామని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కార్ అన్నారు. ఆదివారం సాయంత్రం న్యాల్ కల్ మండలం,గంగువార్ లోని తల్లి, తండ్రిని కోల్పోయిన చిన్నారులు హర్షిత, భార్గవ రామ్ రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి, డాక్టర్ చంద్రశేఖర్ తో కలసి చిన్నారులను అన్ని విధాల ఆదు కునేందుకు త్వరలోనే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి కుటుంబంలోని ఓ వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. మృతులు వెంకట్ రామ్ రెడ్డి, విలాసినీలు ఫిబ్రవరి 23న వారణాసిలోని ప్రయాగరాజ్ దర్శనం అనంతరం శ్రీ కాశీ విశ్వనాథుని దర్శించుకునేందుకు వెళుతుండగా.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పరామర్శించిన వారిలో స్థానిక కాంగ్రెస్ నేతలు కే.భాస్కర్ రెడ్డి, సిద్ధి లింగయ్య స్వామి, తిరుపతి రెడ్డి, జీవన్ రెడ్డి, బలరాం రెడ్డి, శుక్లవర్ధన్ రెడ్డి, చంద్రప్ప, రత్నం, తదితరులు ఉన్నారు.

# శివనగర్‌లో కోతుల బెడద..

- పది రోజులలో ముగ్గురిపై దాడి
- భయాందోళనలో స్థానిక ప్రజలు
- మున్సిపల్ అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు



**వరంగల్ ఈస్ట్, మార్చి 2 (జనం సాక్షి) :** నగరంలో కోతుల బెడద తీవ్రంగా పెరిగిపోయింది. రోడ్లపై పోతున్న బాటసారులపై కూడా కోతులు దాడి చేస్తున్నాయి. మరికొందరు కోతులు దాడి చేయగా పరిగెత్తి కిందపడి గాయాల పాలవుతున్నారు. ఆదివారం 34 డివిజన్ శివనగర్ లో తన ఇంటి ముందర కోతులు ఉండగా పక్కనుండి ఇంట్లోకి వెళుతున్న క్రమంలో ఒక్కసారి కోతులు బత్తుల సత్యం పైకి రాగా భయపడిన సత్యం పరిగెత్తుతూ కింద పడడంతో చేతులకు కాళ్లకు గాయాలయ్యాయి.రోడ్డుపై పడిపోయిన సత్యం పై కోతులు దాడి చేస్తుండగా గమనించిన, కార్పొరేటర్ పిఏ బజ్జు అంజయ్య స్థానికులతో కలిసి రాళ్లతో కర్రలతో కోతులను భయపెట్టగాఅవి పారిపోయాయి. గత 10 రోజులలో కోతులు ముగ్గురిపై దాడి చేశాయి. 34 డివిజన్ పారిశుద్ధ కార్మికురాలు గన్నారపు తేజమ్మ, పోలె పాక రాజులపై కోతులు దాడి చేశాయి. పారిశుద్ధ కార్మికురాలు తేజమ్మ తీవ్రంగా కోతుల దాడిలో గాయపడగా స్థానికులు, జవాన్ 108 ఫోన్ చేసి ఎంజిఎంకు తరలించారు. పోలేపాక రాజు కోతుల దాడిలో గాయపడ్డాడు కోతులు పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులపై, బాటసారులు చేతి సంచులతో వెళ్తుండగా వారిపై దాడి చేస్తున్నాయని స్థానికులు వెల్లడించారు. కోతులు ముక్కుమ్మడిగా ఇంట్లోకి చొరబడి నిత్యావసర వస్తువులు చిందరవందర చేస్తూ గృహస్తులను భయాందోళనకు గురి చేస్తున్నాయని గృహిణిలు వెల్లడించారు. బజ్జూరీ అంజయ్య మాట్లాడుతూ శివనగర్‌లో కోతుల బెడద తీవ్రంగా పెరిగిపోయిందని ముగ్గురే కాకుండా వేరే ప్రాంతంలో కూడా కోతుల దాడులలో గాయపడుతున్నారని అంజయ్య తెలిపారు.తక్షణమే కోతులను బంధించి అడవి ప్రాంతాలకు తరలించాలని స్థానికులు మున్సిపల్ అధికారులను వేడుకుంటున్నారు.

## ప్రశాంతంగా ముగిసిన సీఎం పర్యటన

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**వనపర్తి క్రైమ్, మార్చి 2 (జనంసాక్షి) :** రేవంత్ రెడ్డి బాల్యమంతా వనపర్తి జిల్లా కేంద్రంతో ముడిపడి ఉన్నందున ఈ ప్రాంత ప్రజల్లో ప్రత్యేక అభిమానం ఉంది. ప్రభుత్వ ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి హెూదాలో తొలిసారి వనపర్తిలో పర్యటిస్తున్నందున పోలీసులు గట్టిభద్రతా చర్యలు తీసుకున్నారు. వనపర్తి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల,ఉన్నత పాఠశాలలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పర్యవేక్షణలో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో సీఎం పర్యటన ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ అన్నారు.సిఎం పర్యటన విజయవంతంగా బందోబస్తు నిర్వహించిన ప్రతి పోలీసు అధికారికి, సిబ్బందిని వనపర్తి జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## అర్జునపట్ల విద్యార్థికి డీఈఓ సత్కారం

**చేర్యాల, మార్చి 2 (జనంసాక్షి) :** చేర్యాల మండల స్థాయి టీఎల్‌ఎం మేళలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అర్జునపట్ల విద్యార్థి డీఈవో చే సత్కారం ప్రశంసలు పొందారు. అనేక విషయాలు అన్ని అంశాలు అన్ని పాఠశాలలు అనే టాగ్ లైన్ తో మండల స్థాయిలో చేర్యాల పెద్దమ్మగడ్డ పాఠశాలలో జరిగిన మేళలో తెలుగు అంశంలో ప్రత్యక్ష సజీవ టీఎల్‌ఎంగా నిలిచి మేళ అంశంగా ఉద్దేశ్యం సంకల్పం విధి విధానాలు ఎంఈఓ రచ్చ కిష్టయ్య రూపకల్పన మొత్తాన్ని ప్రదర్శన అంశంగా 9వ తరగతి విద్యార్థి విష్ణు హరికథ ప్రక్రియలో అద్భుత ప్రదర్శన ఇచ్చాడు. విద్యార్టి ప్రతిభకు ఎంఈఓ, డీఈవో మురిసిపోయి వెంటనే వేదిక మీదనే విష్ణుని ఘనంగా సన్మానించి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు రామ చంద్రమూర్తిని ప్రశంసలతో ముంచెత్తారు. విద్యార్థుల్లో ఇలాంటి నైపుణ్యాలను వెలికి తీయాలని ఉపాధ్యాయ లోకానికి డీఈవో సూచించారు. మొత్తం మేళాలో హరికథ అంశం విద్యార్థి విష్ణు ప్రత్యేక ఆకర్షణగా అంశంగా చర్చకు వేదిక అయ్యాడు. తను చదువుకున్న పాఠశాల విద్యార్థిని డీఈఓ కొనియాడడం ఆకర్షణగా నిలిచింది.



## విద్యార్థి జీవితంలో ఎదిగి ఒదిగి ఉండాలి



**తూప్రాన్, మార్చి 2 (జనం సాక్షి) :** ప్రతి విద్యార్థి జీవితంలో ఎదిగి ఒదిగి ఉంటేనే జీవితంలో అనుకున్నది సాధిస్తాడని గీత స్కూల్ కరస్పాండెంట్ రామాంజనేయులు తెలిపారు. తూప్రాన్ గీతా స్కూల్ లో పదవ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థికి పదవ తరగతి అనేది కీలక దశ అని అతని భవిష్యత్తుకు మొదటి పునాది అని అత్యధిక మార్కులు సాధించి ఉన్నత శిఖరాలను ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు విద్యార్థి బాల్య స్మృతులు ఇక్కడే పురుడు పోసుకుంటాయని అన్నారు పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందోత్సాహాల నడుమ జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్ పర్సన్ పి.ఉష, డైరెక్టర్లు బి.రాఘవేందర్ గౌడ్, నారాయణ గుప్త, ప్రిన్సిపాల్ సి. హెచ్. వెంకట కృష్ణారావు, ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వేద పఠనంతో గాడిలో పడనున్న జీవితాలు



**మునిపల్లి, మార్చి 2 (జనం సాక్షి) :** వేద పఠనంతో విద్యార్థుల జీవితాలు గాడిలో పడుతాయని రాష్ట్ర ఆరోగ్య శాఖామాత్యులు దామోదర రాజానర్సింహా అన్నారు. ఆదివారం నాడు మునిపల్లి మండలం బుదేరాలో వేద పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రతి ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. వేదపఠనంతో భక్తి పరమైన విశ్లేషణలు చేయడానికి వేద పాఠశాలలు ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బర్దిపూర్ పీఠధిపతి దత్తగిరి మహారాజ్,మాజీ ఎంపీపీ రాం రెడ్డి,ఏఎంసి చైర్మన్ సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సతీష్,మనోహర్, రహీం తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు తప్పని యూరియా తిప్పలు...

- బ్లాక్ మార్కెట్‌కు తరులుతున్న యూరియా అధిక ధరలకు అమ్మకాలు
- బస్తాకు రూ.275 నుండి రూ. 350 వరకు అమ్మకాలు
- పట్టించుకోని జిల్లా వ్యవసాయ అధికారి




**ములుగు ప్రతినిధి, మార్చి 2 (జనంసాక్షి) :** ములుగు జిల్లాలో అన్నదాతలు యూరియా కోసం నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వము రైతన్నలకు సరిపడా యూరియాను సరఫరా చేస్తున్నామని పేర్కొంటున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం జిల్లాలకు కేటాయిస్తున్న యూరియాను కొంతమంది అధికారుల కారణంగా యూరియా బ్లాక్ మార్కెట్ కు తరలిపోతుందని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీని ఫలితంగానే రైతులకు యూరియా అందక నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వపరంగా కేవలం రూపాయలు 275 లకు అమ్మాల్సిన యూరియాను ఫర్టిలైజర్ యజమానులు రూ. 350 వరకు విక్రయిస్తున్నారు. రైతన్నల నిస్సాయతను ఆసరాగా చేసుకుని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ములుగు జిల్లాలో ప్రధాన నీటి వనరులైన రామప్ప లక్నవరం మల్లూరు ప్రాజెక్టులు తోపాటు పలు కుంటలు, చెరువులు ఉన్నాయి. ఈ సంవత్సరము చెరువులు కుంటల్లో సాగునీరు సరిపడ ఉండడంతో పాటు ప్రభుత్వము సన్నధాన్యానికి బోనస్ రూపాయలు 500 చెల్లిస్తామని ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా రైతాంగము సన్నధాన్యం సాగు వైపు మొగ్గు చూపారు. ప్రస్తుతం వరి నాట్లు వేసి నెల రోజులు కావస్తుండడంతో రెండు డోసులు యూరియా ఇప్పటికే చల్లాల్సి ఉండగా యూరియా కొరతతో కొంతమంది రైతులు ఒకేసారి యూరియా చల్లడం జరిగింది. ప్రభుత్వ ధర యూరియా 50 కిలోల బస్తాకు రూ. 270 ఉండగా హమాలీ ఖర్చులతో కలిపి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రూ. 275 లకు విక్రయిస్తున్నారు. ఆగ్రోస్ కేంద్రాల్లో మాత్రం 300 రూపాయలకు విక్రయిస్తుండగా ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపుల యజమానులు 50 కిలోల బస్తాకు రూ. 330 నుండి రూ. 350 వరకు రైతుల నుండి వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్న వ్యవసాయ అధికారులు నామమాత్రంగా ఫర్టిలైజర్ షాపులను తనిఖీలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ములుగు జిల్లాలో మండల వ్యవసాయ అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఫర్టిలైజర్ షాపులను తనిఖీలు చేపడుతూ అధిక ధరలకు ఎరువులను అమ్మకుండా నియంత్రించాల్సిన జిల్లా వ్యవసాయ అధికారి తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్రాల్లోనే కొన్ని ఫెర్టిలైజర్ షాపుల్లో యూరియాను 350 రూపాయల వరకు విక్రయిస్తున్నారంటే వారికి వ్యవసాయ అధికారుల అండదండలు ఉన్నాయని బాహాటంగా రైతులు పేర్కొంటున్నారు.

## టి10 క్రికెట్‌లో రాష్ట్రస్థాయిలో పెబ్బేరు మోడల్ స్కూల్ జట్టు



**పెబ్బేరు, మార్చి 2 (జనం సాక్షి) :** ఇటీవల హైదరాబాద్‌లో మూడు రోజులపాటు క్రికెట్ పోటీలు నిర్వహించారు. మేడ్చల్ జిల్లా ఈ.సి.ఐ.ఎల్‌లో జరిగినటువంటి టి10 అండర్ 16 క్రికెట్ టోర్నమెంట్ లో పెబ్బేరు మోడల్ స్కూల్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఫైనల్ మ్యాచ్ కామారెడ్డి పై మొదట బ్యాటింగ్ ఎంచుకున్న వనపర్తి జట్టు 10 ఓవర్లలో 108 రన్స్ చేయగా కామారెడ్డి ఇన్నింగ్స్ లో కామారెడ్డి 50 రన్స్ కి ఆల్ అవుట్ కావడం వల్ల 58 పరుగుల తేడాతో వనపర్తి జిల్లా జట్టు ఘన విజయం సాధించింది. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మామిడి శ్రీధర్, కోశాధికారి సందీప్ చేతులమీదుగా ట్రోఫీ నగదు బహుమతి 30000 రూపాయలు అందుకోవడం జరిగింది. మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కమలాకర్, కోచ్ లు మనోహర్, శంకర్ మరియు క్రికెట్ జట్టులోని విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ తుర్పింటి నరేశ్ కుమార్ ఉపాధ్యాయ బృందం క్రీడాకారులను అభినందించారు.

# నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పోరాడుతాం

**యువత రాజకీయాలకు ఆకర్షితులు కావాలి**

**ఏఐవైఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ**




నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామని,యువత రాజకీయాలకు ఆకర్షితులు కావాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఈసీఐఎల్ లోని లయన్స్ క్లబ్ హాల్ లో జరిగింది. ఏఐవైఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ నేటి యువత రాజకీయాలకు రావాలని అన్నారు. ప్రస్తుతం దేశంలో కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో విభజన రాజకీయాలకు తెరలేపుతున్నారు. ఈ తరుణంలో యువత కులాలు మతాలకు అతీతంగా ఐక్యమత్యంగా ఉండాలన్నారు. చెడు రాజకీయాలను, ధన రాజకీయాలను భూస్థాపితం చేస్తూ సమసమాజ స్థాపన కోసం కృషిచేయాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిందన్నారు. ఏడాదిలో 55,143 ఉద్యోగాలను మాత్రమే రేవంత్ ప్రభుత్వం భర్తీ చేసిందని, రాష్ట్రంలో 1,91,126 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పీఆర్సీ కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో 1.32 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని గత ప్రభుత్వం ప్రకటించింది. కానీ 40 వేల ఉద్యోగాల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్లు విడుదలయ్యాయన్నారు. అటు కేంద్రంలో బీజేపీ...రాష్ట్రంలో గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులున్నా నియామకాలను మాత్రం చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. పాలకులు అనుసరిస్తున్న తీరుపై నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రచారార్భాటాలకు ఇస్తున్న ప్రాధాన్యత ఉద్యోగాల భర్తీపై లేదన్న విమర్శలు వస్తున్నాయన్నారు. పేరుకు మాత్రమే జాబ్ క్యాలెండరు ప్రకటించిందని వారు విమర్శించారు. యూత్ డిక్లరేషన్లో జాబ్ క్యాలెండర్తోపాటు నిరుద్యోగ భృతి రూ. నాలుగు వేలు ఇస్తామని ప్రకటించిందని, విద్య, ఉపాధి కల్పనకు యూత్ కమిషన్ను ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు.యూత్ కమిషను వెంటనే ఏర్పాటు చేయాలని, ఆ కమీషన్ కు 1000కోట్ల గ్రాంట్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రాయితీలతో నెలకొల్పిన పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దాన్ని అమలు చేయాలన్నారు. కోర్టు వివాదాలు, న్యాయ వివాదాలు లేకుండా ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు.

అనంతరం యువ ప్రజాప్రతినిధి, పెద్ద అంబర్పేట్ మున్సిపల్ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ మాట్లాడుతూ యువత రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని,తద్వారా ఆయా ప్రాంత అభివృద్ధి జరుగుతుంది అన్నారు. ఈ సెమినార్ లో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కునుకుంట్ల శంకర్, లింగం రవి, వెంకటేశ్వర్లు,నానబాల రామకృష్ణతో పాటు 25జిల్లాల నుండి సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోనే పేట జిల్లా మొదటి స్థానం సాధించాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**



పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నారాయణపేట జిల్లా రాష్ట్రంలోని మొదటి స్థానంలో నిలవాలని ఎమ్మెల్యేచిట్టెం పర్ణికరెడ్డి కోరారు.పూసల్ టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు అందించిన ఎమ్మెల్యే వారిని ఉద్దేశించి మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని,ఈ క్రమంలో జిల్లాలోనూ విద్యారంగంలో బాలికలదే పై చేయిగా ఉందని అన్నారు.టెన్త్ పరీక్షలతోపాటు భవిష్యత్తులో అన్ని రంగాల్లోనూ మహిళలు రాణించే విధంగా కృషి చేయాలన్నారు.తల్లిదండ్రులు సైతం బాలిక విద్యను ప్రోత్సహించాలని,అన్ని విషయాల్లోనూ అమ్మాయిలకు తోడ్పాటున అందించాలని కోరారు. ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.అనంతరం పాఠశాలల వారీగా టాపర్లకు బహుమతులు అందించారు.

కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, నిర్వాహకులు షేర్ పారిజాత, కృష్ణారెడ్డి, ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారి నాగార్జున్ రెడ్డి, ఏపీవో సురేష్, ఎంఈఓ బాలకిష్టప్ప, డీఎస్ఓ భాను ప్రకాష్, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, రఘురామేశ్వర్, రాజేష్ కుమార్, కేశవ్, కనకప్ప, సాక రవి, కృష్ణ, గోపాల్, భగవంతు రెడ్డి పాల్గొన్నారు.

# శాస్త్రీయ ఆలోచనలు పెరగాలి

**పదేళ్లుగా మూఢనమ్మకాలు పెరిగాయి**

**వీటికి వ్యతిరేకంగా కార్యకర్తలు పని చేయాలి**

**జెవివి ఆవిర్భావ దినోత్సవ సదస్సులో కెఎల్ కాంతారావు**






**ఖమ్మం (జనంసాక్షి)**

సమాజంలో శాస్త్రీయ ఆలోచనలు పెరిగేందుకు జెవివి కార్యకర్తలు కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక మాజీ రాష్ట్ర అధ్యక్షులు కెఎల్ కాంతారావు పేర్కొన్నారు. ప్రపంచీకరణ దుష్ఫలితాల వల్ల మనిషిలో అభద్రతా భావంపెరిగిందని, దీంతో మూఢనమ్మకాల వైపు పయనిస్తున్నాడని అన్నారు. అందుకేమూఢనమ్మకాల నిర్మూలనకు పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.జనవిజ్ఞాన వేదిక అవతరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఖమ్మంలోనిజెడ్పీ మీటింగ్ హాల్లో సదస్సు జరిగింది. జిల్లా అధ్యక్షులు వి.మోహన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో కెఎల్ కాంతారావు మాట్లాడుతూ పదేళ్లుగా మతోన్మాద శక్తులు మూఢనమ్మకాలను పెంచుతున్నాయన్నారు. సాక్షాత్తూ పాలకులే వీటిని పెంచే పనిలో ఉండడం విచారకరమన్నారు. చెప్పింది రుజువు చేసేది సైన్స్ త్రమేనన్నారు. మనిషి మనుగడకు, అభివృద్ధికి సైన్స్ దోహదం చేస్తుందన్నారు. ప్రశ్నించే తత్వాన్ని సైన్స్ నేర్పుతుందన్నారు. అందుకే అందరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు జెవివి చేస్తున్నకృషి అభినందనీయ మన్నారు. రానున్న రోజుల్లో జెవివి పాత్ర పెరిగిందని, కొత్తకార్యకర్తలను తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు అలవాల నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో జనవిజ్ఞాన వేదికచేపట్టిన కార్యక్రమాలను వివరించారు. 1990లో అకడమిక్ కమిటీ ఏర్పడినతర్వాత నిర్వహించిన స్తంభాద్రి బాలమేళా కార్యక్రమం అందరినీ ఆలోచింపచేసిందన్నారు. 1994లో ఢిల్లీలో జరిగిన నేషనల్ బాల మేళాలో జిల్లా నుండి ముగ్గురు పాల్గొన్నారని, ఇదొక చారిత్రక కార్యక్రమమని అన్నారు. మన బడికార్యక్రమం ద్వారా బడికి వెళ్లని వారు, బడిని మానేసిన వారికి రాత్రి పూట బడులు నిర్వహించి 400 మంది విద్యార్థులను ఏడో తరగతి కామన్ పరీక్షలురాసేలా చేశామన్నారు. సంచారక్ ప్రయోగ శాల కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లాలో నాలుగన్నరేళ్లుగా నిర్వహించామన్నారు. జూలూరు పాడు మండలంలో సంచారగ్రంథాలయాన్ని రెండేళ్ల పాటు నిర్వహించామన్నారు. ఇంకా అక్షరాస్యతా ఉద్యమం, సారా వ్యతిరేక ఉద్యమంలో జెవివి చురుకుగా పాల్గొందన్నారు. జెవివికార్యక్రమాలు తెలుసుకున్న నాటి గవర్నర్ కృష్ణకాంత్ ఖమ్మం వచ్చినప్పుడునాయకులను పిలిపించుకుని మాట్లాడారని, ఇదెంతో గౌరవాన్ని తెచ్చిందనిఅన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణలపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చామన్నారు. దాశరథి జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించామని,ఈ సందర్భంగా కవి సమ్మేళనం ఏర్పాటుచేసి వచ్చిన కవితలతో సంకలనంతీసశామన్నారు. ఆడపిల్లను పుట్టనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దా అనే నినాదంతో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జీవపరిణామ సిద్ధాంతం పై సెమినార్లు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల కోసం చెకుముకి పత్రికను నిర్వహిస్తున్నామని, ప్రతి ఏటా బాలల్లో దాగి ఉన్న సృజనాత్మ కతనువెలికితీసేందుకు చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. జెవివిపూర్వపు రాష్ట్ర అధ్యక్షులు కట్టా సత్యప్రసాద్ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం పెరిగేందుకు

విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తొలుత జెవివి మొదటి కన్వీనర్ వాసిరెడ్డి మల్లిఖార్జున్రావు జెండావి ష్కరణ గావించారు. అనంతరం ప్రారంభమైన సభ వంజాకు లక్ష్మీనారాయణ సంతాప తీర్మానాన్నిప్రవేశపెట్టారు. సభలో జెవివి నాయకులు ప్రతాప్, పొత్తూరి సీతారామారావు, దేవేంద్ర, మధు తదితరులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఇంకా ఈ సభలో జిల్లా గౌరవాధ్యక్షులు మల్లెంపాటి వీరభద్రరావు, మచ్చా సూర్యనారాయణ, వంజాకు లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టి.శివన్నారాయణ, సమత కన్వీనర్ కె.రాములమ్మ, జెవివి ప్రారంభ సభ్యులు ఝాన్సీ కుమారి, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

**నేటి నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియ**

**మాక్ కౌంటింగ్ నిర్వహించిన అధికారులు**

**కరీంనగర్ బ్యూరో, మార్చి 02 (జనంసాక్షి)**



కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ స్థానాల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. నేటి నుండి (ఈ నెల 3న) నగరంలోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఉదయం 8 గంటల నుండి కౌంటింగ్ మొదలు కానుండగా, దీనికోసం మొత్తం 35 టేబుళ్లు వినియోగించనున్నారు. ఇందులో 21 పట్టభద్రుల ఓట్ల కోసం, 14 టేబుళ్లు ఉపాధ్యాయుల ఓట్లు కోసం ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్ వద్ద నలుగురు సిబ్బంది విధులు నిర్వర్తించనుండగా, ఇందులో ఒక మైక్రో అబ్జర్వర్, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు లెక్కింపు అసిస్టెంట్లు ఉన్నారు. వీరందరికీ శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సంబంధిత అధికారులు శిక్షణ ఇచ్చారు. లెక్కింపు కోసం మొత్తం 800 మంది సిబ్బందిని వినియోగించనున్నారు. ఇందులో 20 శాతం రిజర్వ్ సిబ్బందిని నియమించారు. అత్యంత పటిష్టమైన భద్రత నడుమ లెక్కింపు చేపట్టనుండగా, ప్రతి టేబుల్ వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణ నిరంతరాయంగా కొనసాగనున్నది. సోమ వారం ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభం కానుండగా, పూర్తయ్యే సరికి సుదీర్ఘ సమయం తీసుకోనున్న నేపథ్యంలో మూడు షిఫ్టుల్లో లెక్కింపు సిబ్బంది విధులు నిర్వహించేలా ఎన్నికల అధికారులు చర్యలు చేపడుతున్నారు.

**మాక్ కౌంటింగ్ పూర్తి..**

సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆదివారం మాక్ కౌంటింగ్ ను ఎన్నికల అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ... ఓట్ల లెక్కింపులో పాల్గొనబోయే సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించేందుకు ఈ మాక్ కౌంటింగ్ ఉపయోగపడుతుందని అన్నారు. ఈ మాక్ కౌంటింగ్ ద్వారా ఎటువంటి పొరపాట్లకు, తప్పిదాలకు, ఆస్కారం లేకుండా కౌంటింగ్ సజావుగా సాగుతుందని అన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలకు చోటు లేకుండా ఎన్నికల విధులను సమన్వయంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శిక్షణలో ఇచ్చిన ఆదేశాలను, సూచనలను కచ్చితంగా పాటించాలని అన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను విధిగా పాటించాలని ఆదేశించారు. ఈ మాక్ కౌంటింగ్ లో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ కౌంటింగ్ సూపర్వైజర్లు, సిబ్బందికి ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు విధానాన్ని, నిబంధనలు, మార్గదర్శకాలను వివరించారు. లెక్కింపు కేంద్రం ఆవరణలో మీడియా సెల్ ను ఏర్పాటు చేశారు. ఈ మాక్ కౌంటింగ్లో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీఓ మహేశ్వర్, మైక్రో అబ్జర్వర్లు, సూపర్వైజర్లు, లెక్కింపు సిబ్బంది పాల్గొన్నారు.

# తండ్రి ఆశయ సాధన కోసమే రాజకీయాల్లోకి..

**పేదల పెన్నిధి శ్రీపాదరావు : మంత్రి శ్రీధర్ బాబు**

**మంథని, (జనంసాక్షి)**



తన తండ్రి స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు ఆశయ సాధన కోసమే రాజకీయాల్లోకి వచ్చినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తెలిపారు. తన తండ్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అసెంబ్లీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు 88వ జయంతి సందర్భంగా ఆదివారం మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మంథనిలో శ్రీపాదరావు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... తన తండ్రి శ్రీపాదరావు సర్పంచ్ నుంచి అసెంబ్లీ స్పీకర్ వరకు పదవులు అలంకరించడమే కాకుండా పదవులకు వన్నెతెచ్చాడని కొనియాడారు. పేద ప్రజల సంక్షేమం, అభ్యున్నతి కోసం, అలాగే తాను ప్రాతినిధ్యం వహించిన మంథని నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా అహర్నిశలు పనిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముస్లిం ఖైదీలకు ఇఫ్తార్ సామాగ్రి పంపిణీ

**కరీంనగర్ మార్చి 02 (జనంసాక్షి)**



జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తూ.. ఉపవాస దీక్షలు (రోజా ) చేపడుతున్న ముస్లిం ఖైదీలకు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఎంఐఎం పార్టీ అధినేత హైదరాబాద్ ఎంపీ భారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంఐఎం కార్పొరేటర్లు, నాయకులు, ఖైదీల ఇఫ్తార్ కోసం పండ్లు, డ్రైఫ్రూట్స్, నమాజ్ కోసం జానిమాజులు, టోపీలు, తస్బీహ్, సూరే యాసిన్, సూరే రహమాన్, ఖురాన్ మజీద్, సుర్మా, అత్తర్ లను పంపిణీ చేశారు. జిల్లా జైలు పర్యవేక్షడికి, జైలర్ కు ఈ సామాగ్రిని అందజేశారు. ఈసందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ మాట్లాడుతూ తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ సూచనల మేరకు గత 27 సంవత్సరాలుగా ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఖైదీలకుఇఫ్తార్ సామాగ్రి, నమాజ్ ఆచరించడం కోసం సామాగ్రి, ఖురాన్ లను అందిస్తున్నామన్నారు. ఇదే కాకుండా రంజాన్ పర్వదినం ఈదుల్ ఫితర్ సందర్భంగా కుల మతాలకు అతీతంగా యావత్తు ఖైదీలకు, జైలు సిబ్బంది మొత్తం 500 మందికి చికెన్ బిర్యానీ, షీర్ ఖుర్మా సెమియాలను పంపిణీ చేస్తున్నామన్నారు. బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం పార్టీ అభివృద్ధి కోసం, నాయకుల కోసం పవిత్ర రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు చేయాలని ఖైదీలకు, ముస్లిం సమాజానికి విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ ముస్లిం సమాజానికి పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ రంజాన్ మాసంలో చెడును పారద్రోలి.. మంచిని ప్రసాదించాలని,

ఎంఐఎం దేశ వ్యాప్తంగా విస్తరించి, విజయం సాధించాలని, బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ నాయకత్వాన్ని ప్రజలు బల పర్చాలని అల్లాహ్ ను వేడుకున్నారు. ఎక్కువ సమయం ఫోన్లలో కాకుండా ప్రార్థనల్లో గడపాలని ముస్లిం యువతకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, జాయింట్ సెక్రటరీ హాఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, ఆతిన, కోశాధికారి ఇబ్రహీం, మాజీ కార్పొరేటర్లు శర్ఫుద్దీన్, అలిబాబా, మాజిద్ హుస్సేన్, నాయకులు కరీంఖాన్, ఫసియుద్దీన్ ఖాలీద్, సాజిద్, కాజం ఖాన్, అసిమ్, సాజిద్ మాజిద్, అబ్దుల్లా ఖాన్, సుల్తాన్ మీర్జా తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు వద్దన్నవారు ఏఐటీయూసీపై విమర్శలా..?

**కార్మికుల పెండింగ్ సమస్యలపై 5న సిఅండ్ఎండి స్థాయి సమావేశం**

**గోదావరిఖని (జనంసాక్షి)**





అలవెన్సుల పై ఆదాయపు పన్ను యాజమాన్యం చెల్లించాలని, స్వంత ఇంటి పథకం అమలు చేయాలని, మారుపేర్లు, విజిలెన్స్ బాధితుల సమస్యను పరిష్కరించాలని ఏఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో అద్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేస్తున్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు వద్దని, సింగరేణి భవన్ లో కూర్చుని యాజమాన్యం సంకలో చేరి, కార్మికులకు ద్రోహం చేసిన కొన్ని కార్మిక సంఘాలు ఏఐటియుసిపై విమర్శలు చేయడం సరికాదని ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్లు పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖని భాస్కరరావు భవన్లో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ అధ్యక్షతన జరిగిన ఆర్జీ వన్ బ్రాంచి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ.. సింగరేణి ఏడవసారి జరిగిన ఎన్నికల్లో ఏఐటియుసి గుర్తింపు సంఘంగా గెలిచిన తరువాత యాజమాన్యంకు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జరిగె స్ట్రక్చర్, సిఅండ్ఎండి స్థాయి సమావేశాలు ఏర్పాటు చేయాలని ఏఐటియుసి లేఖ రాయడం జరిగిందని వారు పేర్కొన్నారు. యాజమాన్యం పది నెలల తర్వాత సెప్టెంబర్ 2024 లో గుర్తింపు పత్రం ఇవ్వడం జరిగిందని, నవంబర్ 28 న కొత్తగూడెంలో డైరెక్టర్ ఫా స్థాయి సమావేశంలో కార్మికుల పెండింగ్ సమస్యలపై అవగాహన కుదిరిందని, వాటిపై ఉత్తర్వులు రావాల్సిన అవసరం ఉందని, ఇంకా కొన్ని సమస్యలను సి అండ్ ఎండి స్థాయి సమావేశంలో మాట్లాడాల్సిన అవసరం ఉందని, అందుకోసం ఏఐటియుసి డిసెంబర్ 2024 లో యాజమాన్యం కు ప్రధాన డిమాండ్ లపై లేఖ రాయడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, సి అండ్ ఎండి పదవీ కాలం పొడిగింపు, ఇద్దరు డైరెక్టర్ ల నియామకం వల్ల జనవరి, ఫిబ్రవరి నెలల్లో సి అండ్ ఎండి స్థాయి సమావేశం జరుగలేదని వారు పేర్కొన్నారు. ఏఐటియుసి బాధ్యత గా కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తావుంటె, కొన్ని కార్మిక సంఘాలు ఏఐటియుసి పై చౌకబారు విమర్శలు చేయడం సిగ్గు చేటని వారు పేర్కొన్నారు. సింగరేణి లో గుర్తింపు సంఘం ఎన్నికలు వద్దన్న కార్మిక సంఘాలు ఏఐటియుసి పై విమర్శలు చేసే నైతిక అర్హత లేదని వారు పేర్కొన్నారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా కోడ్ ఆఫ్ డిసిప్లిన్ ప్రకారం కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఏఐటియుసి కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు. అదేవిధంగా కార్మికుల పెండింగ్ సమస్యలపై ఈనెల 5న జరిగే సి అండ్ ఎండి స్థాయి సమావేశంలో చర్చిస్తామని, ప్రధానంగా పెర్క్ పై ఆదాయపు పన్ను యాజమాన్యం చెల్లించాలని, మారు పేరుల సమస్య, విజిలెన్స్ బాధితుల సమస్య పరిష్కారం కోసం, కార్మికుల కు సొంత ఇంటి పథకం అమలుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. సింగరేణి లో కొత్త గనులు వస్తనే మనుగడ కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. సంస్థ పరిరక్షణ కోసం, కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతున్న ఏఐటియుసి పై చౌకబారు విమర్శలు చేస్తే కార్మికులు తగిన బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు. ఇంకా ఈ సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్ జి వన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి రంగు శ్రీను, ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ఎ గౌస్, నాయకులు గండి ప్రసాద్, ఆకునూరి శంకరయ్య, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, నాయిని శంకర్, సదా మల్లేష్, బి సంతోష్, కుక్కల శ్రీనివాస్, కన్నం లక్ష్మీనారాయణ, టి మల్లయ్య, మాటేటి శంకర్, పర్లపల్లి రామస్వామి, గుంపుల కుమారస్వామి, కలువల జగన్, చిలుముల రాజయ్య, కోట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి స్వేరో కుటుంబానికి అండగా ఉంటా..

- స్వేరో ఆత్మీయ పలకరింపులో పాల్గొన్న డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్

**పెన్‌పహాడ్, మార్చి 2 (జనం సాక్షి) :** నాతో అడుగులో అడుగై పేద విద్యార్థుల ఉన్నతమైన చదువుల కోసం పోరాడుతున్న ప్రతి ఒక్కరు స్వేరో నెట్వర్క్లో భాగమైన గురుకుల విద్యార్థుల తల్లిదండ్రుల కుటుంబాలకు అండగా ఉంటానని స్వేరో నెట్వర్క్ వ్యవస్థాపకులు సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన గురుకుల తల్లిదండ్రుల కమిటీ రాష్ట్ర నాయకురాలు పల్లె పంగు రాణి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాగా ఈ సందర్భంగా స్వేరో అనుబంధ సంఘమైన గురుకుల తల్లిదండ్రుల సూర్యాపేట జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుడు బొల్లికొండ వీరస్వామి ఆధ్వర్యంలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాణి గురుకుల తల్లిదండ్రుల కమిటీలో కొనసాగుతూ గురుకులాల అభివృద్ధికి అనేక ఉద్యమాలు చేశారని పేర్కొన్నారు స్వేరో నెట్వర్క్ లోకి ఎంతోమందిని భాగస్వాములు చేయడానికి అహర్నిశలు కృషి చేశారని ఆమె సేవలను గుర్తు చేశారు. ఆమె మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని, ఇద్దరు బిడ్డలకు స్వేరో నెట్వర్క్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. స్వేరో చరిత్రలో గొప్ప నియమం ఈ కడుపు చల్ల కార్యక్రమమని కళ్ళు సీసాలతో,మందు బాటిల్లతో కాదు పాలు,పండ్ల రసాలతో ఆత్మీయ పలకరింపు



కార్యక్రమం చేయడం రేపటి తరానికి చక్కటి దిక్సూచని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఇంత గొప్పగా ఏర్పాటు చేసిన సూర్యాపేట జిల్లా కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్వేరో ఆధ్వర్యంలో సేకరించిన సుప్రీం స్వేరో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో రాణి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్వేరో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మామిడాల ప్రవీణ్ కుమార్, చీఫ్ కన్వీనర్ బల్గూరి దుర్గయ్య, స్వేరో రాష్ట్ర అధ్యక్షుడు చిలక బత్తిని వీరన్న,తల్లిదండ్రుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నరసయ్య, రాష్ట్ర నాయకులు దాసరి శ్రీను, మాతంగి రాములు, జాన్ కుమార్, కొండగడుపుల ఎల్లయ్య, ఆకారపు భాస్కర్, మాట్లాడుతూ చెరుకుపల్లి లక్ష్మణ్,మర్రి శోభ, ఎలిజబెత్, నకిరేకంటి వెంకట్, దారమల్ల ప్రకాష్, చెడుపంగు నాగార్జున, మంద సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- కారును ఢీకొట్టిన లారీ
- అక్కడికక్కడే ఇద్దరు వ్యక్తులు మృతి
- జాతీయ రహదారిపై ట్రాఫిక్ క్లియర్ చేసిన పోలీసులు






**హైదరాబాద్, మార్చి 2 (జనం సాక్షి) :** విజయవాడ హైదరాబాదు జాతీయ రహదారి 65 పై ఆదివారం తెల్లవారుజామున లారీ కారును ఢీకొట్టడంతో సయ్యద్ నవాజ్ (28) మహమ్మద్ జుబేరా (28) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందడం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం మృతుడు వత్తిపరంగా వెల్డర్ పని చేయుచున్నాడు ఆ పనిలో భాగంగా శనివారం సాయంత్రము తన వ్యాపార భాగస్తుడు అయినా షోయబ్ సయ్యద్ సలీం స్నేహితుడు మహమ్మద్ సల్మాన్ లు కలిసి నల్లగొండ నుండి టీసీ 05-8-2054 నెంబర్ గల బేలోనా కారులో హైదరాబాద్ వెళ్లి వెల్డింగ్ పనులు చూసుకొని అదే కారులో నల్గొండకు బయలుదేరి వస్తుండగా హైదరాబాద్ విజయవాడ రహజాతీయ రహదారిపై పెద్ద కాపర్తి శివారులోకి వచ్చేసరికి తెల్లవారుజామున ఆర్‌టీ-11-జీబీ-7376 నెంబర్ గల లారీ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ వెనక నుండి కారును ఢీకొట్టడంతో కారు ముందు వెళ్తున్న ఎన్‌ఎల్ 07- డీ -0613 నెంబర్ గల సమన్వి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఢీకొట్టడంతో బస్సు ముందు వెళ్తున్న టీఎస్ 05-తిఎఫ్ఎన్ -1341 నెంబర్ గల క్రెటా కార్ ను ఢీకొట్టడం జరిగింది ఈ ప్రమాదంలో బెలినో కార్ ముందు వెళ్తున్న బస్సును ఢీకొట్టడంతో కారు నడుపుతున్న సయ్యద్ నవాజ్ ముందు కూర్చున్న మహమ్మద్ జుబేరాలు బలమైన గాయాలుతో అక్కడికక్కడే చనిపోయారు బెలోనో కారులో వెనుక కూర్చున్న షోయబ్ ముస్తఫా,సల్మాన్ లకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నల్గొండలోని నవ్య హాస్పిటల్ కు తరలించడం జరిగింది. ఎప్పుడు తీవ్ర రద్దీగా ఉండే జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం కలగడంతో పోలీసులు ప్రమాదం జరిగిన వాహనాలను రోడ్డు పక్కకు జరిపి ట్రాఫిక్ ను క్లియర్ చేయడం జరిగింది ఫిర్యాదుదారని తండ్రి సయ్యద్ నయీమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నకిరేకంటి ధర్మ తెలిపారు.

## నూతన నోబుల్ స్కూల్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**గద్వాల్ రూరల్, మార్చి 2 (జనంసాక్షి) :** గద్వాల మండల పరిధిలోని సంగాల గ్రామంలో నూతన నోబుల్ స్కూల్ సీబీఎస్సీ క్యాంపాస్ స్కూల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పాల్గొన్నారు.ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి శ్రీ సరస్వతి దేవి విగ్రహానికి పూజా కార్యక్రమం నిర్వహించి స్కూల్లో తరగతి గదులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సంఘాల అయ్యప్ప రెడ్డి ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జాతరకు అధికారుల లెక్కా పక్కా.!

**పాపన్నపేట, మార్చి 2 (జనంసాక్షి) :** ఏడుపాయలలో మహాశివరాత్రి జాతరలో ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహా పట్టు వస్త్రాల సమర్పణ,జోగిని శ్యామల అమ్మవారికి బోనం సమర్పణ,జబర్దస్త్ టీమ్ కామెడీ భక్తలను అలరించింది. ఈసారి ఏడుపాయల జాతరకు భక్తుల సంఖ్య తక్కువగానే ఉన్నట్లు ఆలయ వర్గాల ద్వారా తెలుస్తోంది. కుంభ మేళా ప్రభావం స్పష్టంగా కనిపించింది.కాగా..గాజులు, ఆటబొమ్మలు, తినుబండారాల దుకాణాలతో సందడిగా మారింది.భక్తులు వనదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆర్టీసీ బస్సులో తిరుగు పయనమయ్యారు.నీటి సమస్య..దూర ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులకు నీటి సరఫరాలో అంతరాయం కలిగి ఆగ్రహానికి గురించేసింది.బస్సులో రద్దీ కొనసాగింది.ఈవో లెక్కా పక్కా..దేవాదాయ శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేసింది.పరిసరాల పరిశుభ్రత,వివిధ శాఖల అధికారులతో సమన్వయం సఫలీకృతం అయ్యారు.ఆలయ ఈవో చంద్రశేఖర్ భక్తుల సమస్యలు గూర్చి క్షేత్ర స్థాయిలోకి వెళ్ళి తెలుసుకోవడం విశేషం.పక్కా లెక్కా



ప్రణాళిక కోస మెరుపుగా నిలిచింది. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సమీక్షలతో అధికారులు అలెర్ట్ అయ్యారు.ఎస్పీ నిఘా భళా..శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వనదుర్గా క్షేత్రంలో మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ సాదాసిదాగా నిరంతర పర్యవేక్షణ ప్రత్యేకంగా భక్తులను ఆకట్టుకుంది.జల ప్రమాదాల తగ్గింపునకు జాలి ఏర్పాట్ల పై నిఘా,పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తూ జాతర లో హైలెట్ గా నిలిచింది.

## నైన్ జలాల్పూర్‌లో 1000 కోళ్లు మృతి

### ఆదుకోవాలని విజ్ఞప్తి చేసిన బాధితుడు సతీష్ గౌడ్



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 2 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా కొల్చారం మండలం నాయినీజలాల్ పూర్ గ్రామంలో ఓ కోళ్ల ఫారంలో ఆదివారం 1000 కోళ్లు మృతి చెందాయి. గంటల వ్యవధిలోని 1000 కోళ్లు మృతి చెందడంతో సుమారుగా రెండు లక్షల రూపాయల వరకు నష్టపోయామని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్థిక సహాయం అందించి తగిన చర్యలు చేపట్టాలని పౌల్ట్రీఫామ్ యజమాని సతీష్ గౌడ్ కోరారు. పశుసంవర్ధక శాఖ అధికారులు, కోడి పిల్లలను పంపిణీ చేసిన సూపర్వైజర్లు ఎవరు కూడా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండ తీవ్రతకు మాత్రం కోళ్లు చనిపోవడం లేదని దానికి సంబంధించిన అన్ని యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నమని కోళ్ల పారం యజమానీ తెలిపారు. బర్డ్ ఫ్లు వచ్చిందేమో అని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయం కోసం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య ను వివరణ కోరగా జిల్లాలో ఇప్పటివరకు బర్డ్ ఫ్లు సంబంధించినటువంటి ఒక్క కేసు కూడా నమోదు కాలేదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## చెన్నూరులో 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



**పాలకుర్తి, మార్చి 2 (జనంసాక్షి) :** మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన గోపగాని వెంకటయ్య ఇంటిలో నిల్వ ఉంచిన ఏడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను ఆదివారం పట్టుకొని స్వాదీనం చేసుకున్నట్లు ఎస్సై లింగారెడ్డి తెలిపారు. నర్సింగపురం తండాకు చెందిన భూక్య టీక్యా బియ్యంను వెంకటయ్య ఇంటిలో బియ్యంను నిల్వ చేశాడని తమకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బియ్యలను స్వాదీనం చేసుకొని టీక్యాపై కేసు నమోదు. చేసినట్లు తెలిపారు.

## సమ్మిరెడ్డికి శ్రీపాదరావు సేవా పురస్కారం

**శంకరపట్నం, మార్చి 2 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గద్దపాకకి చెందిన రంగస్థలం కళాకారుడు అలివేలు సమ్మిరెడ్డికి మాజీ స్పీకర్ శ్రీపాదరావు సేవా పురస్కారం 2025 అవార్డును అందుకున్నారు. తెలంగాణ రంగస్థలం కళాకారుడిగా అనేక సంవత్సరాలుగా మరుగున పడ్డ కళలను కళాకారులను వెలుగులోకి తీసుకువస్తూ ఆయన చేస్తున్న విశేష కృషికి దుద్దిల్ల శ్రీపాదరావు సేవ పురస్కారానికి సమ్మిరెడ్డి ఎంపికయ్యారు ఆదివారం కరీంనగర్లో జరిగిన కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు ఈ సందర్భంగా సమ్మిరెడ్డి మాట్లాడుతూ ఈ పురస్కారానికి తనని ఎంపిక చేసిన తెలంగాణ ఫోక్స్ అకాడమీ అధ్యక్షులు కృపానందం కి ధన్యవాదాలు తెలియజేశారు. నిష్కలంక రాజకీయ నాయకుడైన శ్రీపాదరావు పేరిట కలిగిన ఈ సేవ పురస్కారాన్ని అందుకోవడం సంతోషకరమని, మరుగున పడుతున్న



కలలను ప్రోత్సహించడానికి శ్రీపాదరావు ఎంతగానో కృషి చేశారని మారుమూల పల్లెలో కళాకారులకు తగిన చేతనిచ్చి ఆయన ప్రోత్సహించేవారని పేర్కొన్నారు. శ్రీపాదరావు మన మధ్యల లేకపోయినా ఆయన ఆశయాలకు అనుగుణంగా ఆయన పేరిట ఇలాంటి పురస్కారాలు అందిస్తూ కళాకారులను ప్రోత్సహించడం ఎంతో అభినందనీయంకరమని అలివేలు సమ్మిరెడ్డి పేర్కొన్నారు.

# నాగరాజు కుటుంబానికి రూ:1.37 లక్షల సాయం



**న్యాల్‌కల్, మార్చి 2 (జనం సాక్షి) :** ఫిబ్రవరి 22న ప్రమాదవశాత్తు మృతి చెందిన నాగరాజు(35) కుటుంబానికి రూ:1.37 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. న్యాల్ కల్ కు నాగరాజు గత కొన్ని సంవత్సరాలుగా స్థానిక ఇండెన్ గ్యాస్ ఏజెన్సీలో మేనేజర్‌గా విధులు నిర్వహించేవారు. ఫిబ్రవరి 22న, విధి నిర్వహణలో భాగంగా.. ఝురాసంగం మండలం, కుప్పానగర్ గ్రామం నుండి ద్విచక్ర వాహనంపై న్యాల్ కల్ కు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలై మృతి చెందాడు. ఈ మేరకు ఆదివారం మృతుడు నాగరాజు (35) భార్య చిట్టి, కుటుంబ సభ్యులకు ఇండెన్ గ్యాస్ నిర్వాహకులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు కే.భాస్కర్ రెడ్డి రూ:50000 మేర ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కంపెనీ యాజమాన్యం సైతం మరో రూ:87000 ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో సిద్ధి లింగయ్య స్వామి, రవి, కిరణ్, లడ్డు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 ఫీల్డ్ అసెస్‌మెంట్ బృందం పర్యటన

**హైదరాబాద్, మార్చి 2 (జనంసాక్షి) :** నేటి నుండి హైదరాబాద్ నగరంలో స్వచ్ఛ సర్వేక్షన్ బృందం పర్యటించనున్నట్లు కమినర్ యెలంబరిది తెలిపారు ఈ బృందం 2025 మార్చి 3వ వారం వరకు అసెస్మెంట్ కొనసాగుతుందన్నారు. పీఐయూ బృందం తయారుచేసిన సర్కిల్ వారీగా ఏర్పాటుచేసి హ్యాండ్‌బుక్‌లలో అన్ని అసెస్‌మెంట్ స్థానాల యొక్క వార్డు వారీగా వివరాలు ఉన్నాయి, అవి నివాస ప్రాంతాలు, వాణిజ్య ప్రాంతాలు, బల్క్ చెత్త జనరేటర్ల జాబితా, పబ్లిక్ టాయిలెట్ల స్థానాలు, మూత్రశాలలు, ఉద్యానవనాలు, తోటలు, నీటి వనరులు, పర్యాటక ప్రదేశాలు, పాఠశాలలు, విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, స్ట్రోమ్ వాటర్ డ్రెయిన్లు, నల్లాలు, కేంద్రాలు, వ్యర్థాలు-ద్వితీయ సేకరణ పాయింట్లు. ఈ క్రింది లాగ్ పుస్తకాలు సిద్ధం చేయబడిందని ఏఎంహెచ్, డీఈఈ నిర్ధారించుకోవాలని ఆదేశించారు.

## మానవత్వం చాటుకున్న నీడ..

**గోదావరిఖని, మార్చి 2 (జనంసాక్షి) :** స్థానిక విఠల్ నగర్ కీ చెందిన చిలుక చందు రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యానికి గురైయ్యాడు. వైద్య పరీక్షలలో తన కిడ్నీ నరానికి క్యాన్సర్ వచ్చిందని తెలిపారు. పెద కుటుంబానికి చెందిన ఇతనికి హైదరాబాదులోని క్యాన్సర్ హాస్పటల్ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందుతున్న మందులకు, ఇతర ఖర్చులకు సుమారు నెలకు 20 వేల రూపాయలు ఖర్చవుతుంది. ఇద్దరు చిన్నపిల్లలతో భార్య ఇంటికి పరిమితం అయింది. దీంతో ఇరుగుపొరుగు వారి సహాయంతో ఇప్పటివరకు జీవనం సాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న నీడ స్వచ్ఛంద సంస్థ నీడ ఏర్పాటుచేసిన మన వందరూపాయలు సమాజం కోసం గ్రూపు నుండి 5000 రూపాయలను ముఖ్య అతిథులు విఠల్ నగర్ మాజి కార్పొరేటర్ నాయకులు, చుక్కల శ్రీనివాస్ చేతుల మీదగా ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా చుక్కల శ్రీనివాస్ మాట్లాడుతూ నీడ సేవలు మరువలేనివని మరపురాని అని తెలిపారు. ఎంతోమందికినిరుపేదలకీ ఇల్లులు, అనారోగ్యానికి గురైన వారికి ఆర్థిక సహాయాలు, పేద



విద్యార్థులు చదువులకు ఫీజు లు ఇలా చెప్పుకుంటూ పోతే సమాజానికి ఉపయోగపడే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. నీడ స్ఫూర్తిగా తీసుకొని దాతలు ముందుకు రావాలని తెలిపారు. ఈ సందర్భంగా నీడ అధ్యక్షులు పల్లెల రమేష్ గౌడ్ మాట్లాడుతూ చిలక చందు దీనగాధకు చెల్లించి నీడ సమస్త నుంచి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించామని. ఇంకా ఇతనికి సహాయం చేసే దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నీడ అధ్యక్షులు పల్లెర్ల రమేష్ గౌడ్, నాయకులు చుక్కల శ్రీనివాస్, సభ్యులు డాక్టర్ తిరుపతి అంజి బాబు,కూకట్ల రాముకుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న మూగ జీవాలు పట్టివేత

- 2 కంటైనర్‌లు పట్టివేత
- 65 పశువులు రాంపూర్ గోశాలకు తరలింపు ఎస్ఐ తాజుద్దీన్

**ఏటూరు నాగారం, మార్చి 2 (జనం సాక్షి) :** ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రంలో అటవీ శాఖ కార్యాలయం చెక్ పోస్ట్ వద్ద ఆదివారం తెల్లవారు జామున ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ పి .ఐ పి ఎస్.ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఏటూరు నాగారం సిఐ అనుముల శ్రీనివాస్ సూచనల మేరకు ఎస్ఐ తాజుద్దీన్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా. చర్ల నుండి హైదరాబాద్ కు అక్రమంగా పశువులు తరలిస్తున్న కంటైనర్. 2 వాహనాలను ఆపి తనిఖీ చేయగా ఎలాంటి రహదారి . కొనుగోలు అనుమతులు లేకుండా మూగ జీవాలు . పశువులు ఒకదానిపై ఒకటి కిక్కిరిసి కట్టివేసి మూగజీవాలకు ఆహారం (.మేత) తాగునీటి సౌకర్యం ఏమీ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా 65 పశువులను చిత్రహింసలకు గురిచేస్తూ తరలిస్తుండడంతో పట్టుకున్నారు. లారీ డ్రైవర్. క్లీనర్. ఎండి ఈసా.మారపాక రాజు .ఎండి అజిత్ అలీ ఖాన్.జియాముద్దీన్. లకావత్ బాలరాజు. సాంబశివుడు. 6 ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా. ఏటూర్ నాగారంకు



చెందిన ఎండి ఈసా చర్ల ప్రాంతం చుట్టుపక్కల గ్రామాల వద్ద పశువులను కొనుగోలు చేసి. వాహనాలలో హైదరాబాద్ తరలించి అమ్మకాలు జరుపుతూ లాభాలు అర్జిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు .పశువులను వెటర్నరీ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి రాంపూర్ గోశాలకు గోశాలకు తరలించడం జరిగింది. అన్నారు. ఈ సందర్భంగా ఎస్సై తాజుద్దీన్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మూగజీవాలను తరలిస్తే ఊరుకునేది లేదని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 20 కిలోమీటర్ల పరిధిలో టోల్‌గేట్ రుసుం వసూళ్లు చేయరాదు

- అఖిలపక్షం నాయకులు తీర్మానం

**నేరేడుచర్ల, మార్చి 2 (జనంసాక్షి) :** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామ శివారులో కొత్తగా ఏర్పాటు చేసిన టోల్ గేట్ కు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న వారికి ఎటువంటి టోల్గేట్ రుసుము లేదని మొదట చెప్పి,నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న నేరేడుచర్ల పట్టణానికి చెందిన వారికి మిర్యాలగూడకు రానుపోను రూ. 80 లు టోల్ గేట్ రుసుము వసూలు చేస్తున్నారని అఖిలపక్ష నాయకులు విమర్శించారు. ఆదివారం నేరేడుచర్లలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు, వ్యాపారస్తులు సమావేశమై నేరేడుచర్ల వారికి ఎటువంటి టోల్గేట్ రుసుము వసూలు చేయరాదని తీర్మానం చేశారు.లేనిపక్షములో ఈనెల 10వ తారీకు తర్వాత ఆందోళన కార్యక్రమము చేపడతామని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు కొణతం చిన్న వెంకటరెడ్డి, దొండపాటి అప్పిరెడ్డి, కొదమగుండ్ల నాగేష్, ధూళిపాళ ధనంజయ నాయుడు,నూకల సందీప్ రెడ్డి, కొణతం నాగిరెడ్డి, సంకల మద్ది సత్యనారాయణ రెడ్డి, సరికొప్పుల నాగేశ్వరరావు, జంగయ్య, నాగండ్ల శ్రీధర్, చిత్తలూరి సైదులు, బచ్చలకూరి ప్రకాష్,ఇనుపాల పిచ్చిరెడ్డి, యం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తీర్మానం ప్రతులను మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్, హుజూర్నగర్ ఆర్డిఓ, నేరేడుచర్ల ఎస్సై,తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, టోల్ గేట్ మేనేజర్ కు అందజేశారు.





# స్టాక్ మార్కెట్స్‌కి కష్టకాలం

ముంబై (జనంసాక్షి)

భారతీయ స్టాక్ మార్కెట్ లో ఫారెన్ ఇన్స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ (ఎఫ్ఐఐ) ల పాత్ర చాలా కీలకం అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. దానికి కారణం ఎఫ్ఐఐలు మన స్టాక్ మార్కెట్స్ లో పెట్టుబడి పెడితే మార్కెట్లు భారీ లాభాల్లో ట్రేడ్ అవుతాయి. అదే ఒకవేళ వారు తమ షేర్లని విక్రయిస్తే, మార్కెట్లు భారీగా నష్టపోయే అవకాశం ఉంటుంది. అలాంటిది గత కొన్ని రోజుల నుంచి ఎఫ్ఐఐలు తమ షేర్లని భారీగా విక్రయిస్తూ వస్తున్నారు.

దీని కారణంగా గత కొన్ని రోజుల నుంచి మన భారతీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. కేవలం ఒక్క ఫిబ్రవరి నెలలోనే సుమారు రూ. 34,574 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లని ఎఫ్ఐఐలు విక్రయించడం జరిగింది. అలాగే ఈ ఏడాది అనగా 2025 సంవత్సరం మొదటి నుంచి ఇప్పటి వరకు ఏకంగా రూ. 1,12,000 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లని ఎఫ్ఐఐలు విక్రయించడంతో మన మార్కెట్లు పతనం అవ్వడం జరిగింది. మరొకవైపు శుక్రవారంతో ముగిసిన ట్రేడింగ్ సెషన్ లో భారతీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో ట్రేడ్ అవ్వడం జరిగింది. శుక్రవారంతో ముగిసిన ట్రేడింగ్ సెషన్ లో నిఫ్టీ 420 పాయింట్లు అనగా 1.86 శాతం, అలాగే సెన్సెక్స్ 1414 పాయింట్లు అనగా 1.90 శాతం నష్టపోవడం జరిగింది. చివరగా జనవరి నెలలో ఫారెన్ ఇన్స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ రూ. 78,027 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లని విక్రయించడం జరిగింది. అదే గత ఏడాది డిసెంబర్ నెలలో మాత్రం ఫారెన్ ఇన్స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ రూ. 15,446 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లని కొనుగోలు చేయడం జరిగింది. ఇక గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో కూడా ఎఫ్ఐఐలు రూ. 1,15,629 కోట్ల విలువైన దేశీయ ఈక్విటీ షేర్స్ ని విక్రయించగా, డిసెంబర్ 31 తో ముగిసిన పూర్తి సంవత్సరంలో వారు కేవలం రూ. 427 కోట్ల విలువైన షేర్స్ ని మాత్రమే కొనుగోలు చేశారు.

# సెబీ మాజీ చీఫ్ మాధవి సహా ఐదుగురిపై ఎఫ్ఐఆర్?

ముంబై (జనంసాక్షి)

స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెబీ' మాజీ ఛైర్‌పర్సన్ మాధవీపురి బుచ్, ఐదుగురు ఇతర అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదుకు ముంబయిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఎఫ్ఐఆర్‌లు నమోదు కానున్న ఇతర అధికారుల జాబితాలో బీఎస్ఈ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సుందర రామన్ రామమూర్తి, మాజీ బీఎస్ఈ ఛైర్మన్ ప్రమోద్ అగర్వాల్, సెబీ జీవితకాల సభ్యులు అశ్వనీ భాటియా, అనంత్ నారాయణ్.జి, కమ్లేశ్ చంద్ర వర్షనే ఉన్నారు. స్టాక్ మార్కెట్ మోసం, సెబీ నిబంధనల ఉల్లంఘన వ్యవహారంలో ఈ ఆరుగురిపై నమోదైన అభియోగాలను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ శశికాంత్ ఏకనాథ్‌రావు బంగర్ ఈ మేరకు ఆర్డర్స్ ఇచ్చారు.

**ఏసీబీ వర్లీ విభాగానికి ఆదేశాలు**

"అభియోగాలతో ముడిపడిన ప్రాథమిక ఆధారాలు లభ్యమయ్యాయి. సెబీ వైపు నుంచి లోటుపాట్లు, అవకతవకలు జరిగినట్లు సమాచారం లభించింది. దీనిపై పారదర్శక, నిష్పాక్షిక దర్యాప్తు జరగాల్సిన అవసరముంది" అని ప్రత్యేక ఏసీబీ కోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. "దీనిపై జరిగే దర్యాప్తును మేం పర్యవేక్షిస్తాం. దర్యాప్తులో గుర్తించే వివరాలతో 30 రోజుల్లోగా మాకు




స్టేటస్ రిపోర్టును సమర్పించాలి" అని న్యాయమూర్తి జస్టిస్ శశికాంత్ ఏకనాథ్‌రావు ఆదేశించారు. అభియోగాల ఆధారంగా ఆరుగురు నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలంటూ ముంబయి రీజియన్‌లోని ఏసీబీ వర్లీ విభాగానికి జడ్జి ఆదేశాలిచ్చారు. ఐపీసీ, అవినీతి నిరోధక చట్టం, సెబీ చట్టం, వర్తించే ఇతరత్రా చట్టాలకు సంబంధించిన సెక్షన్లతో అభియోగాలను నమోదు చేయాలన్నారు.

**హిండెన్‌బర్గ్ సంచలన నివేదికలు**

చట్ట విరుద్ధంగా సెబీ మాజీ చీఫ్ మాధవీపురి బుచ్ ఆర్థిక లబ్ధి పొందారంటూ వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేయించాలంటూ ఒక మీడియా రిపోర్టర్ ఫిర్యాదు చేయడం వల్ల డొంక కదిలింది. 1992 సెబీ చట్టానికి విరుద్ధంగా ఆమె నడుచుకున్నారని ఫిర్యాదుదారుడు ఆరోపించారు. గతేడాది ఆగస్టులో మాధవీపురి బుచ్‌పై సంచలన ఆరోపణలతో అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్ సంచలన నివేదికలు విడుదల చేసింది. సెబీ చీఫ్ హోదాలో అదానీ గ్రూపునకు అనుకూలంగా ఆమె పనిచేశారని తెలిపింది. విదేశాల్లో వినోద్ అదానీ నడుపుతున్న పలు ఆఫ్‌షోర్ కంపెనీల్లో మాధవీపురి బుచ్, ఆమె భర్త ధావల్ బుచ్‌కు వాటాలు ఉన్నాయని ఆ నివేదికల్లో ప్రస్తావించారు. గౌతం అదానీ అన్నయ్యే వినోద్ అదానీ. మొత్తం మీద వివిధ ఆరోపణలు, వివాదాల నడుమ ఇటీవలే మాధవీ పురి బుచ్ సెబీ చీఫ్‌గా మూడేళ్ల పదవీకాలాన్ని ముగించారు.

# శాంసంగ్ నుంచి మరొక ప్రీమియం స్మార్ట్ ఫోన్




హైదరాబాద్ (జనంసాక్షి)

సౌత్ కొరియాకి చెందిన ఫేమస్ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ అయిన Samsung, తమ సరికొత్త ప్రీమియం 5జీ స్మార్ట్ ఫోన్ సిరీస్ అయిన Samsung Galaxy S25 ఎడ్జ్ స్మార్ట్ ఫోన్ ని ఏప్రిల్ 16 న విడుదల చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు కొన్ని టెక్ మీడియా సంస్థలకు చెందిన నివేదికల ద్వారా తెలుస్తుంది. ఈ స్మార్ట్ ఫోన్ ఇంకా విడుదల కాకముందే దీనికి సంబంధించిన ఫీచర్స్ వివిధ ఆన్ లైన్ ప్లాట్ ఫారంలలో లీక్ అవ్వడం జరిగింది. వీటి ప్రకారం, Samsung Galaxy S25 Edge 5జీ స్మార్ట్ ఫోన్ క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 8 జెన్ ఎలైట్ ప్రాసెసర్ తో పాటు 4000 ఎంఏహెచ్ బ్యాటరీ, 25 వాట్ ఫాస్ట్ ఛార్జింగ్

సపోర్ట్, ఆండ్రాయిడ్ 15 ఆపరేటింగ్ సిస్టంతో అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ స్మార్ట్ ఫోన్ ధర విషయానికి వస్తే, దీని ప్రారంభ వేరియంట్ అయిన 8 జీబీ ర్యామ్ ం 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ ధర మన దేశంలో సుమారు రూ. 1,10,000 ధరకి అందుబాటులో ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

# దిగొస్తున్న బంగారం ధర

హైదరాబాద్ (జనంసాక్షి)

బంగారం కొనాలనుకునేవారికి శుభవార్త..బంగారం ధరలు దిగొస్తున్నాయి. గత రెండు రోజులుగా బంగారం ధర స్వల్పంగా తగ్గుతూ వస్తోంది. ఆదివారం (మార్చి 2) పసుపు లోహం(బంగారం) ధర 210రూపాయలు తగ్గింది. 10గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర(తులం) రూ. 86వేల 793లకు చేరింది. అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం (తులం) రూ. 190 లు తగ్గి రూ. 79వేల 573కి చేరింది. గతవారం రోజులు గోల్డ్ రేట్ తగ్గుతూ పెరుగుతూ వస్తుంది. 24 క్యారెట్ల బంగారం ధర హెచ్చుతగ్గులు 0.45శాతంగా నమోదయ్యాయి.

గత నెలలో మార్పు -3.4శాతంగా ఉంది.మరోవైపు వెండి ధర కూడా పెరిగింది. కిలో వెండి ధర రూ. 100 పెరిగింది. దీంతో కిలో వెండి ధర లక్ష దాటింది.

**హైదరాబాద్‌లో బంగారం ధర** హైదరాబాద్‌లో నిన్న రూ. 86వేల 439గా ఉన్న 24క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర..ఆదివారం రూ. 86వేల 649లకు చేరింది. అదే విధంగా చెన్నైలో 86వేల 641గాను, బెంగళూరులో రూ. 86వేల 635, విశాఖపట్నం లో రూ. 86వేల 657, విజయవాడలో 86వేల 655గా గోల్డ్ రేట్ కొనసాగుతోంది.



# ఫిబ్రవరిలో ... 25 వేల ఉద్యోగాలు ఊస్ట్

టెక్ కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపుల పరంపర కొనసాగుతోంది.పెద్ద పెద్ద ఐటీ కంపెనీలు ప్రతినెలా తమ వర్క్ ఫోర్స్?ను తగ్గించుకుంటున్నాయి .ప్రపంచవ్యాప్తంగా ఉన్న మెటా, హెచ్ పి, వర్క్ డే , హెచ్సిఎల్, అమెజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి అనేక టెక్, ఈకామర్స్ సంస్థలు లేఆఫ్స్ ప్రకటిస్తూనే ఉన్నాయి. తాజాగా ఫిబ్రవరిలో 46 కంపెనీలు దాదాపు 16వేల ఉద్యోగులను తొలగించాయి. జనవరిలో 5641 ఉద్యోగులను తొలగించబడ్డారు. జనవరితో పోలిస్తే ఫిబ్రవరిలో లేఆఫ్స్ భారీగా పెరిగాయి. ఫలితంగా ఉద్యోగుల సంఖ్యలో 184 శాతం తగ్గుదల కనిపిస్తోంది. ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం మెటా ఫిబ్రవరిలో దాదాపు 3600మందిని తొలగించింది. హెచ్ పి 2వేల మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. మెటా, హెచ్ పిలకు మించి సేల్స్‌ఫోర్స్, వర్క్‌డే , ఆటోడెస్క్ వంటి కంపెనీలు తమ ఉద్యోగులలో ఎక్కువమందికి పింక్ స్లిప్‌ను ఇచ్చాయి.

అయితే కంపెనీలు లేఆఫ్స్ ఎందుకు ప్రకటిస్తున్నాయి..? అంటే భారీ తొలగింపులకు దారితీసిన అనేక అంశాలు ఇక్కడ ఉన్నాయి. పెరుగుతున్న వడ్డీరేట్లు, ద్రవ్యోల్బణం ఒత్తిళ్లు, ఆర్థిక వ్యవస్థలో ఒడుదుడుకులు అనిశ్చితి ఆందోళనలు వ్యాపారులను ఆలోచనలో పడేస్తున్నాయి. చాలా కంపెనీలు తమ ఖర్చు తగ్గించుకునే పనిలో పడ్డాయి. ఆర్థిక స్థిరత్వాన్ని కోరుకుంటున్నాయి. దీంతోపాటు కోవిడ్ సమయంలో ఓవర్ హైరింగ్ వల్ల అనేక సంస్థలో సిబ్బంది అధికమయ్యింది.ఇప్పుడు ఆదాయాలు తగ్గుతున్న క్రమంలో ఉద్యోగులను




తగ్గించుకోవాల్సిన పరిస్థితి వస్తోంది.

మరో ప్రధాన అంశం..

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. ఏఐ చాలా ఉద్యోగాలపై ప్రభావం పడుతోంది. ముఖ్యంగా కస్టమర్ సర్వీస్, హెచ్ఆర్, మార్కెటింగ్ వంటి ఉద్యోగాల్లో సిబ్బం ది అవసరం లేకుండా పోతోంది. దీంతోపాటు కొన్ని కంపెనీలు మెర్జింగ్, కంపెనీ ఆదాయాల్లో తగ్గుదల వంటి అంశాలు యాజమాన్యాన్ని పునరాలోచనలో పడేస్తోంది.

కంపెనీలను లాభదాయకంగా కొనసాగించడానికి లేఆఫ్స్ ద్వారా ఖర్చులను తగ్గించుకునేలా చేసింది. మరోవైపు ఏరోస్పేస్, ఫైనాన్స్,ఇంధన రంగాలలోనూ తొలగింపులు ఉన్నాయి. కొంచెం భిన్నమైన నమూనాను నివేదించింది. ఏరోస్పేస్ కంపెనీ అయిన లిలియం మొత్తం శ్రామిక శక్తిలో చాలా వరకు తగ్గించింది. 1,000 మంది ఉద్యోగులను తొలగించింది. డిసెంబర్, 2025 ప్రారంభంలో ఆర్థిక సవాళ్లను అంచనా వేస్తూ ఉద్యోగుల తగ్గింపులను చేపట్టింది. పరిశ్రమ వ్యాప్త మార్పును సూచించింది.

# రూ. 1385 కే విమాన ప్రయాణం

విమాన ప్రయాణం చేయాలనుకునే వారికి శుభవార్త. దేశంలోని దిగ్గజ విమానయాన సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ తీపికబురు అందించింది. మరో కొత్త సేల్ లాంఛ్ చేసింది. ఎయిరిండయా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ ఇప్పుడు పేడే సేల్ తీసుకొచ్చింది. దీంట్లో భాగంగా లైట్ ఆఫర్ కింద ఎక్స్‌ప్రెస్ లైట్ ఫేర్స్ రూ. 1385 నుంచే ప్రారంభం అవుతున్నాయి. ఇదే సమయంలో వాల్యూ ఆఫర్ కింద ఎక్స్‌ప్రెస్ వాల్యూ ఫేర్స్ రూ. 1535 నుంచి ప్రారంభం అవుతున్నాయి. ఇక ఈ బుకింగ్స్ చేసుకునేందుకు 2025, మార్చి 2 లాస్ట్ డేట్‌గా ఉంది. అంటే ఆలోగా టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక ఈ ఆఫర్ 2025 సెప్టెంబర్ 19 వరకు వర్తిస్తుంది. అంటే మార్చి 1 నుంచి సెప్టెంబర్ 19 వరకు ఎప్పుడైనా ప్రయాణం చేసే వీలుంటుంది. ఈ ఆఫర్లో ప్రకటించిన ధరలోనే




బేస్ ఫేర్, టాక్స్‌లు, ఎయిర్‌పోర్ట్ ఛార్జీలు ఉంటాయి. కన్వీనియన్స్ రుసుములు, ఇతర అనుబంధ ఛార్జీలు వేరేగా ఉంటాయి. అయితే ఇక్కడ ఈ ఛార్జీల్ని కూడా తప్పించుకోవచ్చు. ఎక్స్‌ప్రెస్ లైట్ ఫేర్స్‌పై ఎయిరిండియాఎక్స్‌ప్రెస్.

కామ్ వెబ్‌సైట్ లేదా ఎయిర్‌లైన్స్ మొబైల్ యాప్ ద్వారా బుక్ చేసుకున్నట్లయితే అప్పుడు జీరో కన్వీనియన్స్ ఫీజు వర్తిస్తుంది.

# ఎట్టకేలకు చిక్కిన బైక్ రేసర్లు

## 38 మంది యువకులపై కేసు నమోదు





విశాఖ (జనంసాక్షి) :

గత కొద్ది రోజుల నుండి విశాఖ బీచ్ రోడ్డులో హల్ చల్ చేస్తున్న బైక్ రేసర్ల భరతం పట్టారు పోలీసులు. నగరంలో పలు చోట్ల నిఘా పెట్టి స్పెషల్ డ్రైవ్ కండక్ట్ చేశారు. బైక్ రేసింగ్లకు పాల్పడుతున్న యువకులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు పోలీసులు. విశాఖలో బైక్ రేసింగ్‌లపై పోలీస్ కమిషనర్ సీరియస్ అయ్యారు. బీచ్ రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో మోడల్ బైకులుతో రేసింగ్‌లు, మితిమీరిన వేగం ప్రమాదకర విన్యాసాలతో రెచ్చిపోతున్నారు బైక్ రేసర్లు. వికెండ్స్ లో సాగర్ నగర్, జోడు గుళ్ల పాలెం, రుషి కొండ, భీమిలి ప్రాంతాల్లో మద్యం మత్తులో, గంజాయి మత్తులో జోరుగా బైక్ రేసింగ్‌లు జరుగుతున్నాయి. బైక్ రేసర్ల ఆగడాలతో వాహనదారులు హడలి పోతున్నారు. ఇంస్టాగ్రామ్ లో గ్రూపులు ఏర్పాటు చేసుకొని మరి యువత రేసింగ్లలో పాల్గొంటున్నారు. 30 మంది యువకులపై కేసుల నమోదు చేసి 38 మోడల్ బైకులు స్వాధీనం చేస్తున్నారు పోలీసులు.

# నడిరోడ్డుపై తగలబడ్డ బ్యాటరీ బైక్

## భయాందోళనలకు గురైన స్థానికులు

పశ్చిమగోదావరి (జనంసాక్షి) :



పశ్చిమగోదావరి జిల్లా మార్టేరు సమీపంలోని నిక్కపూడి గ్రామానికి చెందిన సత్తి పెద్దిరెడ్డి అనే వ్యక్తి తన ఆరా బ్యాటరీ చార్జింగ్ బండి వేసుకుని ఆదివారం మధ్యాహ్నం పని మీద రావులపాలెం వచ్చారు. రావులపాలెంలోని కెనాల్ రోడ్ లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయం సమీపంలోకి వచ్చేసరికి పెద్దిరెడ్డి తన బ్యాటరీ చార్జింగ్ బండిని ఒక వ్యాపార దుకాణం వద్ద ఆపి బండి దిగారు. ఈ లోపు ఒక్కసారిగా బండిలో నుంచి పొగతో కూడిన మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా షాక్ కు గురైన పెద్దిరెడ్డి ఆందోళనతో దూరంగా పరుగులు తీశాడు. అక్కడే ఉన్న సంచుల వ్యాపారులు, ప్రజలు ఎక్కడ బ్యాటరీలు పేలు పోతాయో అని భయపడి వారు కూడా దూరంగా పరుగులు తీశారు. క్షణాల వ్యవధిలో జరిగిపోయిన ఈ సంఘటనతో పెద్దిరెడ్డి అయోమయానికి గురవడంతో స్థానికులు అతని కూర్చోబెట్టి సపర్యలు చేసి ధైర్యాన్ని ఇచ్చారు. సుమారు గంటపాటు ఆ మోటార్ సైకిల్ తగలపడి పోయినంతసేపు అటుగా వెళ్లేందుకు ఎవరూ సాహసించలేదు. రావులపాలెంలో చోటుచేసుకున్న ఈ సంఘటనతో బ్యాటరీ బళ్ళు వాడుపుతున్న వినియోగదారులంతా అమ్మ బాబోయ్ అంటూ భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలో ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలంటేనే భయంగా ఉందని అంటున్నా.

# మేనల్లుడికి మాయావతి షాక్

లక్నో (జనంసాక్షి)



ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతికి చెందిన బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పి) రాజకీయ పార్టీలో పెను మార్పులు చోటుచేసుకున్నాయి. బీఎస్పీ అధినేత్రి తన మేనల్లుడికి షాక్ ఇచ్చింది. ఆకాశ్ ఆనంద్ ను పార్టీ అన్ని పదవుల నుంచి తొలగించింది. దీంతో పార్టీకి ఇద్దరు కొత్త జాతీయ సమన్వయకర్తలు వచ్చారు. ఆకాష్ ఆనంద్ స్థానంలో ఆయన తండ్రి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ కుమార్, రాజ్యసభ ఎంపీ రాంజీ గౌతమ్‌లను బీఎస్పీ జాతీయ సమన్వయ కర్తలుగా మాయావతి నియమించారు. బీఎస్పీ అధ్యక్షు రాలు మాయావతి ఈరోజు లక్నోలో జరిగిన పార్టీ ముఖ్యమైన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో పలు రాష్ట్రాల అధ్యక్షులు కూడా పాల్గొన్నారు. పార్టీ నాయకు లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆకాష్ ఆనంద్‌ను బీఎస్పీ అన్ని పదవుల నుంచి తొలగించారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాయావతి సోదరుడు ఆనంద్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర మిశ్రా పాల్గొన్నారు. రాజ్యసభ ఎంపీ రాంజీ గౌతమ్ కూడా పార్టీ సమావేశానికి హాజరయ్యారు. కానీ, ఆకాష్ ఆనంద్ ఈ సమావేశానికి గైర్హాజరయ్యారు.

గత ఏడాది మేలో, మాయావతి తన మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌ను బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ సమన్వయకర్త, ఆమె వారసుడి పదవి నుంచి తొలగించారు. డిసెంబర్ 2023లో బిఎస్పి అధినేత్రి ఆయనను తన వారసుడిగా ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మాయావతి తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. ఆకాష్ ఆనంద్ రాజకీయంగా పూర్తి పరిణితి చెందే వరకు రెండు ముఖ్యమైన బాధ్యతల నుంచి దూరంగా ఉంటారని ఆమె తెలిపారు.

**ఆకాష్ ఆనంద్ ను అన్ని పదవుల నుంచి తొలగింపు**

**పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ కుమార్, రాజ్యసభ ఎంపీ రాంజీ గౌతమ్‌లను బీఎస్పీ జాతీయ సమన్వయకర్తలుగా**

కాగా గతంలో ఆకాష్ ఆనంద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. సీతాపూర్‌లోని బీజేపీ ప్రభుత్వాన్ని 'ఉగ్రవాద ప్రభుత్వం'గా ఆకాష్ ఆనంద్ అభివర్ణించారు. దీంతో అతనిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. ఇలాంటి ఘటనల నేపథ్యంలో మాయావతి ఆకాష్ ఆనంద్ ను బీఎస్పీ పార్టీ పదవుల నుంచి తొలగించారని సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# రైతులకు రూ.5కే శాశ్వత విద్యుత్ కనెక్షన్

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కీలక ప్రకటన

భోపాల్ (జనంసాక్షి)



మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కీలక ప్రకటన చేశారు. రైతులకు కేవలం రూ.5కే శాశ్వత విద్యుత్ కనెక్షన్ అందిస్తామని చెప్పారు. భోపాల్‌లో నిర్వహించిన ఓ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ మరికొన్ని రోజుల్లోనే ఈ స్కీమ్‌ను ప్రారంభిస్తుందని తెలిపారు. శాశ్వత విద్యుత్ కనెక్షన్ లేని రైతులకు ఈ సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. రైతులకు మంచి చేయాలని, వాళ్ల జీవితాలు బాగుండాలనే తమ ప్రభుత్వం కోరుకుంటుందని తెలిపారు. అంతేకాదు నీటిపారుదల కోసం సోలార్ పైపుల ద్వారా రైతులకు విద్యుత్ సంబంధిత ఇబ్బందులు లేకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాబోయే మూడేళ్లలో 30 లక్షల సోలార్ ఇరిగేషన్ పంపుల్ని రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అంతేకాదు ప్రభుత్వం రైతుల నుంచి సోలార్ విద్యుత్‌ను కొనుగోలు చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో సరైన మౌలిక సదుపాయాలు లేవని విమర్శించారు.

విద్యుత్తు, రోడ్లు లేకపోడవంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితులన్ని మారిపోయాయని తెలిపారు.

# కరీంనగర్‌లో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు



పోటీలను ప్రారంభించిన ప్రభుత్వవిప్ లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**కరీంనగర్ బ్యూరో, మార్చి 02 (జనంసాక్షి) :**

మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాద రావు ఎనభై ఎనిమిదవ జయంతిని పురస్కరించుకుని నగరంలోని రంగినేని గార్డెన్స్ లో ఘనంగా రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. టోర్నమెంట్ కమిటీ చైర్మన్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ నియోజక వర్గ ఇన్చార్జి పురుమళ్ళ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మేడిపల్లి సత్యం మాట్లాడుతూ... శ్రీపాద రావు అజాత శత్రువు అని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారని వారి ఆశయాలను శ్రీధర్ బాబు కొనసాగిస్తున్నారని సూర్య చంద్రులున్నంత వరకు ప్రజలు వారిని మరచిపోరని అన్నారు. శ్రీపాదరావు జయంతి సందర్భంగా రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డికి కరాటే చీఫ్ ఆర్గనైజర్లు వసంత్ కుమార్ కు సురభి వేణు గోపాల్ కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెండవ డివిజన్ మాజీ కార్పోరేటర్ కాశెట్టి లావణ్య శ్రీనివాస్, ఎండి తాజ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ష మల్లేశం, నగేష్ ముదిరాజ్, ఆకారపు భాస్కర్ రెడ్డి, దన్న సింగ్, సుదర్శన్, బొబ్బిలి విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి ప్రదాత దుద్దిల్ల శ్రీపాద రావు

**అదిలాబాద్ ప్రతినిది (జనంసాక్షి)**



దుద్దిల్ల శ్రీపాదరావు ఆంధ్రప్రదేశ్ మాజీ అసెంబ్లీ స్పీకర్ జయంతి వేడుకలను ఆదివారం జిల్లాలో అధికారికంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శ్రీపాద రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ రాజర్షి షాతో పాటు, అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయబాబు, రిటైర్డ్ ఆఫీసర్ రత్నాకర్, డీవైయస్వోబీ వెంకటేశ్వర్లు, డిపీఆర్వో తిరుమల పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. శ్రీపాదరావు మార్చి 2, 1935న జయశంకర్ భూపాలపల్లి జిల్లా ధన్వాడలో జన్మించారని, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ గా పని చేశారన్నారు . ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో శాసనసభకు వన్నె తెచ్చిన స్వర్గీయ నేత శ్రీపాద రావు న్యాయవాదిగా ప్రజలకు మంచి సేవలు అందించారని, ఆయన రాజకీయ ప్రస్థానంలో మొదటిగా సర్పంచ్ గా రెండు సార్లు ఎన్నికై తదుపరి మహాదేవపూర్ సమితి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని, 1984 ఎన్నికల్లో మొదటి సారి మంథని నుంచి శాసన సభ్యులుగా పోటీ చేసి విజయం సాధించి 3 సార్లు శాసన సభ్యునిగా ఎన్నికైనట్లు తెలిపారు. 1994 లో ఓటమి పాలు అయినప్పటికీ ప్రజల మధ్యనే ఉంటూ ఎన్నో సేవలు అందించడం అలాగే 1999 ఏప్రిల్ 13 న మహాదేవపూర్ మండలం అన్నారం వెళ్లి వచ్చే అటవీ మార్గంలో ఆయన మృత్యువాత పడ్డారని అన్నారు. ఆ మహనీయుని గురించి విద్యార్థులు తెలుసుకోవాలని, శ్రీపాద రావు జీవితం నేటి తరానికి ఆదర్శమనీ, స్పీకర్ గా అసెంబ్లీని నడిపించిన తీరు ఎప్పటికి మరువలేనిది అని అదనపు కలెక్టర్ తన సేవలను కొనియాడారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు , సూపెరెండెంట్ శైలజ, పంచపూల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

# ఆపరేషన్ కగార్ అప్రజాస్వామికం

**అడవుల్లోని బలగాలను వెనక్కి తీసుకురండి**

**ప్రజా సంఘాల ఆగ్రహం.. కరపత్రాల విడుదల**

**జవహర్‌నగర్, మార్చి 2 (జనంసాక్షి):**



ఆపరేషన్ కగార్ అప్రజాస్వామికమని ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. మావోయిస్టు రహితంగా చేస్తామని చెబుతున్న బీజేపీ మొండి వైఖరిని విడనాడి.. వెంటనే కేంద్ర, రాష్ట్ర బలగాలను అడవుల్లో నుంచి వెనక్కి రప్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరిం చారు. జవహర్‌నగర్‌లోని అంబేడ్కర్ ప్రధాన చౌరస్తాలో పీఓడబ్ల్యూ (విముక్తి) రాష్ట్ర నాయకురాలు సునీత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పోరాడాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. మతతత్వ, సామ్రాజవాద, కార్పొరేట్ అనుకూల విధానాలతో దేశ ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా విద్వేషపూరితమైన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించకుండా పక్కదారి పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసి మహిళలు, యువకులు, పిల్లలపై ఆధునాతన మరణాయుధాలతో యుద్ధానికి తెగబడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేస్తూ అడవుల్లో తిష్టవేసిన పారామిలటరీ బలగాలను వెనక్కి పిలవాలని డిమాండ్‌చేశారు. మార్చి 1 నుంచి 30వ తేదీ వరకు రెండు తెలుగు రాష్ట్రాలలో జరిగే అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పోరాడాలని పీఓడబ్ల్యూ(విముక్తి) రాష్ట్ర నాయకురాలు సునిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టు జాతీయ కార్యదర్శి షేక్ షావలి, నాయకులు కొన్నె వేణు, రషీద్, సిగరాయగౌడ్, యాకస్వామి, చంద్రన్న, ప్రసాద్, రాంరెడ్డి, యాదగిరి, విజయ్, శంకర్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# లక్ష్యాలు సాధించే విధంగా శ్రమించాలి

అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెనెక్స్ లో వీడ్కోలు వేడుక

**కరీంనగర్ బ్యూరో, మార్చి 02 (జనంసాక్షి) :**



పాఠశాల విద్య మధురానుభూతులను మిగులుస్తాయని, చాలా కీలకంగా వ్యవహరిస్తున్నాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి రేకుర్తిలోని స్వాగత్ ఫంక్షన్హాల్ అల్ఫోర్స్ వావిలాలపల్లి 10వ తరగతి విద్యార్థుల ఫన్, ఫ్రోలిక్ పేరుతో నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు చదువుల తల్లి సరస్వతిమాత విగ్రహానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. విద్యార్థులు ఉపాధ్యాయులు నిర్దేశించి నటువంటి మార్గదర్శకాలను చక్కగా పాటించాలని, లక్ష్యాలు సాధించే విధంగా శ్రమించాలని వారు చెప్పారు. తరగతి గదుల్లో బోధించిన విషయాలు విద్యార్థుల జీవితాలపై చాలా ప్రభావం చూపుతుందని, వారి ఉపాధి అవకాశాలను మెరుగుపరు స్తాయని చెప్పారు. 10వ తరగతిలో అత్యు త్తమ మార్కులను సాధించి విద్యార్థి జీవితం లో పొందేటువంటి మొట్టమొ దటి పట్టాను చాలా ప్రశంసనీయంగా చేసుకోవాలని సూచించారు. ఎంతో మంది మహానుభావులు వారి ఉపాధ్యాయుల మార్గాలను పాటించి, అవలంభించిన విధానాలను చాలా బాగా అమలుపర్చి ఉత్తమంగా ఉండాలని చెప్పారు. విద్యార్థులకు పాఠశాలలో చదువుకున్న రోజులు చాలా మధుర జ్ఞాపకాలను మిగిలుస్తాయని, ప్రత్యేకంగా విద్యార్థులకు లక్ష్యాలను సాధించే విదానాలను సమగ్రంగా సముచితంగా తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు చదువులు చదవాలని ఆశయాల సాధనతో ఉన్నత చదువులు ఉన్నత ఆశయాలను నెరవేరుస్తాయని విద్యార్థులకు సూచించారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ఉత్తమంగా విద్యను అందించినందుకు ఎప్పటికప్పుడు మార్గదర్శకం చేసిన విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి ని, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడంతో పాటు జ్ఞాపికలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఒకరి రక్తం దానం.. మరొకరికి ప్రాణం

**ఏస్ఎస్ఎస్ యువసేన ఆధ్వర్యంలో రక్తదానం**

**హైదరాబాద్ (జనంసాక్షి)**



ఒకరి రక్తం దానంతో కొందరి ప్రాణాలను కాపాడుకోవచ్చునని రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎస్ఎస్ఏస్ యువసేన వ్యవస్థాపకుడు మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి పిలుపునిచ్చారు. మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి ఉత్సవాలను ఎస్ ఎస్ యువసేన ఆధ్వర్యంలో వారం రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎస్ ఎస్ ఎస్ యువసేన ఆధ్వర్యంలో చిరంజీవి బ్లడ్ బ్యాంక్ లో పలువురు యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలు గా పట్నం సునీత మహేందర్ రెడ్డి, బసవరాజు శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీపాదరావు రాష్ట్రానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సంతోష్ రెడ్డి మాట్లాడుతూ పెద్ద ఎత్తున విచ్చేసి పాల్గొన్న యువకులను, సహకరించిన కార్యకర్తలను నాయకులను రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచినా ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఎలైట్ నాచారం అధ్యక్షుడు మామిడాల రాజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సునీల్ రెడ్డి, ఎస్ఎస్ఎస్ యువసేన సభ్యులు కిషోర్ రెడ్డి, కరుణాకర్ ,సాయిచంద్, ఆరెళ్ల శ్రీధర్, అక్షంత్ పడాల, రాజేష్, సాయి కుమార్, రాజశేఖర్, ఉదయ్, కృష్ణ, ఆనంద్, సెబాస్టియన్, కమల్, జెస్సీ, ఆంద్రూ,సన్ని, యశ్వంత్, మహేష్, సృజల్ తధితరులు పాల్గొన్నారు.

# అలివేలు సమ్మిరెడ్డికి శ్రీపాదరావు సేవాపురస్కారం



**కరీంనగర్ బ్యూరో, మార్చి 02 (జనంసాక్షి) :**

శంకరపట్నం మండల కేంద్రానికి చెందిన తెలంగాణ రంగస్థల కళాకారుడు అలివేలు సమ్మిరెడ్డి ఆదివారం రోజున మాజీ స్పీకర్ శ్రీపాదరావు సేవా పురస్కార్ 2025 అవార్డును అందుకున్నారు. తెలంగాణ రంగస్థలం కళాకారునిగా అనేక సంవత్సరాలుగా, మరుగున పడ్డ కళలను వెలుగులోకి తెస్తూ ఆయన చేస్తున్న విశేష కృషి కి గానూ దుద్దిల్ల శ్రీపాదరావు సేవ పురస్కార్ కి అలివేలు సమ్మిరెడ్డి ఎంపికయ్యారు. ఆదివారం కరీంనగర్లో జరిగిన కార్యక్రమంలో సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి , మాజీ శాసనసభ్యులు ఆరేపల్లి మోహన్ చేతుల మీదుగా అలివేలు సమ్మిరెడ్డి సేవా పురస్కర్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అలివేలు సమ్మిరెడ్డి మాట్లాడుతూ... ఈ పురస్కారానికి తనను ఎంపిక చేసిన తెలంగాణ పోకార్ట్స్ అకాడమీ అధ్యక్షులు కృపాదానం కి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. నిష్కలంక రాజకీయ నాయకులు శ్రీపాద రావు పేరిట కలిగిన సేవ పురస్కారాన్ని అందుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. మరుగున పడుతున్న కళలను ప్రోత్సహించడానికి మాజీ స్పీకర్ శ్రీపాదరావు ఎంతో కృషి చేశారని, మారుమూల పల్లెల్లో ఉన్న కళాకారులకు తగిన చేయూతనిచ్చి ప్రోత్సహించారన్నారు. మాజీ స్పీకర్ శ్రీపాదరావు మన మధ్యలో లేకపోయినా ఆయన పేరిట సేవా పురస్కారాలను అందిస్తూ కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.

# ఇంచు భూమి ఆక్రమించినట్లు నిరూపిస్తే.. రాజకీయ సన్యాసానికి సిద్ధం

**ఖమ్మం (జనంసాక్షి)**



రమణ గుట్టలో భూకబ్జా ఆరోపణలపై కాంగ్రెస్ నేత ముస్తఫా తీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రమణగుట్టలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు 57 డివిజన్ కార్పొరేటర్ రఫీదా భర్త ముస్తఫా మాట్లాడుతూ.. బిఆర్ఎస్ నేతలకు సవాల్ చేశారు. కొద్దిమంది అరాచక శక్తులు తమపై పని కట్టుకోని దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నిరాధారణ ఆరోపణలు చేసే వారు మేము, ఇంచు భూమిని ఆక్రమించుకున్నట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసానికి సిద్ధమవుతామని సవాల్ విసిరారు. జిల్లా మంత్రులను బదనం చేసేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దొంగే దొంగ అన్నట్టు మతిభ్రమించి బిఆర్ఎస్ నేత చేస్తున్నా ప్రచారమే దీనికి నిదర్శనమని ఆయన అభివర్ణించారు. గత బిఆర్ఎస్ పాలనలో రమణ గుట్టను తారా స్థాయిలో కబ్జాలు చేసి నిరుపేద ప్రజలను బెదరిస్తూ, భయభ్రాంతులకు గురిచేసి, కబ్జాలు అక్రమాలకు తెరలేపి కటకటాల పాలైన సంగతి నగర ప్రజలకు తెలుసన్నారు. కాంగ్రెస్ పై తమపై తప్పుడు ప్రచారం చేస్తూ అభియోగాలు మోపితే రానున్న రోజులలో ప్రజలు తగిన బుద్ధి చెపుతారని హితవు పలికారు.

**జిల్లా మంత్రులను బదనాం చేసేందుకు తప్పడు ప్రచారం**

**దొంగే దొంగ అన్నట్లు, మతిభ్రమించి మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేతలు**

**రమణ గట్టులో భూకబ్జా ఆరోపణలపై కాంగ్రెస్ నేత ముస్తఫా తీవ్ర ఆగ్రహం**

# స్కానింగ్ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**జగిత్యాల బ్యూరో, మార్చి 2 (జనంసాక్షి)**



: జగిత్యాల పట్టణంలోని జంబిగద్దె సమీపంలో ఆదివారం గ్లోబల్ స్కానిం గ్ సెంటర్ ను స్కానింగ్ సెంటర్ యాజమాన్యం డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి పావని తో కలిసి కరీంన గర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ పట్టణ ప్రాంత ప్రజలు స్కానింగ్ సెంటర్ వినియోగించుకోవాలని, రేడియాలజిస్ట్ డాక్టర్ పావని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, మంచి అనుభవం, అంకితభావం గల డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి – పావని దంపతులు స్కానింగ్ సెంటర్ ప్రారంభించడం శుభ పరిమాణం అని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్కానింగ్ సెంటర్ మిషనరీని పరిశీలించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు, ఆసుపత్రి సిబ్బంది, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అనుచరులు తదితరులు పాల్గొన్నారు.



# పక్షిని ఢీకొట్టిన విమానం

న్యూజెర్సీ : న్యూజెర్సీలోని నెవార్క్ ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ అయిన కాసేపటికే ఫెడెక్స్ కార్గో విమానం పక్షిని ఢీకొట్టింది. ఆ వెంటనే ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. దాంతో విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఇంజిన్‌లో మంటలు రావడంతో విమానం నెవార్క్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యిందని న్యూయార్క్, న్యూజెర్సీ పోర్ట్ అథారిటీ ప్రతినిధి లెనిస్ వాలెన్స్ తెలిపారు. ఈ ఘటనలో విమాన సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని, మంటలు ఇంజిన్‌కు మాత్రమే పరిమితం అయ్యాయని వాలెన్స్ చెప్పారు. అత్యవసర ల్యాండింగ్ కోసం ముందు జాగ్రత్త చర్యగా విమాన రాకపోకలను కొద్దిసేపు నిలిపివేశారు. ఆ తర్వాత రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ఫెడెక్స్ ప్రతినిధి మాట్లాడుతూ విమానం ఇండియానాపోలిస్ వైపు వెళ్తుండగా ఘటన చోటుచేసుకుందని చెప్పారు.

# జాదవ్‌పూర్ యూనివర్సిటీలో ఉద్రిక్తత

విధ్వంసం కేసులో ఒకరు అరెస్ట్

**కోల్‌కతా: (జనంసాక్షి):**



పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థి సంఘం ఎన్నికల తేదీలను వెంటనే ప్రకటించాలని స్టూడెంట్స్ డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల నిరసన హింసాత్మకంగా మారింది. ఉపాధ్యాయ సంఘం కార్యాలయాన్ని వారు ముట్టడించి నిప్పంటించారు. దీంతో యూనివర్సిటీలో పరిస్థితులు అదుపుతప్పాయి. కాగా, మార్చి 1న విద్యా శాఖ మంత్రి బ్రాత్య బసు, జాదవ్ యూనివర్సిటీని సందర్శించారు. విద్యార్థులు ఆయన వాహనాన్ని చుట్టుముట్టి దాడి చేశారు. కారు బానెట్‌ను ధ్వంసం చేశారు. దానిపై బ్రోకర్ అని రాశారు. వాహనంపైకి బూట్లు విసిరారు. విద్యార్థుల నిరసన నేపథ్యంలో మంత్రి బసు రెండు గంటలపాటు వాహనంలో చిక్కుకుపోయారు. పరిస్థితిని నియంత్రించేందుకు పోలీసులు ఇబ్బందిపడ్డారు. మరోవైపు మంత్రి కాన్వాయ్ ముందుకు కదలడంతో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. దీంతో స్టూడెంట్స్ మరింత రెచ్చిపోయారు. మంత్రి బసు కారు విండోను ధ్వంసం చేశారు. దీంతో అద్దం పగలడంతో మంత్రి బసు ఎడమ చేతికి గాయమైంది. ఆయనను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యూనివర్సిటీలో జరిగిన విధ్వంసకర సంఘటనలపై పోలీసులు ఏడు కేసులు నమోదు చేశారు. ఆదివారం ఒకరిని అరెస్ట్ చేశారు.

కాగా, విద్యార్థులను రక్షించడంలో యూనివర్సిటీ యాజమాన్యం విఫలమైందని స్టూడెంట్ సంఘాలు ఆరోపించాయి. విద్యా శాఖ మంత్రి బసు రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. మార్చి 3న పెద్ద ఎత్తున నిరసనకు ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చింది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు ఎలాంటి విఘాతం కల్పించబోమని విద్యార్థి సంఘాలు తెలిపాయి. అయితే యూనివర్సిటీలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. భారీగా పోలీసులను మోహరించారు.

# గ్లెన్ ఫిలిప్స్ స్టన్నింగ్ క్యాచ్

టీమిండియా టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీని ఔట్ చేయడానికి నానా తంటాలు పడుతుంటారు ప్రత్యర్థులు. ఎందుకంటే ఎన్ని వ్యూహాలు పన్నినా వాటిని ఛేదించుకుంటూ పరుగులు చేస్తుంటాడు కింగ్. ఎంత మంది ఫీల్డర్లను మోహరించినా సందుల్లో నుంచి బంతుల్ని తరలిస్తూ తన పని తాను చేసుకుపోతాడు. ఫీల్డింగ్ పొజిషన్స్ చూసుకునే షాట్లను ఎంపిక చేసుకుంటాడు. అయితే కోహ్లీకి ఓ ఆటగాడు షాక్ ఇచ్చాడు. అతడ్ని దాటేసి బంతి వెళ్లిపోతుందని విరాట్ ధీమాగా ఉండగా.. మెరుపు వేగంతో అమాంతం పక్షిలా గాల్లోకి ఎగిరి క్యాచ్ పట్టేశాడు. దీంతో కింగ్ బిత్తరపోయాడు. ఇది భారత్-న్యూజిలాండ్ మ్యాచ్‌లో చోటుచేసుకుంది.

**సైంధవుడిలా అడ్డుపడి..**

చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా కివీస్‌తో జరుగుతున్న ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ తడబడుతోంది. 30 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది టీమిండియా. ఓపెనర్లు రోహిత్ శర్మ (15), శుబ్‌మన్ గిల్ (2) తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (11) ఆదుకుంటాడేమో అనుకుంటే అతడూ పెవిలియన్‌కు చేరుకున్నాడు. అయితే రోహిత్-గిల్ స్వీయ తప్పిదాలతో ఔట్ అయినా.. కోహ్లీ వికెట్ మాత్రం ఓ ఫీల్డర్ మెరుపు విన్యాసం వల్లే పోయింది. అతడే గ్లెన్ ఫిలిప్స్.



మ్యాట్ హెన్రీ బౌలింగ్‌లో ఔట్‌సైడ్ ఆఫ్ స్టంప్‌లో పడిన బంతిని గట్టిగా కొట్టాడు విరాట్. బంతి బౌండరీ లైన్ దాటడం ఖాయమని అనుకున్నాడు. కానీ బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో ఉన్న ఫిలిప్స్ సైంధవుడిలా మధ్యలోనే అడ్డుపడ్డాడు. బాడీని ఫుల్ స్ట్రెచ్ చేసి గాల్లో ఎగిరి క్యాచ్ అందుకున్నాడు. వేగంగా వెళ్తున్న బంతిని పక్కాగా అంచనా వేసి రెప్పపాటులో దూకి పట్టుకున్నాడు.



# రంజీ ట్రోఫీలో కొత్త చాంపియన్..





రంజీ ట్రోఫీ 2024-25 సీజన్ ముగిసింది. ఈసారి విదర్భ జట్టు విజేతగా ఆవిర్భవించింది. కేరళతో జరిగిన ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగియగా.. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆధిక్యంలో ఉండటంతో విదర్భను విజేతగా ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్‌లో 153 పరుగులు, సెకండ్ ఇన్నింగ్స్‌లో 73 పరుగులతో అదరగొట్టిన విదర్భ బ్యాటర్ దానిష్ మలేవాల్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికయ్యాడు. టోర్నమెంట్‌లో 476 పరుగులు చేయడమే గాక.. 69 వికెట్లు పడగొట్టిన హర్ష్ దూబె ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌కు సెలెక్ట్ అయ్యాడు. రంజీ ట్రోఫీలో గత 7 ఏళ్ల వ్యవధిలో విదర్భ జట్టు చాంపియన్‌గా నిలవడం ఇది మూడోసారి కావడం విశేషం.

**కష్టానికి తగిన ఫలితం**

ఫైనల్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 379 పరులకు ఆలౌట్ అయింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కేరళ 342 పరుగులు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన విదర్భ 9 వికెట్లకు 375 పరుగులు చేసింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో స్టార్ బ్యాటర్ కరుణ్ నాయర్ (135) భారీ శతకంతో మెరవడం విశేషం. అతడికి ఈ సీజన్‌లో ఇది 9వ సెంచరీ కావడం మరో స్పెషాలిటీ.

**మొత్తంగా**

సీజన్‌లో అటు బ్యాటర్లు, ఇటు బౌలర్లు సమష్టిగా రాణించడం, ఫైనల్‌లోనూ అదే కంటిన్యూ చేయడంతో మరోసారి చాంపియన్‌గా ఆవిర్భవించింది విదర్భ. ఇంత తక్కువ గ్యాప్‌లో మూడుసార్లు విజేతగా నిలవడం అంటే మాటలు కాదు. ముంబై లాంటి టాప్ టీమ్స్‌కు ఆ జట్టు సవాల్ విసరడం రంజీ ట్రోఫీలో పెరుగుతున్న ప్రమాణాలకు ఉదాహరణ అని చెప్పొచ్చు.

# వరుణ్ అదరహో..

## కివీస్‌ను తిప్పేశాడు

**దుబాయ్ (జనంసాక్షి)**

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో టీం ఇండియా, న్యూజిలాండ్ మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 250 పరుగుల విజయలక్ష్యాన్ని చేధించడంలో కివిస్ వెనుక పడింది. కన్ విలియమ్సన్, మిచెల్ శాంత్నర్, విల్ యంగ్ మినహా మిగతా బ్యాటర్లెవరూ క్రీజ్‌లో నిలబడలేక పోయారు. 250 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్దేశిత 50 ఓవర్లలో మరో 27 బంతులు మిగిలి ఉండగానే 205 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో న్యూజిలాండ్‌పై టీం ఇండియా 44 పరుగుల తేడాతో విజయం సాధించి.. సెమీస్‌లో బెర్త్‌ను ఖరారు చేసుకుంది. 250 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన కివిస్ ఓపెనర్లు విల్ యంగ్, రుచిన్ రవీంద్రల్లో రవీంద్రను ఆరు పరుగులకే హార్దిక్ పాండ్యా బౌలింగ్లో అక్సర్ పటేల్ క్యాచ్ పట్టి పెవిలియన్ బాట పట్టించాడు. అటుపై 49 పరుగుల వద్ద వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో విల్ యంగ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత వన్ డౌన్ బ్యాటర్‌గా వచ్చిన కేన్ విలియమ్సన్ .. సహచర బ్యాటర్లు ఔటవుతున్నా నిలకడగా ఆడుతూ 81 పరుగులు చేశాడు.

కానీ 41వ ఓవర్‌లో అక్షర్ పటేల్ వేసిన చివరి బంతిని కేఎల్ రాహుల్‌కు క్యాచ్ ఇచ్చి కేన్ విలియమ్సన్ ఔట్ కావడంతో కివిస్ ఆట కట్టించారు. డెరిల్ మిచెల్, టామ్ టాథమ్, గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ బ్రేస్ వెల్ ఎల్‌బీడబ్ల్యూ అయ్యారు. భారత్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి ఐదు వికెట్లు, కుల్దీప్ యాదవ్ రెండు, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ ఒక్కో వికెట్ తీశారు.




**ఆ ఎజెండాను ఓడించండి**

**సిపిఐ (ఎం.ఎల్) రెడ్ స్టార్ ప్రధాన కార్యదర్శి పిజె జేమ్స్**

# డీలిమిటేషన్ వెనుక ఫాసిస్ట్ ఎజెండా

**న్యూఢిల్లీ (జనంసాక్షి)**

'నియోజకవర్గాల పునర్విభజన కసరత్తు(డీలి మిటేషన్ ఎక్సర్‌సైజ్)'ను ముందుకు తీసుకురావడానికి మోడీ-షా ద్వయం యొక్క అన్యాయమైన తొందరపాటు, అమితమైన ఆసక్తి, కార్యనిర్వాహక పాలనలో, హిందీ పెత్తనాన్ని అధికం చేయడంగా వున్నది, 'ఒక దేశం ఒకే ఎన్నికలు' మొదలైన వాటికి కొనసాగింపుగా ఎన్నికల సంఘం తాజా మార్పుల కొనసాగింపులో మరొక తెలివిగల ఫాసిస్ట్ చర్య ఇది. 1971-2024 మధ్య కాలంలో వివిధరాష్ట్రాలలో దేశవ్యాప్తంగా జనాభా పెరుగుదలలో విస్తారమైన వ్యత్యాసాలు ఉన్నప్పటికీ, 1973 నుండి వివిధ భారతీయ రాష్ట్రాల నుండి లోక్‌సభ ప్రతినిధుల నిష్పత్తిలో ఎన్నికల నియోజకవర్గాల సంఖ్యలో ఎటువంటి మార్పు లేదు. 1971లో మొదటి సీట్ల స్తంభన తర్వాత, 2001లో రెండవ సారీ పునర్విభజన (ఫ్రీజ్) వచ్చింది.ఇది 2026లో ముగుస్తుంది. ఈ పొడిగింపు యొక్క అసలు ఉద్దేశ్యం, తగ్గిన సంతానోత్పత్తి రేటుతో దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే జనాభా నియంత్రణ చర్యలలో విఫలమైన హిందీ మాట్లాడే ఉత్తర భారత రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటును పొడిగించడం మరియు ప్రోత్సహించడంగా వుంటుంది.



అందువల్ల, దక్షిణాది రాష్ట్రాలు ఎత్తి చూపినట్లుగా, కేవలం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన( డీలిమిటేషన్) కసరత్తు చేస్తే, పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల వారి ప్రాతినిధ్యం తగ్గిపోతుంది. మొత్తం అధికార సమతూకం వారికి వ్యతిరేకంగా ఉంటుంది. మరియు ఇది భారతదేశంలో సమాఖ్య విధానానికి( ఫెడరలిజానికి) మరణ శాసనం అవుతుంది. ప్రస్తుత చట్టం ప్రకారం, జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్ )నిర్వహించాల్సి ఉంటుంది కాబట్టి, ఏళ్ల తరబడి జనాభా పెరుగుదలను ఉద్దేశపూర్వకంగా తగ్గించిన దక్షిణాది రాష్ట్రాలు దాని ద్వారా నష్టపోవడంతో పాటు జరిమానా విధించబడతాయి, పార్లమెంట్లో వారి సంఖ్య తగ్గుతాయి. అందుకే జనాభాతో పాటు ఇతర ప్రమాణాలను తీసుకోవాలనే డిమాండ్‌ను సమాఖ్య స్ఫూర్తిగా (ఫెడరలిజం యొక్క )ప్రతిపాదకులు బలంగా ముందుకు తెచ్చారు, అంటే రాష్ట్రాల నుండి లోక్‌సభ ప్రతినిధుల నిష్పత్తిని అలాగే ఉంచవచ్చు.

అయితే, దక్షిణాది రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని, విస్తృత ఏకాభిప్రాయం ద్వారా సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి బదులు, ఫాసిస్ట్ పాలనలో ఇప్పటివరకు ఉన్న ఎత్తుగడలు ఏకపక్షంగానూ, ఒంటెత్తు పోకడగాను ఉన్నాయి. ఉదాహరణకు, 1971-2024 జనాభా పెరుగుదల రేటు ఆధారంగా నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) కసరత్తు చేస్తే, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లతో కూడిన నాలుగు రాష్ట్రాల్లో 155 లోక్‌సభ స్థానాలు పెరగనుండగా, ఐదు దక్షిణ భారత రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళలో కలిపి 35 లోక్‌సభ స్థానాలు మాత్రమే పెరుగుతాయి. మళ్లీ, ప్రస్తుతం ఉన్న జనాభాను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గాలపునర్విభజన (డీలిమిటేషన్) చేస్తే, రెండు రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్‌లకు మొత్తం దక్షిణ భారతదేశం కంటే ఎక్కువ మంది పార్లమెంటు సభ్యులు ఉంటారు. కావున నియోజకవర్గాల సరిహద్దులను పునర్నిర్మించేటప్పుడు రాష్ట్రాలకు ప్రస్తుతం ఉన్న ఎంపీల నిష్పత్తి నిర్వహణపై విశ్వసనీయమైన హామీ అవసరం.

అయితే, కేంద్రంలోని ఫాసిస్ట్ పాలన, ప్రతి సమస్యను చాకచక్యంగా ఉపయోగించుకోవడంలో నేర్పరి. వివిధ సాకులతో, కారణాలతో 2021 జనాభా గణనను నిరవధికంగా వాయిదా వేస్తున్నప్పటికీ, తన సమాఖ్య వ్యతిరేక, ఏకీకృత ఎజెండాకు అనుగుణంగా నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) కసరత్తును ఉపయోగించుకోవడానికి మొగ్గు చూపుతోంది. ఖచ్చితంగా చెప్పాలంటే, రాష్ట్రీయ స్వయంసేవక సంఘ (ఆర్ఎస్ఎస్) నయాఫాసిజం కింద, నియోజకవర్గాల పునర్విభజన కసరత్తు(డీలిమిటేషన్ ), ఇతర రాజ్యాంగ, చట్టపరమైన మరియు పరిపాలనాపరమైన ఎత్తుగడల మాదిరిగానే, భారత సమాఖ్య స్ఫూర్తిని(ఫెడరలిజాన్ని) కూల్చివేయడానికి మరియు భారతదేశం యొక్క బహుభాషా, బహుళ సాంస్కృతిక, బహుళ-జాతుల స్వభావాలను బలహీనపరిచే పాన్-ఇండియన్ మెజారిటీ ప్రాజెక్ట్‌ను అధిగమించడానికి ఉద్దేశించి ఫాసిస్ట్ రాజ్యం ఆలోచించి చేస్తున్న దుర్మార్గపు చర్య ఇది . భారతదేశంలో సమాఖ్య వాదం( ఫెడరలిజం) వినాశనాన్ని ప్రవచించే ఈ హడావిడి నియోజకవర్గాల విభజన కసరత్తులో (డీలిమిటేషన్ ) స్వాభావిక ఫాసిస్ట్ ఎజెండాను ప్రతిఘటించడానికి, ఓడించడానికి అన్ని ప్రజాస్వామ్య, లౌకిక మరియు ప్రగతిశీల శక్తులు, అన్ని రంగాల శ్రేయోభిలాషులకు, వర్గాలకు మేము విజ్ఞప్తి చేస్తున్నాము.

# పక్షిలా ఎగిరి పట్టేసింది..

విమెన్స్ క్రికెట్‌లో ఇలాంటి క్యాచ్ చూసుండరు

మహిళల క్రికెట్‌లో ఒకప్పటి కంటే ఇప్పుడు ప్రమాణాలు బాగా పెరిగాయి. మెన్స్ క్రికెట్ స్థాయిలో కాకపోయినా భారీగానే ఆదరణ దక్కుతుండటంతో బోర్డులు కూడా విమెన్స్ క్రికెట్ కోసం భారీగా ఖర్చు పెడుతున్నాయి. ఆటగాళ్ల శిక్షణ దగ్గర నుంచి రెమ్యూనరేషన్ వరకు పెద్ద మొత్తంలో డబ్బులు వెచ్చిస్తున్నాయి. ప్రతిభ కలిగిన ప్లేయర్ల జాడపట్టి ఎంకరేజ్ చేస్తున్నాయి. దీంతో మెరికల్లాంటి క్రికెటర్లు వెలుగులోకి వస్తున్నారు. ఒకప్పటితో పోలిస్తే మహిళా క్రికెట్‌లో బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్.. ఇలా ఏ స్టాండర్డ్స్ చూసుకున్నా మెన్స్ క్రికెట్‌తో పోటీపడే స్థాయికి చేరుకున్నాయి. అందుకు విమెన్స్ ప్రీమియర్ లీగ్ బిగ్ ఎగ్జాంపుల్ అని చెప్పాలి. ఈ టోర్నమెంట్‌లో మహిళా క్రికెటర్లు చేసే స్టంట్స్ చూస్తే షాక్ అవ్వాల్సిందే.

**అమాంతం గాల్లోకి ఎగిరి..**

డబ్ల్యూపీఎల్-2025లో ఓ స్టార్ ప్లేయర్ స్టన్నింగ్ క్యాచ్‌తో అందరి ఫోకస్‌ను తన వైపునకు తిప్పుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ విమెన్-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విమెన్ టీమ్స్ మధ్య జరిగిన ఫైట్‌లో ఓ అద్భుతం చోటుచేసుకుంది. ఆర్సీబీ స్టార్ ఆల్‌రౌండ్ ఎలిస్ పెర్రీ కళు చెదిరే రీతిలో ఓ క్యాచ్ అందుకొని అందర్నీ ఆశ్చర్యపరిచింది. రేణుకా బౌలింగ్‌లో డీసీ సారథి మెక్ లానింగ్ కొట్టిన బంతిని గాల్లో పక్షిలా ఎగురుతూ పట్టేసింది పెర్రీ. బంతి తన కంటే ఎక్కువ ఎత్తులో వస్తుండటంతో ముందే అంచనా వేసి చేతుల్ని పైకి తీసుకెళ్లిన పెర్రీ.. అది సమీపించగానే అమాంతం గాల్లోకి ఎగిరి పర్ఫెక్ట్ టైమింగ్‌తో పట్టేసింది. ఆ తర్వాత బాడీని బ్యాలెన్స్ చేస్తూ కిందకు ల్యాండ్ అయింది. ఆర్సీబీ ఓడిపోయినా గానీ ఈ క్యాచ్ మాత్రం హైలైట్‌గా నిలిచింది. పెర్రీ క్యాచ్ వీడియో చూసిన నెటిజన్స్.. మహిళల క్రికెట్‌లో ఇలాంటిది ఎప్పుడూ చూడలేదని కామెంట్స్ చేస్తున్నారు.

# తెలుగు భాషను కాపాడుకోవాలి

## హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి రజిని



**ఖైరతాబాద్, మార్చి 2 :**

దేశాన్ని సైనికులు కాపాడినట్లుగానే.. తెలుగు భాషను భాషాభిమానులు కాపాడుకోవాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి రజిని అన్నారు. లక్డీకపూల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కాలేజీలో యువ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, కిన్నెర ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో 'తెలుగు వెలుగు' పేరుతో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ.. గతంలో ఆలిండియా రేడియోలో జాబులు, జవాబులు, పద్యాలతో రణం, కన్యాశుల్కం, ఆధునిక మహాభారతం, శ్రవ్యవాటిక తదితర అనేక కార్యక్రమాలను ప్రసారం చేస్తూ తెలుగు భాషను ప్రచారం చేసిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ వంగపల్లి విశ్వనాథం, కిన్నెర ఆర్ట్స్ సంస్థ కార్యదర్శి ఎం. రఘురాం, ఇరుకంటి వెంకటేశ్వర శర్మ, డాక్టర్ ఉప్పలపాటి కుసుమ కుమారి, డాక్టర్ ఫణింద్ర, ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్, యువభారతి కార్యదర్శి వెంకటరావు, రవీంద్ర, అశ్వినికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# దుబాయి మాస్టర్ టూర్‌లో ఛాంపియన్ గా వెంకట నారాయణమూర్తి

**హైదరాబాద్ (జనంసాక్షి)**

దుబాయి మాస్టర్ టూర్ (400) ఇంటర్నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో 55 ప్లస్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో హైదరాబాద్ నగరానికి ( కేపీహెచ్‌బీ కాలనీ) చెందిన కొత్వాల వెంకట నారాయణ మూర్తి, ఓల్గా గ్రాడ్జ్ నోవా (రష్యా) తో కలిసి టైటిల్ విజేతగా నిలిచారు. అలాగే పురుషుల డబుల్స్ 55 ప్లస్ విభాగంలో మహారాష్ట్ర పుణేకి చెందిన జితేంద్ర జోషి తో కలిసి కొత్వాల వెంకట నారాయణ మూర్తిల జోడి టైటిల్ రన్నర్ అప్‌గా నిలిచారు. ఈ సందర్భంగా వెంకట నారాయణమూర్తి మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకమైన టెన్నిస్ టోర్నమెంట్లలో 55 ప్లస్ విభాగంలో మిక్స్‌డ్ డబుల్స్‌లో టైటిల్ విజేతగా%ొ% పురుషుల డబుల్స్ విభాగంలో రన్నర్ అప్ గా నిలవడం సంతోషంగా ఉందని అన్నారు. దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు రావడం గర్వంగా ఉందని తెలిపారు. ఈ టోర్నమెంట్ స్ఫూర్తితో రాబోయే టోర్నమెంట్లలో గొప్పగా రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తారని స్పష్టం చేశారు.

# పార్వతమ్మ ఆనందం




- సీఎం రేవంత్ రెడ్డి ఆనందభాష్పాలతో స్వాగతం
- అద్దెకు ఉన్న ఇంటివారిపై సీఎం ఆత్మీయ బంధం

**వనపర్తి బ్యూరో మార్చి 02( జనంసాక్షి) :** వనపర్తిలో 6వ తరగతి నుండి ఇంటర్ వరకు చదివిన తనకు సొంత అక్కల ప్రేమ ఆప్యాయత చూపిన పార్వతమ్మ కుటుంబాన్ని ముఖ్యమంత్రి హోదాలో కలిసి పరామర్శించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి పట్టణానికి పలు అభివృద్ధి పనులు ప్రారంభించడానికి వచ్చిన తాను ముఖ్యమంత్రి హోదాలో తన అక్క అయిన పార్వతమ్మ ఇంటికి రావడం పట్ల పార్వతమ్మ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రిని ఆప్యాయంగా సాధారంగా ఆహ్వానించారు. గతంలో వనపర్తి పట్టణంలోని పార్వతమ్మ గృహంలో అద్దెకు ఉండి ఇంటర్ వరకు చదివిన పాత జ్ఞాపకాలను ముఖ్యమంత్రి గుర్తు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పార్వతమ్మ కుటుంబ సభ్యులను ఆప్యాయతగా పలకరించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి హోదాలో తన ఇంటికి తన తమ్ముడు రావడం పట్ల పార్వతమ్మ ఆనందభాష్పాలతో స్వాగతం పలికింది. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు మేఘా రెడ్డి మధుసూదన్ రెడ్డి, నాయకులు ఒబేదుల్లా కొత్వాల్, సాయి చరణ్ రెడ్డి, శివసేనారెడ్డి, డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి,వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# నా మీద కోపంతో గరీబోళ్లను బలి చేస్తుండ్రు

- కక్షపూరిత రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా కాంగ్రెస్ పార్టీ
- అక్రమ కేసుపై జైలుకు వెళ్లి వచ్చిన రైతు కుటుంబానికి కేటీఆర్ పరామర్శ



**తంగళ్లపల్లి, మార్చి 2 (జనంసాక్షి) :** తన మీదున్న కోపంతో పేదలను బలి చేస్తున్నారని కాంగ్రెస్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో వారం రోజుల క్రితం జైలుకు వెళ్లి బెయిల్ పై ఇంటికి వచ్చిన అబ్బాడి రాజిరెడ్డిని కేటీఆర్ పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 'సారీ రాజన్న నామీద కోపం నీమీద తీశారు' అని అన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని తానెక్కడా చూడలేదని విమర్శించారు. కక్షపూరిత రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా కాంగ్రెస్ పార్టీ మారిందని అన్నారు. 'బాధపడుకుర్రి, భయపడకుర్రు ఎవ్వలకేమైనా ఇదే రకంగా కాపాడుకుంటా అండగా ఉంటా.. ఆదుకుంటా' అని భరోసా కల్పించారు. 'గరీబోళ్లకు కులం, మతం ఉండదు, నీకు నిజంగా అసెన్డ్ భూమి ఉంటే ఉండనీ, ఎందుకు ఉండొద్దు' అని పేర్కొన్నారు. అసైన్డ్ భూమి అనేదే పేదలకు ఇచ్చేదేనని తెలిపారు. 10 ఏళ్ల కేసీఆర్ పాలనలో తాము కక్షలు చేయలేదని, తాము కక్షపూరితంగా వ్యవహరిస్తే వాళ్ళు ఉండేవాళ్లేనాని ప్రశ్నించారు. మన ప్రభుత్వ పాలనలో మన పని మనం చేసుకుంటు ప్రజలకు అండగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, బిజెపి ప్రభుత్వం వచ్చిన వాళ్లకు లాభం చేశామే తప్ప కానీ నష్టం చేయలేదని అన్నారు. ఒక పేదోడు బతుకుదెరువు కోసం టీ స్టాల్ పెట్టుకుంటే దాన్ని కూడా తీసేసిన ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని మండిపడ్డారు. మళ్లీ మంచి రోజులు వస్తాయని, ఇప్పుడు,అప్పుడు ఎప్పుడూ అండగా ఉంటానని ధైర్యం కల్పించారు. కేటీఆర్ వెంట టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావ్, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య,సెస్ చైర్మన్ చిక్కాల రామారావ్,ఫ్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజన్న,బిఆర్ఎస్ జిల్లా నాయకులు బొల్లి రామ్మోహన్,గూడూరు ప్రవీణ్, మాజీ జెడ్పిటిసి కోడి అంతయ్య, మాజీ జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు,నాయకులు తాండ్ర రవీందర్రావు, విజయేందర్ రెడ్డి,వెంకట్రావు, వేణుగోపాలరావు, మిరాల భాస్కర్ యాదవ్,జక్కుల రవీందర్, జక్కుల నాగరాజు,ఎసిరెడ్డి రామ్ రెడ్డి, సత్యానారాయణ రెడ్డి,నక్క కొమురయ్య,కొయ్యడ రమేష్, మోతే మహేష్,సిలివేరి చిరంజీవి,గుండు ప్రేమ్, మాట్ల శంకర్,బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.


# స్మగర్లు, దేశద్రోహులు సినిమాల్లో హీరోలా?

## సినిమాల్లో హీరో పాత్రలపై వెంకయ్యనాయుడు అసంతృప్తి

**హైదరాబాద్, మార్చి 2 (జనంసాక్షి) :** దేశంలో సినీ రంగం పోకడలపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. సినిమాల్లో హీరో పాత్రల తీరుపై దర్శకులు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. ఇటీవల కన్నుమూసిన తెలుగు చిత్ర పరిశ్రమ తొలి తరం నటి, నిర్మాత కృష్ణవేణి సంస్మరణ సభ ఆదివారం హైదరాబాదులో ఫిలింనగర్ కల్చరల్ క్లబ్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా వెంకయ్యనాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు. చెడ్డ పనులను ఎప్పుడూ గొప్పగా చూపించకూడదన్నారు. ఒకప్పుడు సినిమాల ద్వారా ప్రజలకు మంచి సందేశం వెళ్లేదని... ఇప్పుడు స్మగ్లర్లు, దేశ ద్రోహులు, సమాజంలో తప్పుడు విధానాలు పాటించేవాళ్లతో హీరో పాత్రలకు రూపకల్పన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని, దీనివల్ల ఎలాంటి సందేశం వెళుతుందో దర్శకులు ఒకసారి ఆలోచించాలని అన్నారు. చెడ్డ పనులను ఎప్పుడూ గొప్పగా చూపించకూడదని, దీని ప్రభావం పిల్లలపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సినిమా రంగం బాధ్యతాయుతమైన మాధ్యమంగా ఉండాలని వెంకయ్యనాయుడు అభిలషించారు.



# కాలిఫోర్నియాలోని ఎమ్మెల్యే ఇంటికి పొంగులేటి



**పాలకుర్తి, మార్చి 2 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల అమెరికా పర్యటనలో భాగంగా కాలిఫోర్నియాలో ఉన్నారు. ఈ సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆహ్వానం మేరకు మంత్రి వారి నివాసానికి వెళ్లారు. అక్కడ, ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రాజరామ్మోహన్ రెడ్డి దంపతులు మంత్రికి ఆతిథ్యం ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసేవా, ఆరోగ్య రంగంలో ఉన్న అవకాశాలు వంటి అంశాలపై చర్చించారు. ఇలాంటి సమావేశాలు రాష్ట్రం, ప్రవాస భారతీయుల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని భావిస్తున్నారు..



## ఆకే గూడైన వేళ

సాధారణంగా పక్షులన్నీ చెట్ల కొమ్మలపై లేదా గుబురుగా ఉన్న ఆకుల మధ్య ఎవరికీ కనిపించకుండా గూడును నిర్మించుకుని గుడ్లను పెట్టీ పొదుగుతాయి. కానీ "యాశీ ప్రీనియ" అనే చిన్న పక్షి మాత్రం కొమ్మకు ఉన్న ఒకే ఒక ఆకును ఎంచుకుని దానిపై గూడును నిర్మించి అందులో దర్జాగ ఉంటుంది. ఈ చిత్రం అదిలాబాద్ జిల్లా కోసాయి అడవుల్లో కనువిందు చేసింది.

- (వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్, లింగంపల్లి కృష్ణ, ఆదిలాబాద్ ప్రతినిధి)

# హరీష్‌రావు అప్పడెందుకు మాట్లాడలే!

- కొండగట్టు ప్రమాదస్థలికి కేసీఆర్ ఎందుకు పోలేదు?
- ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం




**హైదరాబాద్, మార్చి 2 (జనంసాక్షి) :** కొండగట్టు ఘాట్‌రోడ్డులో బస్సు బోల్తాపడి 65 మంది చనిపోతే కనీసం అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ పరామర్శకు వెళ్లలేదని, ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు అప్పుడెందుకు మాట్లాడలేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదం తీవ్ర బాధకరమైనదన్నారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు నిరంతరం సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభం అయిన పనులను ఎలాగైనా పూర్తి చేసి, నల్గొండ ప్రజల నీటి అవసరాలు తీర్చాలని చూశారని, ఈ ప్రాజెక్టు పనుల్లో అనుకోకుండా జరిగిన ప్రమాదంలో 8 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకర సంఘటన అని అన్నారు. ఈ ప్రమాదస్థలానికి సీఎం ఎందుకు వెళ్ళడం లేదని బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ఉద్దేశంతో రాద్ధాంతం చేస్తున్నారని జగ్గారెడ్డి మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు జరిగిన కొండగట్టు బస్సు ప్రమాదంపై హరీష్ రావు ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. ఆరోజు 65 మంది చనిపోతే మీరేందుకు వెళ్లలేదని అన్నారు. పదేళ్ళ పాలనలో జరిగిన ఘోర ప్రమాదస్థలానికి కేసీఆర్ ఎందుకు వెళ్లలేదని నిలదీశారు. ప్రస్తుతం జరిగిన ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంలో కార్మికుల జాడ తెలియ లేదని, సహాయక చర్యలపై సీఎం స్వయంగా సీఎం క్యాంప్ ఆఫీసు నుంచి పర్యవేక్షించారని స్పష్టం చేశారు. బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని బీజేపీ తమపై ఆరోపణలు చేస్తోందని.. బీజేపీ పార్టీలో బడా నాయకులకే క్రమశిక్షణ లేదని స్వయంగా ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారని, అలాంటివారు తమను ప్రశ్నించడం వింతగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజా పాలన, రాజకీయ స్వేచ్ఛ కలిగిన పార్టీ అని జగమెరిగిన సత్యం అన్నారు. రాజకీయాల్లో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం సహజమే అని, అయితే అవి హద్దుల్లో ఉండాలని జగ్గారెడ్డి హితవు పలికారు.

# ఆవిష్కరణలతో దేశ పురోగాభివృద్ధి

- భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధనకర్




**సంగారెడ్డిప్రతినిధి, మార్చి 2(జనంసాక్షి) :** భారత కంపెనీలు గ్లోబల్ లీడర్లతో పోటీ పడాలని, సాంకేతికత మరియు ఆవిష్కరణల పురోగతి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడానికి కీలకమని భారత ఉపరాష్ట్రపతి జగదీప్ దనకర్ తెలిపారు. సంగారెడ్డిలోని ఐఐటీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్శన విద్యార్థుల మనసులపై చిరస్థాయిగా ప్రభావం చూపించింది. వారిని భవిష్యత్తులో మరింత సృజనాత్మకమైన, నవీనమైన భారతదేశాన్ని నిర్మించడానికి ప్రేరేపించిందని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న జనరేషన్ మార్పు అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భారత కంపెనీలు గ్లోబల్ లీడర్లతో పోటీ పడాలని ఆదివారం సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ హైదరాబాద్ లో ఆయన పర్యటించారు. అభివృద్ధి, ఆవిష్కరణలపై కార్పొరేట్ పెట్టుబడి అవసరాన్ని ప్రాముఖ్యత గా పేర్కొన్నారు. ఐఐటీ హైదరాబాద్ ను ఆలోచన, ఆవిష్కరణ, సాధనలో అగ్రగామిగా నిలిచినందుకు ప్రశంసించారు. ఈ సంస్థ సాంకేతిక పురోగతికి చేసిన గొప్ప కృషిని, భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడంలో దాని పాత్రను గౌరవించారు. ఐఐటీ హైదరాబాద్ యొక్క 300 మంది ప్రతిభాశాలి అధ్యాపక బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. మౌలిక సదుపాయాలు అవసరమైనప్పటికీ, విద్యా సంస్థ విజయాన్ని నిర్ణయించేది అధ్యాపకుల దృక్పథం, కృషి, అంకితభావమే అని స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, ఐఐటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్ చైర్మన్ బివి మోహన్ రెడ్డి, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీ.ఎస్.మూర్తి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ రూపేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు ఏక్ పేడ్ మాకే నామ్ పేరిట వెరైటీ ఆవరణలో ఒక మొక్కను నాటారు.

# ఏటా భక్తరామదాసు జయంతోత్సవాలు నిర్వహిస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, మార్చి 2 (జనంసాక్షి) :** కళలను కళాకారులను చిత్తశుద్ధితో ప్రోత్సహిస్తున్న ప్రజా ప్రభుత్వం మనదని, ఇకపై ప్రతి యేటా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భక్త రామదాసు గా పిలవబడే కంచర్ల గోపన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. రానున్న ఉగాది పండుగ రోజున గద్దర్ తెలంగాణ సినిమా అవార్డుల ప్రదానోత్సవం జరగనున్నదని ఆయన వివరించారు. తెలంగాణ ప్రభుత్వం సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్.బి.ఇండోర్ స్టేడియంలో శ్రీ భక్త రామదాసు 392వ జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ, రోడ్లు భవనాల శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఇక ప్రతి ఏటా తెలంగాణలో వాగ్గేయకారుడు భక్త రామదాసు జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని మల్లు భట్టి విక్రమార్క హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. భక్తిరస వాగ్గేయకార సంకీర్తనల ప్రచారం ద్వారా సమాజంలో సేవాభావం పెంపొందుతుందని, భవిష్యత్ తరాలకు అందించాలని ఆయన కోరారు. గత దశాబ్ద కాలపు ప్రభుత్వంలో కళాకారులకు ప్రోత్సాహమే లేదని, ప్రతి యేటా ఇవ్వాల్సిన నంది అవార్డులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని మల్లు భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే కళాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంగా గద్దర్ అవార్డులను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. నంది నాటకోత్సవాల మాదిరిగా ప్రతి యేటా రాష్ట్ర వ్యాప్తంగా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన కళాకారులకు అవార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ భగవంతుడు అందరికి కళా ప్రతిభ ఇవ్వలేదని, కొంతమంది అదృష్టవంతులకు మాత్రమే ఆ అవకాశం ఇచ్చారని, భగవంతుడు ఇచ్చిన కళలను ప్రజలకు పంచి సమాజ వికాసానికి దోహదపడాలని కోరారు. మంత్రి ధనసరి సీతక్క మాట్లాడుతూ కళాకారులు ఆనందంగా ఉంటే రాష్ట్రం సుభిక్షంగా సస్యశ్యామలంగా ఉంటుందని, కళాకారులకు ప్రభుత్వం నుంచి మెండుగా ఆశీస్సులు ఉన్నాయని కళాకారులు అందరికీ ఈ విషయం చెప్పమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను పంపించినట్లు చెప్పారు.

# మామునూరు ఎయిర్‌పోర్టుపై ఎక్కడలేని అబద్ధాలు

- రేవంత్‌రెడ్డి తానే తీసుకొచ్చానని చెప్పటం సిగ్గుచేటు
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్




**వరంగల్, మార్చి 2 (జనంసాక్షి) :** మామునూరు ఎయిర్‌పోర్టుపై సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడలేని అబద్ధాలు చెబుతున్నారని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ విమర్శించారు. హన్మకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు ధాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మెన్ సుధీర్‌కుమార్‌లతో కలిసి మాట్లాడారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కానీ ఎయిర్‌పోర్టును తానే తీసుకొచ్చానని రేవంత్‌రెడ్డి చెప్పుకోవడం తెలంగాణ ప్రజలను, ఉద్యమాన్ని అవమానించడమేనని అన్నారు. మామునూరు ఎయిర్ పోర్టు రెండవ ప్రపంచ యుద్ధం జరిగేటప్పుడు ఎయిర్ స్ట్రిప్ గా ఏర్పాటు చేశారని, తాను స్కూల్ విద్యార్థిగా ఉన్నప్పుడు1976, 78 కాలంలో వాయు దూత్ సర్వీస్ నడిచేదని, 1980 తర్వాత మూత పడిందని, ఎన్‌సీసీ ఎయిర్ ఫోర్స్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేవాళ్లని, ఆ రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం శ్రద్ధ పెట్టి ఉంటే మామునూరు ఎయిర్ పోర్టు మరోలా ఉండేదని, చిత్తశుద్ధి లేక ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గోదాంగా మారిందని గుర్తు చేశారు. తాను ఎంపీగా ఉన్నప్పుడే అప్పటి కేంద్ర మంత్రి ప్రఫుల్ పటేల్ కు ప్రశ్న రాస్తే .. శంషాబాద్ కు 150 కి. మీ దూరంలో పెట్టొద్దని జీఎంఆర్ సంస్థకు 25 ఏళ్లు రాసిచ్చామని 2005 – 2006 లో రిప్లై వచ్చిందని, ఆ అగ్రిమెంట్ మేరకు అందరూ ఆగిపోయారని తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డ తొలి రోజుల్లోనే మొదటి సీఎం కేసీఆర్ కృషి చేశారు.. జీఎంఆర్ ఎయిర్ పోర్ట్ లో రాష్ట్ర ప్రభుత్వ వాటా ఉంటుందని ప్రయత్నం చేసి జీఎంఆర్ వాళ్ళను ఒప్పించామని తెలిపారు. కేంద్రమంత్రి హర్ దీప్ సింగ్ పూరిని కేటీఆర్ తో కలిసి వెళ్లి మామునూరు అంశం మాట్లాడి ఒప్పించామన్నారు. బీఆర్ఎస్ కృషి లేదని బీజేపీ, కాంగ్రెస్ చెప్పే ప్రయత్నం చేస్తున్నదని, వారి కొట్లాట చూస్తే నవ్వొస్తోందని అన్నారు. ఫ్లయింగ్ ట్రైయినింగ్ ఆర్గనైజేషన్ మామునూరుకు తీసుకురావాలి.. బోయింగ్, ఎయిర్ బస్, ఇండిగో లాంటి అనేక విమానయాన సంస్థల విమానాల రిపేరింగ్ సెంటర్స్ వరంగల్ కు రావాలని ఆకాంక్షించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370